

కొండపిలో 11 గంటల సమయం దాటినా జనం ఎక్కకపోవడంతో వెనుదిరిగి వెళ్లిపోయేందుకు సిద్ధమైన బస్సు

విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దగా జనం వెళ్లిన పరిస్థితి లేదు. జిల్లావ్యాప్తంగా పొదుపు మహిళల తరలింపు కోసం 200 బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. తద్వారా 10 నుంచి 12 వేలమందిని తరలించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రధానంగా ఒంగోలు, ఎస్‌ఎన్‌పాడు, దర్శి, కొండపి నియోజకవర్గాల నుంచి ఎక్కువ సమీకరణ చేయాలని, అలాగే ఇతర మండలాల నుంచి కూడా ఒక మోస్తరుగా చేయాలని భావించారు. ఇక అధికారపార్టీ నేతల ద్వారా దళిత, గిరిజన, మైనార్టీల వారిని, వైసీపీ కార్యకర్తలను నియోజకవర్గానికి ఐదారు వందల మందికి తగ్గకుండా పంపాలన్న ఆదేశాలున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నేతల నుంచి దీనిపై స్పందన కరువైంది. చివరకు అధికారులకు కూడా స్థానిక నేతల నుంచి సహకారం లభించలేదు, మహిళల కోసం బస్సులు ఏర్పాటుచేసినా వారికి భోజనం, ఇతర అవసరాలకు ఎవరు బాధ్యత తీసుకోలేదు. దీంతో చాలాప్రాంతాల్లో విజయవాడ వెళ్లేందుకు మహిళలు విముఖత చూపారు.

అంతా ఖాళీ

వాహనాలైతే వెళ్లాయి.. జనమే లేరు

సామాజిక సమతా సభకు స్పందన కరువు

200 బస్సులు పెట్టినా అవసరమైన ఏర్పాట్లు లేక మహిళలు విముఖత

చాలాచోట్ల పట్టించుకోని వైసీపీ శ్రేణులు

బస్‌లు లేక ఇబ్బందులు పడిన ప్రయాణికులు



ఒంగోలు డిపోలోకి వచ్చి బస్‌లు లేవని తెలిసి వెనక్కి వెళ్తున్న ప్రయాణికులు

ఒంగోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన సామాజిక సమతా సభకు జిల్లావాసుల నుంచి స్పందన కొరవడింది. ఒకవైపు ప్రభుత్వ యంత్రాంగం, మరోవైపు వైసీపీ రాష్ట్ర నాయకత్వం జిల్లా నుంచి భారీగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలను ఆ సభకు తరలించాలని వారం క్రితమే ఆదేశించారు. ఆ మేరకు భారీగా ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో ఆశించినస్థాయిలో స్పందన కనిపించలేదు. రాజధాని అమరావతిని ధ్వంసం చేసిన ముఖ్యమంత్రి జగన్ గత టీడీపీ ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో నిర్మించతలపెట్టిన అంబేడ్కర్ స్మృతివనాన్నీ పట్టించుకోలేదు. మరోవైపు రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో జనం మదిలోంచి వాటన్నింటినీ పక్కనబెట్టేలా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆగమేఘాల మీద ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సామాజిక అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పేరుతో శుక్రవారం ఆ విగ్రహావిష్కరణ, దానికి ముందుగా అక్కడ మునిసిపల్ స్టేడియంలో సామాజిక సమతా సభ పేరుతో ప్రభుత్వం తరఫున భారీ సదస్సును ఏర్పాటు చేశారు. సమీప జిల్లాల నుంచి భారీగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు, మహిళలను పెద్దఎత్తున తరలించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే వైసీపీ తరఫున జన సమీకరణకు పార్టీ ముఖ్యనేతల నుంచి కిందిస్థాయికి ఆదేశాలు వచ్చాయి. వారంరోజులుగా అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి విస్తృత కసరత్తు చేసింది. కలెక్టర్, జేసీ వంటి ఉన్నత స్థాయి అధికారులు పలు సమావేశాలు పెట్టి తదనుగుణంగా బాధ్యతలు సంబంధిత అధికారులకు అప్పగించగా జిల్లా మంత్రి, ఇన్‌చార్జి మంత్రి ఇతర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భాగస్వాములయ్యారు. అయితే శుక్రవారం ఉదయం నుంచి ఆయా నియోజకవర్గాలకు బస్సులు పంపినా జనం నుంచి స్పందన కరువైంది. ఎక్కేవారు లేక కొన్ని బస్సులు వెనక్కివచ్చిన పరిస్థితి.



ఒంగోలులో బస్సుల కోసం వేచి చూస్తున్న ప్రయాణికులు

చొరవ చూపేవారు లేకనే..

కనిగిరి నియోజకవర్గం నుంచి 18 బస్సులు ఇచ్చినా తాజా పరిణామాల నేపథ్యంలో నాల్గవ వంతు మంది కూడా ఎక్కలేదు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండగా దర్శి నియోజకవర్గం నుంచి పెట్టిన 20 బస్సులలో అక్కడి వైసీపీ తాజా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి చొరవతో కాస్తంత మెరుగ్గా జనం వెళ్లినట్లు సమాచారం. ఇక వైసీపీ శ్రేణులు, నాయకుల చొరవతో ఇతరవర్గాల ప్రజలను తరలించాలని అధిష్ఠానం ఆదేశించినా చాలా ప్రాంతాల్లో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు స్పందించకపోవడంతో జిల్లా నుంచి విజయవాడ సభకు నామమాత్రంగానే హాజరు కనిపించింది. ఇదిలాఉండగా జిల్లా నుంచి పెద్దగా జనం వెళ్లకపోయినప్పటికీ 150కిపైగా బస్సులు వినియోగించడంతో రోజువారీ సాధారణ ప్రయాణికులు బస్సులు లేక అవస్థలు పడ్డారు. సంక్రాంతి అనంతరం గ్రామాల నుంచి తిరిగి తాము నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లేవారు మరింత ఇక్కట్లు పడాల్సి వచ్చింది. మరోవైపు జాతీయ రహదారిపై చెన్నై-కోల్‌కత్తా మార్గంలో వెళ్లే వాహనాలను ఒంగోలు పరిధిలోని త్రోవగుంట నుంచి చీరాల వైపు మళ్లించడంతో భారీ వాహనాలు, దూరప్రాంతాలకు వెళ్లే వాహనాల వారు అవస్థలు పడాల్సి వచ్చింది.



ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 19: ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం ప్రయాణికులకు కష్టాలను తెచ్చిపెట్టాయి. ఆ సభకు ప్రజలను తరలించేందుకు జిల్లా నుంచి 160 బస్సులను ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు జారీచేయగా, అందుకనుగుణంగా ఆర్టీసీ అధికారులు కేటాయించారు. తొలుత 200 బస్సులు కేటాయించగా, ప్రజల నుంచి స్పందన కరువైంది. నియోజకవర్గాలకు బస్సులైతే ఏర్పాటుచేశారు గాని, అవసరమైన భోజన, ఇతర ఖర్చులకు ఒక్కపైసా కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడంతో మహిళలు బస్సెక్కేందుకు ససేమిరా అన్నారు. ప్రభుత్వ ఆదేశాలతో ఆర్టీసీ బస్సులు గురువారం రాత్రికే బస్సులను ఆయా ప్రాంతాలకు పంపగా వాటిలో ఎక్కేందుకు జనం ఆసక్తిచూపలేదు. దీంతో కొన్ని బస్సులు పల్లెల్లోనే నిలిచిపోయాయి. మరోవైపు ఒంగోలులోని పట్టణ పొదుపు మహిళలకు ఇక్కడ నుంచి 15 బస్సులు కేటాయించగా, ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో ఒక్కరు కూడా వెళ్లేది లేదని మహిళలు అడ్డంతిరిగారు. దీంతో బస్సులు ఇతర ప్రాంతాలకు తరలించారు. ఈ క్రమంలో రోజువారీ బస్సులు లేక ప్రయాణికులు బస్టాండ్లలో ఇబ్బందులుపడ్డారు. ప్రయాణికుల గోడు మాత్రం ప్రభుత్వానికి పట్టలేదు. ఇతర పట్టణాలకు వెళ్లేవారు, గ్రామీణ ప్రాంత ప్రజలు బస్సుల కోసం గంటల తరబడి పడిగాపులు కాశారు. ఎంతకీ బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

పల్లెవెలుగుల కోసం పడిగాపులు

అసలే స్పందన నిల్, ఆపై ఇన్‌చార్జిల గందరగోళంతో...

అసలే వైసీపీ కార్యక్రమాలకు జనంలో స్పందన అంతంతమాత్రమే కనిపిస్తోంది.. ప్రస్తుతం ఆ పార్టీలో నియోజకవర్గ ఇన్‌చార్జిల మార్పుల నేపథ్యంలో ఏర్పడిన గందరగోళంతో ఎక్కడా ముఖ్యనేతలు ఏమంతగా పట్టించుకోలేదు. ఫలితంగా జిల్లా నుంచి విజయవాడ సభకు హాజరు పలుచనైంది. అధికారులు 200 బస్సులు ఏర్పాటు చేసినా మహిళలు రాక చివరకు 150 బస్సులు మాత్రమే పంపించారు. వాటిలోనూ సగం మంది మించి ఎక్కిన దాఖలాలు లేవు. ఆయా ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం.. ఒంగోలు నగరానికి 15 బస్సులు కేటాయించగా భోజనాలు, ఇతర ఖర్చుల విషయంలో స్పష్టత లేక మహిళలు ఎవరూ వెళ్లలేదు. కొండపి నియోజకవర్గానికి 12 బస్సులు కేటాయించగా, కొండపి వచ్చిన బస్సులో ఎవరూ ఎక్కకపోవడంతో ఖాళీగా వెనుదిరిగింది. ఇతర బస్సుల్లోనూ నామమాత్రంగానే వెళ్లారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరువేల మెజార్టీ వైసీపీకి లభించిన అనంతరం స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు పొందిన చీమకుర్తి మండలానికి ఐదు బస్సులు పంపితే వాటిలో జనాన్ని ఎక్కించేందుకు అధికారులు, అధికారపార్టీ నేతలు అవస్థలు పడ్డారు. చీమకుర్తి పట్టణానికి ఒక్క బస్సు ఇస్తే అది కూడా నిండలేదని సమాచారం.

ఇటు సమ్మె.. అటు ఖాళీల భర్తీ

39వ రోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిన అధికారులు

సమ్మె విచ్ఛిన్నానికి ప్రభుత్వ కుట్ర అంటూ ఆగ్రహం

ఒంగోలు నగరం, జనవరి 19: అంగన్వాడీల సమ్మె శుక్రవారానికి 39వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 24గంటల నిరవధిక దీక్షను కొనసాగిస్తూనే ఉన్నారు. శుక్రవారం దీక్షను ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు నరసింహారావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రారంభించారు. ఒకవైపు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగిస్తుండగా ప్రభుత్వం జిల్లాలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీచేసింది. జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 44 కార్యకర్తలు, 43 ఆయాల పోస్టులకు సీడీపీవోలు నోటిఫికేషన్లు జారీచేశారు. గతంలో ఖాళీగా ఉన్న పోస్టులను ఏళ్లతరబడి భర్తీచేయని ప్రభుత్వం ప్రస్తుతం సమ్మె నేపథ్యంలో హడావుడిగా నోటిఫికేషన్‌ను జారీచేశారు. ఈనెల 27వతేదీ వరకు దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఎనిమిది రోజులు గడువు మాత్రమే అభ్యర్థులకు ఇచ్చి దరఖాస్తులను ఆహ్వానించారు. ఒకవైపు సమ్మె చేస్తున్న వారిపై ఎస్మాను ప్రయోగిస్తామని బెదిరింపులకు పాల్పడుతూనే మరోవైపు నోటిఫికేషన్‌లు జారీచేయటం వెనుక ప్రభుత్వ కుట్ర ఉందని అంగన్‌వాడీలు ఆరోపిస్తున్నారు. ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తుండగా ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధం కొనసాగిస్తూనే ఉంది. యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లవద్దంటూ గురువారం రాత్రి పలువురు యూనియన్ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. అయినా జిల్లా నుంచి విజయవాడకు ఎక్కువసంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు గురువారం రాత్రి తరలివెళ్లారు.

కులగణన ప్రారంభం

సర్వేకు ఆటంకంగా మారిన సర్వర్

అనేక ప్రాంతాల్లో ఒకే ఇంటి వద్ద సర్వర్ కోసం ఎదురుచూపులు

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 19: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరుగుతూ సర్వే చేపట్టారు. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సర్వే ప్రారంభం కాగా ఆదిలోనే సర్వర్ అడ్డంకిగా మారింది. పూర్తిస్థాయిలో సెల్‌ఫోన్ ద్వారా నమోదు చేయాల్సి ఉండటంతో సర్వర్ పనిచేయక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గంటల తరబడి ఒక్కో ఇంటి వద్దనే ఉండాల్సిన వచ్చింది. ఆ కుటుంబంలోని అన్ని వివరాలు నమోదు చేసేందుకు అధిక సమయం పడుతోంది. ఈ పరిస్థితి పశ్చిమప్రాంతంలో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఒంగోలు నగరంలో జరుగుతున్న సర్వేను నగర కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. సిబ్బంది, వలంటీర్లు చేస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

50 ఎయిడెడ్ పాఠశాలలు మూసివేత

ఒంగోలు(విద్య), జనవరి 19 : జిల్లాలో 50 ఎయిడెడ్ పాఠశాలలు మూసివేతకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు జీరో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం మొదట ఉత్తర్వులు జారీచేసింది. దాని ప్రకారం జిల్లాలో 20 పాఠశాలలు మూతపడనున్నాయి. తాజాగా ప్రస్తుతం పదిమందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా డైరెక్టర్ పి.పార్వతి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అలాంటివి 30 ఉన్నట్లు అధికారులు తేల్చారు. దీంతో జిల్లాలో తాజాగా 50 ఎయిడెడ్ పాఠశాలలను శాశ్వతంగా తాళాలు పడే పరిస్థితి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం.. కొమరోలు మండలంలోని ఐదు, గిద్దలూరు మండలంలో ఆరు, మార్కాపురంలో మూడు, వైపాలెం, పుల్లలచెరువు, అర్ధవీడు, దొనకొండ, మార్టూరు, ఇంకొల్లు, పర్చూరు, కొరిశపాడు, కారంచేడులో ఒక్కొక్కటి, ఎన్‌జీపాడు నాలుగు, చీరాలలో మూడు, కనిగిరి, కంభంలో రెండు చొప్పున పాఠశాలలు మూతపడనున్నాయి. జిల్లాలో ఎనిమిది హైస్కూళ్లు, 42 ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. ఈ పాఠశాలల్లో ప్రస్తుతం 180మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలన్నింటిపై ఈనెల 22లోపు చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని డైరెక్టర్ పార్వతి ఆదేశించారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.

గిద్దలూరుపై కుస్తీ.. కనిగిరిలో రభస

స్థానికుడా ? స్థానికేతరుడా?

అభ్యర్థుల ఎంపికకు ఆర్థిక స్థోమతే ప్రామాణికం

రేపు హైదరాబాద్‌లో బాలినేని వద్ద సమావేశం

కనిగిరిలో పోటాపోటీగా ఇరువర్గాలు

కొందరు రాజీనామాలు చేసినా ఇవ్వని పత్రాలు

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జిపై ఆ పార్టీ అధిష్ఠానం ఇంకా కుస్తీ పడుతూనే ఉంది. మరో వైపు కనిగిరి అభ్యర్థి మార్పుతో ఆ నియోజకవర్గంలోని వైసీపీలోని ఇరువర్గాలు పోటాపోటీగా బజారుకెక్కాయి. శుక్రవారం బాలినేని సీఎంతో భేటీ అయినా గిద్దలూరు ఇన్‌చార్జిపై స్పష్టత రాలేదు. దీంతో సీటు ఆశిస్తున్న వారితో మాట్లాడాలని సీఎం ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి జిల్లాలోని పార్టీ ఇన్‌చార్జిల ఎంపికపై మరోసారి గురువారం సీఎం జగన్‌రెడ్డి ఎమ్మెల్యే బాలినేనితో భేటీ అయ్యారు. మార్కాపురం నుంచి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, కందుకూరు నుంచి మహీధర్‌రెడ్డిలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మార్కాపురం, కందుకూరుతోపాటు ఒంగోలు స్థానాలపై ఇప్పటికిప్పుడు ప్రకటన ఇవ్వనప్పటికీ నాగార్జునరెడ్డి, మహీధర్‌రెడ్డి, బాలినేనిలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం.



పామూరులో పదవులకు రాజీనామా పత్రాలు చూపిస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

కనిగిరిలో గందరగోళం

సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌ను తప్పించి జడ్పీటీసీ సభ్యుడు దద్దాల నారాయణయాదవ్ పేరును ప్రకటించిన కనిగిరి నియోజకవర్గం వైసీపీలో రభస మొదలైంది. విజయవాడలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లేందుకు బుర్రా అనుచరగణం విముఖత చూపింది. నారాయణ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవటంతో ఆయనా రంగంలోకి రాలేదు. బుర్రా వ్యతిరేకవర్గం విజయవాడ కార్యక్రమానికి వెళ్లినప్పటికీ కనిగిరి వాహనాలు ఖాళీగానే విజయవాడ వెళ్లటం కనిపించింది.

ఇక బుర్రకు అనుకూలంగా పార్టీకి, స్థానిక సంస్థల పదవులకు ఆయన అనుచరులు రాజీనామాలు చేయటం ప్రారంభించారు. పామూరులో ఎంపీపీ మరికొందరు నేతలు రాజీనామా పత్రాలు చూపించి ప్రకటన చేయగా, మిగిలినచోట రాజీనామాలు చేసిన వారు మాటలకే పరిమితమయ్యారు. కనిగిరిలో 20 మంది వరకు ఆ పార్టీ కౌన్సిలర్లు ఉండగా బుర్రాకు మద్దతుగా ఏడుగురు మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కనిగిరి ఏఎంసీ చైర్మన్ కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన మండలాల్లో రాజీనామాల పరంపర స్వల్పంగానే జరిగింది. ఇంకో వైపు బుర్రా వ్యతిరేకవర్గం ఆ రాజీనామాల పరంపరకు అడ్డు వేసేందుకు విశ్వప్రయత్నం చేసి కొంతమేరకు సఫలీకృతులయ్యారు. మొత్తమ్మీద ఎమ్మెల్యే బుర్రా తీవ్ర అసంతృప్తితోనే ఉన్నారు. ఆయన విజయవాడలో ఉండి ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ అధిష్ఠానం నిర్ణయంపై తాడోపేడో తేల్చుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆయన వియ్యంకుడు అయిన కృష్ణా జిల్లా, పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పార్థసారథి ఇప్పటికే టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో ఎమ్మెల్యే బుర్రా తన రాజకీయ భవితవ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశం చర్చనీయాంశంగా మారింది.

కొత్త ట్విస్టుకు అవకాశం

ఇదే సమయంలో అధిష్ఠానం మదిలో మరికొన్ని పేర్లు కూడా ఉన్నాయి. గిద్దలూరు అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ టికెట్‌ను దృష్టిలో ఉంచుకొని వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డిల పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇద్దరి పేర్ల విషయంలో ఎలాంటి లీకులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. మొత్తంగా ఒంగోలు పార్లమెంట్, గిద్దలూరులపై అధికార వైసీపీలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయనే విషయం ఆసక్తిదాయకంగా మారింది.

గిద్దలూరుపై హైడ్రామా

కాగా గిద్దలూరు అభ్యర్థి ఎంపికపై హైడ్రామా కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడ రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయం జరిగినప్పటికీ ఎవరిని ఎంపిక చేయాలనే విషయంపై స్పష్టత రాలేదు. టికెట్ ఆశిస్తున్న వారిలో ఆర్థిక స్థోమత ఉన్నవారు ఎవరా? అన్న విషయంపై ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిసింది. ఒకరిద్దరు నాయకుల నుంచి రూ.20కోట్లను వెంటనే చూపించగలరా అని అధిష్ఠానం ఆరా తీసినట్లు తెలిసింది. ఆ మేరకు టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో స్థానికులు, స్థానికేతరులతో కూడా చర్చించి ఒక అభిప్రాయానికి రావాలని బాలినేనికి సీఎం జగన్ సూచించినట్లుగా సమాచారం. తదనుగుణంగా బాలినేని ఆదివారం హైదరాబాద్ వచ్చి తనను కలవాలని టికెట్ ఆశిస్తున్న నాయకులకు సమాచారం పంపినట్లు తెలిసింది. స్థానికేతరుడైన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గానికి సంబంధించి టికెట్ ఆశిస్తున్న వారిలో రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలతోపాటు ఒక డాక్టర్ మరో ఇద్దరు నాయకుల పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. వారిలో గతంలో టికెట్ ఆశించి చాన్స్ దక్కని ఎన్ఆర్ఐ ఐవీరెడ్డి కూడా ఉన్నారు.






రామతీర్థం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

నీటి మట్టం 80మీటర్లలోపే..


జలాశయంలో ఉన్న నీరు

చీమకుర్తి, జనవరి19 : రామతీర్థం జలాశయంకు సాగర్‌జలాల సరఫరా రోజురోజుకు తగ్గుముఖం పట్టింది. నిన్నా మొన్నటి వరకు 1000 క్యూసెక్‌ల వరకూ వచ్చిన జలాలు శుక్రవారం 400క్యూసెక్‌లకు లోపు వస్తున్నాయి. కాగా రామతీర్థం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 85.34మీటర్లు కాగా ప్రస్తుతం 80మీటర్ల లోపు మాత్రమే ఉంది. అయితే జలాశయం పూర్తిస్థాయిలో నిండకపోతే రాబోయే వేసవికి తాగునీటికి గడ్డు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.








నిండు నూరేళ్ళు ఆయురారోగ్య,
అష్టైశ్వర్యాలతో
ప్రజాసేవలో కొనసాగాలని కోరుకుంటూ...
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారికి
జన్మదిన
శుభాకాంక్షలు
గుమ్మడి సాయిబాబు
నాగులుప్పలపాడు మండలం
కాకర్ల లక్ష్మీవరప్రసాద్ (చిన్నా)
మండల టీడీపీ కార్యదర్శి, నాగులుప్పలపాడు


జన్మదిన శుభాకాంక్షలు
జనహృదయనేత, ఒంగోలు నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసిన
తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ శాసనసభ్యులు శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారికి
హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
పోలవరపు వెంకట్రామయ్య
రాష్ట్ర తెలుగు రైతు ఆర్గనైజింగ్ సెక్రటరి
కామేపల్లి శ్రీనివాసరావు
Ex.AMC ఛైర్మన్, ఒంగోలు
నలమోతు బాలగంగాధర్
ఒంగోలు మండల టీడీపీ అధ్యక్షులు
మక్కెన శ్రీనివాసరావు
ఒంగోలు నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు
గుండపనేని శ్రీనివాసరావు
MPTC, యరజర్ల
మండువ వెంకటసుబ్బయ్య
సర్పంచ్, మండువవారిపాలెం
నన్నపనేని వెంకటేశ్వరరావు
సర్పంచ్, దేవరంపాడు
యర్రంనేని నరసింహారావు
ఒంగోలు మండల టీడీపీ మాజీ అధ్యక్షులు
యర్రంనేని వెంకటశేషయ్య
మండల టీడీపీ నాయకులు
యర్రా ఆంజనేయులు
టీడీపీ నాయకులు, ఉలిచి
కొక్కెలగడ్డ ప్రభాకరరావు
Ex. సర్పంచ్ దేవరంపాడు హరిజనవాడ
చాపల సోమరాజు
మాజీ సర్పంచ్, చింతాయిగారిపాలెం
మారెళ్ళ రామకృష్ణ
Ex. సర్పంచ్, మండువవారిపాలెం
కోమటినేని ఉదయభాస్కర్
Ex. సర్పంచ్, మండువవారిపాలెం
అన్నమ్ వెంకటేశ్వర్లు (వెంకన్న)
Ex. సర్పంచ్, చెరువుకొమ్ముపాలెం
పాతూరి పూర్ణచంద్రరావు
మండల టీడీపీ నాయకులు
పిల్లుట్ల సుధాకరరావు
రాష్ట్ర BC సెల్ టీడీపీ నాయకులు
పావులూరి బాపయ్య చౌదరి
ఒంగోలు పార్లమెంట్ వాణిజ్య విభాగం కార్యదర్శి
పెంట్యాల రాధాకృష్ణమూర్తి
బిల్డర్, హైదరాబాద్, ఒంగోలు
మారెళ్ళ రాజేంద్రప్రసాద్
టీడీపీ నాయకులు
పోలవరపు శ్రీనివాసరావు
ఉప సర్పంచ్, కరవది
కారుమూడి ప్రభాకరరావు
Ex.ఉప సర్పంచ్, మండువవారిపాలెం
పోలవరపు చెంచురామయ్య
Ex.ఉప సర్పంచ్, కరవది
కారుమూడి గోపినాథ్
గ్రామ టిడిపి అధ్యక్షులు మండువవారిపాలెం
ముప్పవరపు శ్రీనివాసరావు
టీడీపీ నాయకులు
పాలేటి ప్రభాకర్‌రావు
ఒంగోలు మండల టీడీపీ కార్యదర్శి
గొలిమి చంద్రమౌళి
మండల టీడీపీ ఎస్సీ సెల్ అధ్యక్షులు
శింగోతు వెంకటేశ్వర్లు
Ex.MPTC, గుండాయపాలెం
గద్దె వెంకటకృష్ణ
గ్రామ టీడీపీ అధ్యక్షులు, చేజర్ల
శింగోతు ఏడుకొండలు
గ్రామ టీడీపీ అధ్యక్షులు, గుండాయపాలెం
గొర్రెముచ్చు శేఖర్
ఒంగోలు పార్లమెంట్ ఎస్సీ సెల్ ప్రచార కార్యదర్శి
అంచెల సుబ్బారావు
Ex.ఉప సర్పంచ్, కరవది
గుట్లపల్లి రవితేజ
ఒంగోలు మండల టీడీపీ యువత అధ్యక్షులు
చుంచు శింగయ్య
గ్రామ టీడీపీ అధ్యక్షులు, ఉలిచి
పుచ్చకాయల సుబ్బారావు
టీడీపీ నాయకులు, సర్వేరెడ్డిపాలెం
దొడ్ల రామకృష్ణారెడ్డి
గ్రామ టీడీపీ అధ్యక్షులు, పాతపాడు
చప్పిడి శేషయ్య
టీడీపీ నాయకులు, బి.వి.పాలెం
గల్లా సురేష్‌బాబు
గ్రామ టీడీపీ అధ్యక్షులు, బి.వి.పాలెం
వలేటి రాంబాబు
గ్రామ టీడీపీ అధ్యక్షులు, వలేటివారిపాలెం
కంటినేని సుబ్బారావు
టీడీపీ నాయకులు, కరవది
చెరుకూరి రామకృష్ణ
టీడీపీ నాయకులు, కరవది
కంకణాల శ్రీనివాసులు
టీడీపీ నాయకులు, యరజర్ల
వడ్లమూడి బాలాజి
టీడీపీ నాయకులు, పెద్దదేవరంపాడు
చేజర్ల పవన్‌కుమార్
టీడీపీ నాయకులు
పసుపులేటి వెంకటయ్య
టీడీపీ నాయకులు
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారు
మాజీ శాసనసభ్యులు, ఒంగోలు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు

ఎమ్మెల్యే స్వామి ఆధ్వర్యంలో టీడీపీలోకి 10 కుటుంబాలు



సింగరాయకొండ, జనవరి 19 : మండలంలోని ఊళ్లపాలెం పంచాయతీ పరిధి బేసిన్‌పల్లెపాలెం వైసీపీ చెందిన 10 కుటుంబాలు శుక్రవారం టంగుటూరు మండలం తూర్పునాయుడుపాలెంలో ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వైసీపీకి చెందిన తంబు పెద కోటేశ్వరరావు, చిన కోటేశ్వరరావు, సిద్ధు, నరసింహారావు, శ్రీను, అంజయ్య, శ్రీనులకు పార్టీ కండువాలు కప్పి సాదరంగా స్వామి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో కూనపరెడ్డి సుబ్బారావు, మించల బ్రహ్మయ్య బాయిరెడ్డి మురళి, కానాల బాలాజీ, నూతలపాటి కృష్ణ చైతన్య, కొక్కిలగడ్డ శ్రీనివాసులు, బాలసుందరరావు, నాయుడు నాగరాజు, మునలయ్య, శ్రీను, మాధవ పాల్గొన్నారు.

భార్యపై హత్యాయత్నం చేసిన వ్యక్తికి ఐదేళ్ల జైలు

ఒంగోలు(క్రైం), జనవరి 19: భార్యపై హత్యాయత్నం చేసిన భర్తకు ఐదేళ్ల జైలు శిక్ష, రూ.13 వేలు జరిమాన విధిస్తు న్యాయాధికారి కె.సత్యకుమారి శుక్రవారం తీర్పు నిచ్చారు. టంగుటూరు కు చెందిన ఇండ్ల నవీన్ భార్యను రోకలిబండ బాది హత్యాయత్నం చేశాడు. ఈ మేరకు 2017 జనవరిలో కేసు నమోదుచేసిన పోలీసులు కోర్టులో చార్జీషీట్ దాఖలు చేశారు. ఈ మేరకు విచారణ చేసిన న్యాయాధికారి నిందితుడు నవీన్‌పై నేరారోపణ రుజువు కావడంతో ఐదేళ్ల జైలు, జరిమాన విధించారు. ప్రాసిక్యూషన్ తరుపున అదనపు పీపీ మోరబోయిన పద్మజ తన వాదనలు వినిపించారు.











వీఏ టోకరా !

రూ.30 లక్షల స్వాహా

నాగులుప్పలపాడు,(ఒంగోలురూరల్), జనవరి 19: ఒమ్మెవరంలో ఘరానా మోసం వెలుగుచూసింది. పొదుపు సంఘాలపై వీఏగా పనిచేస్తున్న మాయలేడి రూ.30 లక్షలు గ్రామ సమాఖ్య ఖాతా నుంచి నగదు డ్రా చేసింది. ఆమె కుమారుల సహాయంతో అక్రమంగా నగదును దోచింది. దీనిపై అధికారులు విచారణ ప్రారంభించడంతో రాత్రికి రాత్రే గ్రామం నుంచి తల్లీ కుమారులు పరారయ్యారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఒమ్మెవరంలో ఇంచుమించు 30 పొదుపు గ్రూపులున్నాయి. వీఏగా కోట అనిత పనిచేస్తున్నారు. ఈక్రమంలో గత ఏడాది జూలై మాసంలో పొదుపు మహిళలకు తెలియకుండా వారిపై నేరుగా స్త్రీనిధి రుణాలు తీసుకున్నారు. ఆ నగదు గ్రామ సమాఖ్య ఖాతాకు మళ్లించుకన్నారు. అనంతరం ఆ నగదును నేరుగా తన ఖాతాతోపాటు తన కుమారులు కోట వంశీకృష్ణ, కోట నితిన్ ఖాతాలకు మళ్లించారు. ఈ విషయాన్ని గ్రామంలో ఆరు నెలలపాటు గుట్టుగా కప్పేట్టేశారు. అయితే రికవరీ చేసే క్రమంలో గురువారం గ్రామానికి సీసీ కవిత వచ్చారు. విచారణలో పొదుపు మహిళలు తాము ఎలాంటి రుణం తీసుకోలేదని చెప్పారు. దీంతో సదరు వీఏను అధికారులు బాధ్యురాలని చేశారు. దీనిపై విచారణ ప్రారంభం కావడంతో గురువారం రాత్రికి రాత్రే వీఏ కోట అనిత, ఆమె కుమారులు వంశీకృష్ణ, నితిన్‌లు పరారయ్యారు. మరోసారి శుక్రవారం సీసీ విచారణకు రావడంతో గ్రామస్థులు సీసీని నిలేశారు. అధికారుల ప్రోత్సాహంతోనే ఇదంతా జరిగిందని, అనిత పారిపోవడానికి కూడా సహకరించారని మండిపడ్డారు. వైకేపీ పీడీ వసుంధరకు సైతం ఫోన్ చేశారు. అయితే ఆమె సక్రమంగా స్పందించలేదని వాపోయారు. గ్రామస్థులు అనంతరం మూకుమ్మడిగా నాగులుప్పలపాడు పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని ఫిర్యాదు చేశారు. అయితే దీనిపై సమగ్ర విచారిస్తామని ఎస్సై హరిబాబు తెలిపారు.

అనుమానంతోనే విచారించాం : ఏపీవో రవికుమార్

ఈ అవినీతిలో అధికారుల పాత్ర ఉందనేది అవాస్తవం. అయితే వీఏ తీరుపై అనుమానం ఉండడంతో గ్రామంలో క్షేత్రస్థాయిలో విచారించాం. దీంతో ఈ అవినీతి వెలుగుచూసింది. మా వైపు నుంచి మొత్తం అవినీతి ఎంత జరిగింది వెలికితీస్తాం. శాఖపరంగా తగు చర్యలు తీసుకుంటాం.

పబ్లిక్ నోటీసు

ఇందుమూలంగా యావన్మంది ప్రజానీకానికి తెలియజేయునది ఏమనగా మా క్లయింటు అయిన **షేక్ సత్తార్ సాహెబ్ కుమారుడు** అయిన **షేక్ చిన్న మస్తాన్,** నివాసం మఠం బజారు, కర్నూల్ రోడ్, ఒంగోలు అను వారు **తేది.20-4-1990** న ఒంగోలు రిజిస్ట్రార్ ఆఫీసులో రిజిస్టర్ కాబడిన డాక్యుమెంట్ **నెం.1746/1990** ద్వారా ఒంగోలు ప్రాపర్టీని కొనుగోలు చేసియున్నారు. సదరు ఆస్థిని అమ్మకానికి ఉంచి అందుగాను తన ఆస్థి ఒరిజినల్ దస్తావేజులను **తేది.03-01-2024** న జిరాక్స్ నిమిత్తమై సాయిసరోజ్ మయూరి థియేటర్ వద్ద జిరాక్స్ సెంటర్ వెళుతుండగా మార్గమధ్యంలో సదరు దస్తావేజు పోయినది. కావున ఎవరికైనా పైన తెలిపిన దస్తావేజు ఒరిజినల్ దొరికినచో మాకు అందజేయగలరు, మరియు ఈ విషయమై ఎవరికైనా ఎటువంటి అక్షేపణలు ఉన్న ఎడల వారు ఏడు రోజులలోపు తెలియజేయగలరు.

ఇట్లు: **బి. వెంకటరెడ్డి,** B.Sc., LLB
అడ్వకేట్, గోల్డెన్ టవర్స్, ఒంగోలు,
సెల్:97030 21077



ఆంధ్రజ్యోతి ప్రతిరోజు క్లాసిఫైడ్స్

ప్రతి అవసరానికి వేగవంతమైన ఫలితం

అమ్మబడును

■ అమరావతిలో గజం 5,500/- ఒంగోలు టౌన్‌లో గది 30,000/- కందుకూరు టౌన్ రెవెన్యూ కాలనీలో 30,40 గదులు ఇంటి స్థలం నూతన బైపాస్ ప్రక్కన పొలములు కలవు. సంప్రః **9704250705**

AJO-183652

మధువర్షిణి మ్యారేజెస్

■ మధువర్షిణి మ్యారేజెస్, గత **21** సం॥లుగా అన్ని కులముల వారికి 1వ / 2వ పెండ్లి సంబంధములు కుదుర్చుచున్న సంస్థ. సంప్రః కోట రవినాయుడు (టీచర్) అన్నవరప్పాడు, 4వ లైను, ఒంగోలు. **9392192193**

AJO-170472

FLAT FOR SALE

■ ఒంగోలు కొప్పోలు రోడ్ లోని డ్రీమ్స్ స్కూల్ వెనుక గల 3 బెడ్‌రూం. గ్రూప్ హౌస్ అపార్ట్‌మెంట్ రెడి టూ ఆక్యుపై సంప్రః అమరా కన్‌స్ట్రక్షన్స్. సెల్: **9440265170, 9164217325.**

AJO-151217

WANTED

■ మా అపోలో పైప్స్ సంస్థ నందు వర్క్ చేయుటకు అనుభవం కలిగిన అకౌంటెంట్ మరియు సేల్స్ రిప్రజెంటేటివ్స్ కావలెను. అనుభవంను బట్టి జీతం ఇవ్వబడును. సెల్: **9440265170, 9164217325**

AJO -151218

HOUSE FOR SALE

■ ఒంగోలు కర్నూల్‌రోడ్ లింగారెడ్డి అపార్ట్‌మెంట్ రోడ్ 160 చ॥గ॥లో నూతనంగా నిర్మించిన పడమర ఫేసింగ్ 3 ఇండిపెండెంట్ (2BHK) ఇల్లులు అమ్మకమునకు కలవు. వెంటనే సంప్రః SSS హోమ్స్ సంప్ర॥ సెల్: **9703998899, 7569476242**

AJO-183520

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి






HAPPY BIRTH DAY
to
Young & Dynamic Leader
Sri Damachaarla
Janardhana Rao
Sir...
Sri Damacharla Janardhana Rao Garu
TDP State Vice President
Ex-MLA, Ongole
Veeragandham Devendranadh Chowdary
Ammanabrolu(Vi), N.G.Padu(MD), Ongole.


జన్మదిన శుభాకాంక్షలు
HAPPY BIRTHDAY
Sir...
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారు
మాజీ శాసనసభ్యులు, ఒంగోలు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు
తమ్మిశెట్టి రమాదేవి, M.S.W
A.P. స్టేట్ ఉమన్స్ మాజీ కమీషన్ మెంబరు, ఒంగోలు
టిడిపి బిసి సాధికార సమితి సమన్వయకర్త
రాష్ట్ర టీడీపీ 3వ జోన్ కో ఆర్డినేటర్


జన్మదిన శుభాకాంక్షలు
మా అన్న
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారికి
జన్మదిన శుభాకాంక్షలు...
మీ...
చుండూరి రఘురామ్
తెలుగు యువత అధ్యక్షులు, మద్దిపాడు మండలం


జన్మదిన శుభాకాంక్షలు
నిస్వార్థ సేవాతత్పరులు, ఒంగోలు నగరాన్ని
అన్ని రంగాలలో తీర్చిదిద్దిన అభివృద్ధి ప్రధాత,
ప్రకాశం జిల్లా రథసారథి
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారికి
మా హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు
శ్రీదామచర్ల జనార్ధన్‌రావు గారు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు
మాజీ శాసనసభ్యులు, ఒంగోలు
పాటిబండ్ల వెంకటేశ్వర్లు
టీడీపీ నాయకులు
మంగమూరు రోడ్డు
మలినేని లక్ష్మీనారాయణ
టీడీపీ నాయకులు
మంగమూరు రోడ్డు
కందిమళ్ళ బ్రహ్మయ్య
(KBH Homes)
టీడీపీ నాయకులు
మంగమూరు రోడ్డు


జన్మదిన శుభాకాంక్షలు
ఒంగోలు నియోజకవర్గ
అభివృద్ధి ప్రధాత, పేద,
బడుగు, బలహీనవర్గాల
ఆశాజ్యోతి, నిస్వార్థ
ప్రజానాయకులు,
రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు
గౌ॥శ్రీదామచర్ల జనార్ధన్‌రావు గారికి
మా హృదయపూర్వక
జన్మదిన శుభాకాంక్షలు
గౌ॥శ్రీదామచర్ల జనార్ధన్‌రావు గారికి
రాష్ట్ర టిడిపి ఉపాధ్యక్షులు
శింగమనేని తేజ సుధాచరణ్
కృష్ణతేజ ఆక్వాఫామ్స్, చింతల
కృష్ణ శింగమనేని
టిడిపి వర్కింగ్ ప్రొఫెషనల్
శింగమనేని చంద్రశేఖర్‌రావు - పద్మావతి
శ్రీ అనంత కోదండ రామస్వాముల
వారి దేవాలయము :కొప్పోలు
వంశపారంపర్య ఆలయ ధర్మకర్త


ఒక సామాజిక కార్యకర్తగా,
ఒక సంఘసంస్కర్తగా,
ఒక రాజనీతి నిపుణుడిగా,
మీ మార్గదర్శకత్వం, సర్వజ్ఞతకు నిదర్శనం.
మీ మంచి మనసు,
ఆచరణీయమైన మీ వ్యక్తిత్వం,
మీ నిరాడంబర జీవితం,
మీ సమర్థత, మీ నేర్పు, మీ విజన్
మరియు భావితరాల భవిష్యత్తును కోరే
"స్ఫూర్తి ప్రదాతగా" మరియు
శ్రీ దామచర్ల జనార్ధన్‌రావు గారు
మాజీ శాసనసభ్యులు, ఒంగోలు
తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు
"ఆదర్శనీయుడుగా" ప్రతి నాయకుడికి, ప్రతి కార్యకర్తకి మరియు
ప్రతి పౌరుడి గుండెల్లో ఉన్న "వందేభారత్" అనే నినాదం మీరే.
మహోన్నతమైన వ్యక్తిత్వానికి చిహ్నం మీరే...
జనహితం, ప్రజాహితం, లోకహితం మరియు సమాజ శ్రేయస్సు కోరే
మన అందరి "లెజెండ్రీ లీడర్"
గౌ॥ శ్రీ దామచర్ల జనార్ధన్ గారికి
జన్మదిన శుభాకాంక్షలు
రాయపాటి రవీంద్రనాథ్
B.Com., M.B.A., M.Sc(Psy)., M.Phil., LL.B, న్యాయవాది
టిడిపి ఒంగోలు నగర లీగల్ సెల్ అధ్యక్షులు
Ex. అసోసియేట్ ప్రొఫెసర్(RISE, RNEC, St.MEC)
Ex. ఏ.ఎమ్., ఎస్.ఎమ్., ఎస్.ఓ (ICICI, ING, TGV GROUP)


Happy Birthday
ఒంగోలు నియోజకవర్గ
అభివృద్ధి ప్రదాత,
మా ప్రియతమనేత
తెలుగుదేశం పార్టీ
రాష్ట్ర ఉపాధ్యక్షులు
మాజీ శాసనసభ్యులు
శ్రీ దామచర్ల
జనార్ధన్‌రావు గారికి
హృదయపూర్వక
జన్మదిన
శుభాకాంక్షలు
న్యూ ఇందిరమ్మ కాలనీ
తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, పెద్దలు, మహిళలు
తెలుగు యువత, కె.పి రోడ్డు, ఒంగోలు


ఆత్మీయ శ్రేయోభిలాషికి
జన్మదిన శుభాకాంక్షలు
శ్రీ దామచర్ల సత్య
నిరంతరం ప్రజా సంక్షేమం కోసం పరితపిస్తూ...
ప్రజల కోసం ప్రజల తరపున అనేక పోరాటాలు చేస్తూ...
నిత్యం ప్రజలతోనే నా జీవితం...
ప్రజలతోనే నా జీవనం... అని ముందుకు సాగుతున్న
నవతరం నాయకుడు... నడిపించే నాయకుడు...
జనం మెచ్చిన నేత మా మిత్రులు, శ్రేయోభిలాషి
శ్రీ దామచర్ల జనార్ధన్ రావు గారికి ఆ కలియుగ దైవం
శ్రీ వెంకటేశ్వరస్వామి ఆశీస్సులతో, మీ ఇష్ట దైవం
శ్రీ కుక్కే సుబ్రమనేశ్వరస్వామి దివ్య ఆశీస్సులతో
నిండు నూరేళ్ళు ఆయురారోగ్యాలతో తాతకు
తగ్గ మనవడిగా ప్రకాశం జిల్లా ప్రజలకు నిరంతరం
విశిష్ట సేవలు అందించాలని కోరుకుంటూ...
A FRIEND IN NEED
IS A FRIEND INDEED
శ్రీ దామచర్ల జనార్ధన్ రావు
రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు, ఒంగోలు మాజీ ఎమ్మెల్యే
మీ మిత్ర బృందం...
జి.జె.రవీంద్రనాథ్
చిత్తూరు
ఎం.రవిబాబు
చెన్నై
ఇ.ఎ.యోగేంద్రనాథ్
బెంగళూరు
ఇ.ఎ.సంతోష్‌కుమార్
బెంగళూరు
పి.కళ్యాణ్ చక్రవర్తి
బెంగళూరు
చేకూరి జయచంద్ర
@ చంద్రు బెంగళూరు
జి.సుకుమార్‌నాయుడు
చిత్తూరు
కె.అజయ్‌కుమార్
తిరుపతి
కె.అనిల్ కుమార్
తిరుపతి
పి.ప్రవీణ్
తిరుపతి
సి.దీపక్
చిత్తూరు

కందులను పూర్తి స్థాయిలో కొనుగోలు చేస్తాం : జేసీ

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 19 : జిల్లాలో పండుతున్న కందులను పూర్తి స్థాయిలో ప్రభుత్వ యంత్రాంగమే కొనుగోలు చేస్తుందని జేసీ కె.శ్రీనివాసులు తెలిపారు. వచ్చేనెల రెండవ వారం నుంచి సేకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు చర్యలు తీసుకున్నట్లు పేర్కొన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం జరిగిన సమావేశానికి జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధరకే రైతుల వద్ద నుంచి కందులను, ధాన్యాన్ని కూడా ప్రభుత్వ మద్దతు ధరకు కొనుగోలు చేస్తామన్నారు. ఈ విషయాలపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. సమావేశంలో అధికారులు శ్రీనివాసరావు, గోపీచంద్, చంద్రశేఖర్‌రెడ్డి, బేబీరాణి, ఎస్ఈ లక్ష్మారెడ్డి, పీవీ.రమణ, సుబాషిణి, అన్నపూర్ణ పాల్గొన్నారు.

దళిత జాతికి జగన్ క్షమాపణ చెప్పాలి

● ఎమ్మెల్యే స్వామి డిమాండ్

కొండపి, జనవరి 19 : దళిత జాతికి ద్రోహం చేస్తున్న సీఎం జగన్ వారికి క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్యే డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి డిమాండ్ చే శారు. శుక్రవారం ఆయన సోషల్ మీడియా వేదికగా మాట్లాడారు. 'అంబేడ్కర్ విదేశీ విద్య పథకాన్ని జగనన్న విదేశీవిద్య పథకంగా మార్చడం ద్వారా నీకు దళితులపై ప్రేమ ఉందా? లేక దళితులపై అ హంకారం ప్రదర్శిస్తున్నావా'? అనేది దళితులకు తేటతెల్లమైందని విమర్శించారు. లేక అంబేడ్కర్‌కంటే మీరు గొప్పవారా? అని ప్రశ్నించారు. దళితులపై దాడులు, హత్యలు, మహిళలపై అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. అధికారంలోకి రావడం కోసం ఉపయోగపడిన ఒక దళిత బిడ్డ శ్రీను కోడికత్తి కేసులో ఐదేళ్లయినా జైలులో మగ్గుతున్నాడని చెప్పారు. టీడీపీ ప్రభుత్వంలో అమలు చేసిన 27 సంక్షేమ పథకాలు రద్దు చేసి సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి పట్టించావు. రాష్ట్రంలోని ఒక్క ఎస్సీ కాలనీలోనైనా కొత్తరోడ్లు వేశావా.. కాల్వలు నిర్మించావా? అని నిలదీశారు.

22న రాజకీయ పార్టీలకు ఓటర్ల జాబితాలు ఇవ్వాలి

● జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 19 : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈనెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితాలను అందించాలని జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం తుది ఓటర్ల జాబితా ప్రచురణపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఓటర్ల జాబితాలో తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. బీఎల్‌వో స్థాయిలో పకడ్బందీగా మాన్యువల్ రికార్డులను తయారు చేయించి తమ వద్ద భద్రపర్చుకోవాలని ఈఆర్వోలకు సూచించారు. తమ లాగిన్ ఐడీలను కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అసాధారణ స్థాయిలో కొత్త ఓటర్లుగా నమోదుకు, తొలగింపులకు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్దేశం చేశారు. అర్హులైన ఓటర్లందరికీ త్వరగా ఫొటో గుర్తింపుకార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిబ్బందిని త్వరగా గుర్తించాలి : కలెక్టర్

వచ్చే ఎన్నికల్లో విధుల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని త్వరగా గుర్తించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 22న అన్ని రాజకీయ పార్టీలకు తుది ఓటర్ల జాబితాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితా సవరణలో యంత్రాంగం చేపట్టిన చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి తుది జాబితాలను అందజేయాలన్నారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

దళితులకు జగన్ ఒరగబెట్టిందేమిటీ..?



రంగాపురంలో బాండ్ అందజేస్తున్న టీడీపీ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అశోక్‌రెడ్డి
- దళితుల సంక్షేమ పథకాల కోతపై నిరసనలు

అర్ధవీడు (కంభం) : రాష్ట్రంలో అబద్దపు హామీలతో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి దళితులపై దాడులు చేయడం మినహా వారికి ఒరగబెట్టిందేమిటీ..? అని గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి వైసీపీ పాలకులను ప్రశ్నించారు. గురువారం సాయంత్రం అర్ధవీడు మండలం రంగాపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ, జనసేనల ఉమ్మడి మానిఫెస్టోలోని అంశాలను మహిళలకు వివరించారు. అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ నాడు టీడీపీ హయాంలో చంద్రబాబునాయుడు దళితుల అభ్యున్నతి కోసం 27 సంక్షేమ పథకాలను ప్రవేశపెడితే అధికారంలోకి రాగానే జగన్ వాటిని రద్దు చేసి దళితులకు వెన్నుపోటు పొడిచారన్నారు. టీడీపీ హయాంలో అంబేడ్కర్ విదేశీ విధానాన్ని ప్రవేశపెట్టగా దానిని రద్దు చేసింది వైసీపీ ప్రభుత్వమేనన్నారు. ఈ నాలుగున్నరేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీ కార్పొరేషన్ కింద ఒక్క రూపాయి కూడా అందించలేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు బియ్యాల నారాయణ, క్లస్టర్ ఇన్‌చార్జ్ మారెడ్డి రంగారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు బండ్లమూడి గంగయ్య, గంగుల పోలురాజు, పెద్ద పోలురాజు, లాకా నాగయ్య, షేక్ బాషా, గిలిగిత్తల చిన్ని, తదితరులు పాల్గొన్నారు. మండలంలోని యాచవరం గ్రామంలో టీడీపీ జెండాను అశోక్‌రెడ్డి ఆవిష్కరించారు.

కంభం, జనవరి 19 : రానున్న ఎన్నికలకు ప్రతి ఒక్కరూ సన్నద్ధంగా ఉండాలని, ప్రతి యూనిట్, బూత్ ఇన్‌చార్జ్‌లు సమర్థవంతంగా పనిచేయాలని గిద్దలూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. గురువారం అర్ధవీడు మండలం రంగాపురం గ్రామం 1వ క్లస్టర్‌లోని రంగాపురం, వెలగలపాయ, గన్నేపల్లి, బొమ్మిలింగం గ్రామాలకు చెందిన ముఖ్యనాయకులతో మాట్లాడారు. టీడీపీ గెలుపులో బూత్ ఇన్‌చార్జిలదే బాధ్యత అన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి టీడీపీ, జనసేన పార్టీలు కలిసి అందించే సంక్షేమ పథకాలను వివరించాలన్నారు. ప్రతిబూత్‌లో టీడీపీకి అత్యధిక మెజారిటీ వచ్చేవిధంగా పట్టుదలతో పని చేయాలన్నారు. రాష్ట్రంలో జగన్‌రెడ్డి పని అయిపోయిందని, రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడడం తథ్యమన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు బండ్లమూడి ఆంజనేయులు యాదవ్, టీడీపీ మండల నాయకులు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జులు, గ్రామపార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.



వై.పాలెంలో నిరసన తెలుపుతున్న దళితులు

ఎర్రగొండపాలెం, జనవరి 19 : అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించినంత మాత్రాన రాష్ట్రంలో దళితులు నిన్ను నమ్మే పరిస్థితిలో లేరని, టీడీపీ ఇన్‌చార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు విమర్శించారు. శుక్రవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించే అర్హత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి లేదన్నారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు 4 లక్షల మంది దళితులకు ఉపాధి కల్పించారన్నారు. ఎస్సీ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారన్నారు. దళిత బిడ్డల విదేశీవిద్యా పథకాన్ని నాలుగేళ్లగా అటకెక్కించారన్నారు. వివిధ శాఖలో ఉన్న 50 వేల ఎస్సీ, ఎస్టీ బ్యాక్‌లాగ్ పోస్టులను భర్తీ చేయకుండా మోసం చేశాడన్నారు. దళిత నియోజకవర్గంలో ఉన్న అమరావతి రాజధానిని నీరుగార్చాడన్నారు. కోడికత్తి కేసులో కోడికత్తి శ్రీనుకు, ఆయోషా కేసులో సత్యంబాబుకు బెయిల్ ఇవ్వకుండా జైల్లో ఉంచాడన్నారు. మాస్కు పెట్టుకోలేదని చీరాలకు చెందిన కిరణ్‌ను పోలీసులతో కొట్టించి చంపారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు పాల్గొన్నారు.



విలేకర్లతో మాట్లాడుతున్న గూడూరి ఎరిక్షన్‌బాబు

ఎర్రగొండపాలెం : 'నా ఎస్సీలు, నా ఎస్టీలు' అని వేదికలపై ప్రసంగిస్తూ, దళిత యువతి, యువకులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకుండా మోసం చేసిన దళిత ద్రోహి జగన్మోహన్‌రెడ్డి అని టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు ఆరోపించారు. ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట శుక్రవారం సాయంత్రం టీడీపీ దళిత సంఘం నాయకులు నిరసనలు తెలిపారు. గత ప్రభుత్వం దళితుల సంక్షేమం కోసం అమలులోకి తెచ్చిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేశారన్నారు. దళితులకు తీవ్ర అన్యాయం చేశారని నినాదాలు చేశారు. ఎన్నికల ముందు 125 అడుగుల విగ్రహం విజయవాడలో ఏర్పాటు చేసి రాష్ట్రంలోని దళితులను మరోసారి మభ్య పెట్టాలని చూస్తున్నారన్నారు. దళితులు ఏ దశలోనూ జగన్ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. కార్యక్రమంలో టీడీపీ నియోజకవర్గ దళిత సంఘాల నాయకులు కోటా డేవిడ్, చేదూరి గంగయ్య, కొదమల జిన్నా, మాకం జీవయ్య, చేదూరి లక్ష్మయ్య ఆదినారాయణ, టి.అచ్చయ్య, టీడీపీ దళిత సంఘాల నాయకులు, సభ్యులు పాల్గొని నిరసనలు తెలిపారు.

అవీ..ఇవీ..

కులగణన ప్రారంభం



కులగణన చేస్తున్న సచివాలయ సిబ్బంది

గిద్దలూరు, జనవరి 19 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణన సర్వే గిద్దలూరు మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో నిర్వహించారు. సచివాలయ సిబ్బంది ఇంటికి వెళ్లి వివరాలు సేకరించారు. ఆయా కార్యక్రమాలలో కమిషనర్ రామకృష్ణయ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పకడ్బందీగా కులగణన : ఎంపీడీవో చందన

మార్కాపురం రూరల్ జనవరి 19: గ్రామాలలో కులగణను సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని, ఎంపీడీవో తోట చందన అన్నారు. మండలంలోని చింతకుంట గ్రామంలో సచివాలయ సిబ్బంది చేస్తున్న సర్వేను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.., వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతిఇంటిలో ప్రతిఒక్కరిని సర్వే చేయాలన్నారు. ఎంపీడీవో, ఎమ్మార్వో 200 ఇళ్లలో సూపర్‌చెక్‌లో భాగంగా తనిఖీ చేస్తారన్నారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

సెలవుదినంగా ప్రకటించాలి

గిద్దలూరు, జనవరి 19 : అయోధ్యలో రామాలయం ప్రారంభం సందర్భంగా ఈ నెల 22న సెలవుదినంగా ప్రకటించాలని బీజేపీ నాయకులు రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. హిందువుల అతిపెద్ద ఉత్సవం లాంటి కార్యక్రమం రామాలయం ప్రారంభాన్ని సెలవుదినంగా ప్రకటించాలన్నారు. ఆ మేరకు ఎంఈవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణశాఖ అధ్యక్షులు ఉదయ్‌శంకర్, నాయకులు రామాంజనేయులు, శ్రీనివాసులు, జయప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం బకాయిలు చెల్లించాలి



నిరసన ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 19: ప్రభుత్వం వెంటనే ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షులు ఒద్దుల వీరారెడ్డి డిమాండ్ చేశారు. స్థానిక బాలుర ఉన్నత పాఠశాల నుంచి పట్టణ వీధుల్లో ఆ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా బకాయిలు విడుదల చేయాలని, పీఆర్సీ అరియర్స్ చెల్లించాలని, డీఏ అరియర్స్ చెల్లించి 12వ పీఆర్సీ విధివిధానాలు రూపొందించాలని యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ప్రతి నెల 1న జీతాలు చెల్లించాలని, ప్రభుత్వం సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ప్రభాకర్, తాటిపర్తి సత్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ వైఫల్యాలను ఎండగడతాం



మాట్లాడుతున్న జనసేన ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 19: వైసీపీ వైఫల్యాలను తాము చేస్తున్న పాదయాత్రలో ఎండగడతామని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇమ్మడి కాశీనాథ్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలతో శుక్రవారం అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాశీనాథ్ మాట్లాడుతూ మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి నియోజకవర్గంలో పాదయాత్ర చేస్తామన్నారు. పాదయాత్రలో వెలిగొండ ప్రాజెక్టు రెండవ టన్నెల్ వద్ద నుంచి ప్రాజెక్టు నిర్వాసితులు, కార్యకర్తలు పాల్గొంటారన్నారు. వైసీపీ ప్రభుత్వం అన్ని రంగాలలో విఫలమైందన్నారు. మార్కాపురం జిల్లా, వెలిగొండ ప్రాజెక్టు పూర్తి చేస్తే వెనుకబడిన ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందుతుందన్నారు. వెలిగొండను పూర్తి చేయడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందన్నారు.

కేంద్ర పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎంపీడీవో చందన



ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేస్తున్న ఎంపీడీవో

మార్కాపురం రూరల్ జనవరి 19: కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో తోట చందన అన్నారు. మండలంలోని భూపతి పల్లి గ్రామంలో శుక్రవారం వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో అధికారులు నాయకులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ 2027 నాటికి భారతదేశం అభివృద్ధి చెందిన దేశంగా చూడాలన్న ప్రధాని మోడీ కలను ప్రజలకు వివరించారు. భారతదేశ వారసత్వం, సంస్కృతి విలువల ప్రాముఖ్యత గురించి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలజీవన్ మిషన్, పీఎం ఆవాస్ యోజన, పీఎం కిసాన్, ఉజ్వలగ్యాస్, సురక్ష బీమా తదితర పథకాల గురించి వివరించారు. లబ్ధిదారులకు ఆయుష్మాన్ భారత్ కార్డులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా ప్రతినిధి కృష్ణారావు, గ్రామ సర్పంచి, పంచాయితీ కార్యదర్శి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

బాబుగెలుపుతో యువతకు భవిష్యత్తు



మాట్లాడుతున్న కందుల నారాయణరెడ్డి

పొదిలి, జనవరి 19 : బాబుగెలుపుతో యువత కు భవిష్యత్తు ఉంటుందని అందుకు బూత్‌కమిటీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు కృషి చేయా లని మార్కాపురం మాజీ శాసనసభ్యులు కందుల నారాయణరెడ్డి పిలుపు నిచ్చారు. శుక్రవారం పట్టణంలోని కాటూరివారిపాలెం, బుచ్చన్నపాలెం, రాజుపాలెంలోని 3, 18, 19వ వార్డులలో బూత్‌కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలు కనుచూపుమేరలోనే ఉన్నాయని ఇప్పుడే కార్యకర్తలు, నాయకులు అప్రమత్తంగా ఉండాలని కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత టీడీపీ అమలుజేసే పథకాల మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. ఇంటింటికి తిరుగుతూ టీడీపీ అధికారంలోకి వచ్చిన తరువాత సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అందుకు బూత్‌కమిటీ సభ్యులతో మండల నాయకులు ప్రణాళికతో కృషి చేయాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వంపై ప్రజలకు నమ్మకం పోయిందని ఎప్పుడు ఎన్నికలు వస్తాయాని ప్రజలు ఎదురు చూస్తున్నారన్నారు. వైసీపీ ప్రభుత్వంలో అవినీతి రాజ్యమేలుతుందని విమర్శించారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా టీడీపీ సైనికులు సిద్ధంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు, బూత్‌కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా యోగి వేమన జయంతి



వేమనకు నివాళి అర్పిస్తున్న నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, జనవరి 19: రెడ్డి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యంలో యోగి వేమన జయంతి శుక్ర వారం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగి వేమన చిత్రపటానికి సంఘం నాయ కులు నివాళులు అర్పించారు. యోగి వేమన నీతి, నిజాయితీ, సత్యాలతో కూడిన పద్యాలు పాడి స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వి.వెంకటరెడ్డి, ఈవీ నారాయణరెడ్డి, టీవీ రామిరెడ్డి, కె.రమణారెడ్డి, కె.లక్ష్మీరెడ్డి, వెంకటరెడ్డి, బలరామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ యూనిట్లు మంజూరు



యూనిట్ మంజూరుపత్రం అందజేస్తున్న ఏపీఎం

మార్కాపురం రూరల్ జనవరి 19: మండలంలోని గజ్జలకొండ, నాగులవరం గ్రామాలలో పీఎంఈజీపీ పథకం ద్వారా ఆరు డెయిరీ యూనిట్లు మంజూరు చేసినట్లు వైకేపీ ఏపీఎం రమేష్‌బాబు తెలిపారు. మండలంలోని గజ్జలకొండ ఆంధ్రప్రగతి బ్యాంకు పరిధిలో రెండు, పట్టణంలోని కెనరా బ్యాంకు ద్వారా రెండు, స్టేట్‌బ్యాంకు ద్వారా రెండు యూనిట్లు మంజూరైనట్లు తెలిపారు. యూనిట్ విలువ రూ.2 లక్షలు కాగా రాయితీపై యూనిట్లను మంజూరు చేసినటుప్లె తెలిపారు. యూనిట్లు ఏర్పాటు చేసుకునే లబ్ధిదారులకు కేంద్ర ప్రభుత్వం 35 శాతం రాయితీని ఇస్తోందన్నారు. కార్యక్రమంలో లీడ్‌బ్యాంకు మేనేజర్, డీపీఎం సుబ్బారావు, ఏరియా కో-ఆర్డినేటర్ సుధాకర్, మార్కాపురం ఏపీఎం రమేష్‌బాబు, తర్లుపాడు ఏపీఎం పిచ్చయ్య, సీసీలు, వీవోఏలు పాల్గొన్నారు.

నేడు వైసీపీ కార్యకర్తల ఆత్మీయ సమావేశం

పెద్ద దోర్నాల, జనవరి 19: స్థానిక శివసదన్‌లో శనివారం వైసీపీ మండల కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు వైసీపీ మండల కన్వీనర్ ఘంటా వెంకట రమణారెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ఎర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జ్ తాటిపర్తి చంద్రశేఖర్ హాజరవుతారన్నారు. మండలంలోని వైసీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని ఆయన పిలుపునిచ్చారు.

వలంటీర్ల భర్తీకి దరఖాస్తుల స్వీకరణ

కంభం, జనవరి 19 : కంభం మండలంలో వలంటీర్లుగా పనిచేస్తూ వివిధ వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు చేసిన తొమ్మిది మంది వలంటీర్ల భర్తీకి ఈ నెల 23వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని, తురిమెళ్లలో ఎస్టీ మహిళ-1, బీసీ జనరల్-1, హెచ్‌గూడెం ఎస్టీ మహిళ-1, రావిపాడులో బీసీ మహిళ-1, కంభం 1లో ఒసి జనరల్-1, కందులాపురం-3లో ఓసీ జనరల్-1, కందులాపురం 2లో బీసీ మహిళ-1, ఎల్.కోటలో ఎస్సీ జనరల్-1, జంగంగుంట్ల ఎస్సీ జనరల్-1 ఖాళీగా ఉన్నాయి.

పొగమల్లె నివారణకు సూచనలు

కొండపి, జనవరి 19 : మండలంలోని పెట్లూరు, కోయవారిపాలెం, పెదకండ్లగుంట గ్రామాలతోపాటు, మర్రిపూడి మండలంలోని ధర్మవరం గ్రామాల్లో కొండపి పొగాకు వేలం కేంద్రం రైతుమిత్రబృందం శుక్రవారం పర్యటించింది. కొండపి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్, ఐటీసీ శాస్త్రవేత్త పి. వెంకటేశ్వరరావు, ఐటీసీ మేనేజర్ వెంకటరావు రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో క్షేత్ర సహాయకులు మోతీలాల్, కొండలు పాల్గొన్నారు.

నకిలీ విత్తనాలతో నిండా మునిగిన రైతులు

- లక్షల రూపాయాల్లో పంట నష్టం
- ఫిర్యాదు చేసిన పట్టించుకోని అధికారులు

బేస్తవారపేట, జనవరి 19 : నాణ్యమైన మొక్కజొన్న విత్తనాలతో అధిక దిగుబడి సాధించవచ్చని ఆశపడ్డ రైతులకు ఓ వ్యాపారి నకిలీ విత్తనాలు అంటగట్టారు. ఈ ఘటన బేస్తవారపేట మండలంలోని పందిళ్లపల్లె గ్రామంలో చోటుచేసుకొంది. గిద్దలూరుకు చెందిన రాజగోపాల్‌రెడ్డి అనే వ్యాపారి హైదరాబాద్ జీడిమెట్ల నుంచి ప్యాకింగ్ చేసిన మొక్కజొన్న విత్తనాలు సరఫరా చేశారు. పంట తదుపరి టన్ను రూ.23వేలు చొప్పున కొట్టానని హామీ ఇచ్చారు. పందిళ్లపల్లె గ్రామంలో ఈ విత్తనాలు సూమారు 30 ఎకరాల్లో రైతులు సాగు చేశారు. అయితే పంట దిగుబడి సమయంలో కంకి సక్రమంగా రాలేదు. దీంతో పైరు వ్యవసాయ భూమిలోనే ఎండిపోయింది. నాణ్యత లేని విత్తనాలు సాగు చేశామని తెలుసుకున్న రైతులు లబోదిబోమన్నారు. రైతులు ఏజెంట్ రాజగోపాల్‌రెడ్డి వద్దకు వెళ్లగా ఆయన పట్టీపట్లనట్లుగా వ్యవహరించడంతో వెంటనే పోలీసులకు, వ్యవసాయాధికారులకు ఫిర్యాదు చేశారు. అయితే వ్యవసాయాధికారులు పంటపొలాలను పరిశీలించినప్పటికీ, నష్టపరిహారం గురించి పట్టించుకోలేదని రైతులు పేర్కొంటున్నారు. అధికారులు విత్తనాలు సరఫరా చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకొని నష్టపరిహారం అందించాలని కోరారు.

14 ఎకరాల్లో సాగు చేశా :

పందిళ్లపల్లె గ్రామ సమీపంలో 14 ఎకరాల్లో మొక్కజొన్న విత్తనాలు విత్తనాలు నాటాను. అయితే పంట నాసిరకంగా వచ్చింది. దీంతో ఎకరాకు 4 టన్నుల దిగుబడి రావాల్సి ఉండగా, కేవలం 150 కిలోల దిగుబడి మాత్రమే వచ్చింది. దీంతో ఎకరాకు రూ.14 లక్షలు నష్టపోయాను. అధికారులు స్పందించి నష్టపరిహారం అందేలా చూడాలి.

ఆవుల శ్రీనివాసరెడ్డి,పందిళ్లపల్లె



దెబ్బతిన్న పైరును పరిశీలిస్తున్న ఏవో (ఫైల్)

కూతురే కొడుకైంది..

తండ్రి మృతదేహానికి తనయ అంత్యక్రియలు

ముండ్లమూరు, జనవరి 19 : కొడుకులు తలకొరివి పెడితే పున్నామ నరకం నుంచి బయటపడతామని తల్లిదండ్రులు ఆశపడతారు. అయితే కొడుకులు లేని వారి పరిస్థితి ఇబ్బందికరమే. బంధువులో, ఇతర కుటుంబ సభ్యులో ఆ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటారు. అయితే ఇటీవల అక్కడక్కడ కుమార్తెలు కూడా ధైర్యంగా ముందుకొచ్చి తల్లిదండ్రులకు అంతిమసంస్కారాలు నిర్వహించి వారికి కొడుకులు లేరనే బాధ నుంచి తప్పిస్తున్నారు. ఇలాంటి సన్నివేశమే ప్రకాశం జిల్లా ముండ్లమూరు మండలంలోని పోలవరంలో శుక్రవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన గంగినేని ఆదినారాయణ గత కొన్నిరోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్సపొందుతూ శుక్రవారం మృతిచెందారు. ఆదినారాయణకు భార్య పద్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కుమార్తె గంగినేని అనూష అమెరికాలో ఉద్యోగం చేస్తున్నారు. చిన్నకుమార్తె మంజూష బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నారు. తండ్రికి బాగా లేక ఆస్పత్రిలో చేర్చారనే విషయం తెలియగానే పెద్దకుమార్తె అమెరికా నుంచి కొద్దిరోజుల క్రితం వచ్చి ఆస్పత్రిలో తండ్రి వద్దే ఉంటూ బాగోగులు చూసుకుంటోంది. చివరికి ఆదినారాయణ మృతి చెందడంతో పుట్టెడు దుఃఖంతో ఉంది. కొడుకులు లేకపోవటంతో కొందరు బంధువులు తాము కార్యక్రమాలు చేస్తామని తెలిపారు. అయితే తన తండ్రికి అంతిమసంస్కారాలు తానే చేస్తానని అనూష ముందుకొచ్చారు. అంతిమయాత్రలో గ్రామస్థులందరూ తరలిరాగా ఆమెనే తలకొరివి పెట్టారు. మొత్తంగా చదువుకున్న మహిళ కావటం, పైపెచ్చు ఉన్నత స్థాయిలో ఉండి తండ్రికి దహన సంస్కారాలు చేయటంతో గ్రామస్థులందరూ అభినందించారు.



అంత్యక్రియలు చేస్తున్న కుమార్తె

మాటతప్పడమే జగన్ నైజం

యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మీగడ వేంకటేశ్వరరెడ్డి

పొదిలి, జనవరి 19 : మాటతప్పడే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి నైజమని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ కార్యదర్శి మీగడ వెంకటేశ్వరరెడ్డి ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయం నుంచి విశ్వనాథపురంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఏర్పాటుకు ముందు మాట తప్పను, మడమతిప్పను అని మాయ మాటలు చెప్పి వంచనతో జగన్ అధికారంలోనికి వచ్చాడన్నారు. అధికార వ్యామోహంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు నెరవేర్చలేని హామీలు ఇచ్చాడన్నారు. పాదయాత్రలో ఇచ్చిన హామీలతో ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏదో చేస్తాడని ఆశపడి ఓట్లు వేశారన్నారు. ఆయన అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికులు రోడ్డున పడాల్సి వచ్చిందన్నారు. ఎప్పటికప్పుడు పీఆర్సీ, మంచి ఫిట్‌మెంట్ ఇస్తానని నమ్మబలికిన జగన్ ఇప్పుడు ప్రశ్నిస్తే కేసులు పెడుతున్నాడన్నారు. కనీసం ఒకటో తేదీ జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ఉన్నాడన్నారు. గత ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 శాతం ఫిట్‌మెంట్‌ను 23 శాతానికి కుదించారన్నారు. అలా చేసిన ఏకైక ముఖ్యమంత్రి ప్రపంచంలో జగన్ మాత్రమేనని విమర్శించారు. ఉద్యోగులు వివిధ అవసరాలకోసం పీఎఫ్‌లో డబ్బులు దాచుకుంటారని అయితే ఇప్పుడు ఏ ఉద్యోగి అకౌంట్‌లో ఒక్క పైసా కూడా లేకుండా తమ అనుమతి లేకుండా పూర్తిగా వాడుకున్న ఘనుడు జగన్‌రెడ్డి అన్నారు. తాము దాచుకున్న డబ్బులకు లోన్ పెట్టుకున్నా వచ్చే పరిస్థితి లేదని వాపోయారు. 185 నెలల డీఏ బకాయిలు చెల్లించలేదన్నారు. తాము జీతాలు పెంచమని అడగడం లేదని దాచుకున్న డబ్బులు ఇవ్వండని అర్థిస్తున్నామన్నారు. తాజాగా ఇచ్చిన ఉత్తర్వులలో పీఆర్సీ, అరియర్స్ రిటైరైన తరువాత ఇస్తామని చెప్పడం సిగ్గుచేటన్నారు. ఫ్రెండ్లీ ప్రభుత్వం అని చెబుతున్న జగన్ ఈ నెల 31న రిటైర్ అయ్యే ఉద్యోగులకు ఆడిట్ జనరల్ ఆఫీస్ నుంచి వింత ఉత్తర్వులు వచ్చాయన్నారు. ఆ ఉత్తర్వుల మేరకు 2026 అక్టోబర్‌లో గ్రాడ్యుటీ ఇస్తామని, మిగిలిన మొత్తం 2030లో చెల్లిస్తామని సమాచారం ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వం ఎంత దుర్మార్గంగా వ్యవహరిస్తుందో ఇట్టే అర్థం చేసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా సహాధ్యక్షులు అబ్దుల్‌హై, జిల్లా కార్యదర్శి పి బాలవెంకటేశ్వర్లు, యూటీఎఫ్ ఆడిట్ కమిటీ సభ్యులు బుజ్జిబాబు, నాయకులు కె నాసర్ అహమ్మద్, ఎన్ కామేశ్వరరావు, పి శ్రీనివాసులు, సంజీవరావు ఎస్ సత్యనారాయణ, పాలడుగు వెంకటేశ్వర్లు, తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అంబేద్కర్ విగ్రహం ఎదుట అంగన్‌వాడీల నిరసన

గిద్దలూరు, జనవరి 19 : నిరవధిక సమ్మెలో ఉన్న అంగన్‌వాడీలు శుక్రవారం అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. ప్రభుత్వం అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించడం సంతోషకరమే అయినప్పటికీ తమ డిమాండ్లను నెరవేర్చకపోవడం బాధాకరమని అంగన్‌వాడీలు పేర్కొన్నారు. ఇప్పటికైనా తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అంగన్‌వాడి వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు స్వర్ణకుమారి, మున్నా, సీఐటీయూ నాయకులు ఆవులయ్య, నరసింహులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం : ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి మనస్సు మార్చాలని అంగన్వాడీ కార్యకర్తలు శుక్రవారం ఎర్రగొండపాలెం ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. జీతాలు పెంచాలని 39 రోజులుగా ధర్నాలు చేస్తున్న ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పెడచెవిన పెట్టిందన్నారు. జీతాలు పెంచే వరకు ధర్నాలు చేస్తామన్నారు. ఈ ధర్నాలో సిఐటియూ నాయకులు షేక్ రఫీ, అంగన్వాడీయూనియన్ నాయకులు జి మల్లేశ్వరి, పి.సుబాషిణి, నాగరాజకుమారి, రామసుబ్బమ్మ, అరుణ, సునీత, టి.సుబ్బమ్మ, సుజాత, పాల్గొని మాట్లాడారు. ఎర్రగొండపాలెం, త్రిపురాంతకం, పుల్లలచెరువు మండలాల నుంచి వచ్చిన అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు ధర్నాలో పాల్గొన్నారు.



గిద్దలూరులో అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన

పొదిలి : అంగన్‌వాడీలపై ఎస్మా చట్టాన్ని తక్షణమే వెనక్కు తీసుకోవాలని, లేకపోతే ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అంగన్వాడీ కార్యకర్తలు హెచ్చరించారు. నిర్వధిక సమ్మెలో భాగంగా శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయమని అడిగితే ఎస్మా విధించడం జగన్మోహన్‌రెడ్డి అహంకారానికి నిదర్శనమన్నారు. అంగన్‌వాడీల సమస్య లపై ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెబుతున్న మంత్రులు వేతనాలు ఎందుకు పెంచలేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఇచ్చిన హామీలపరిష్కారం దిశగా అడుగులు వేయాలని వారు కోరారు.

మార్కాపురం వన్‌టౌన్ : తమ సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదురు దీక్షా శిబిరం నుంచి కోర్టు సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. సీపీఐ నాయకులు అందె నాసరయ్య, కాశీం, సీపీఎం నాయకులు రూబెన్ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించే విధంగా ముఖ్యమంత్రికి మంచిబుద్ధి కలగాలని, కోరుతూ అంగన్‌వాడీలు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం ఇచ్చారుఉ. స్థానిక ఆర్‌టీసీ బస్టాండు వద్ద 40 రోజులుగా చేస్తున్న నిరవధిక సమ్మెలో భాగంగా శుక్రవారం నిరసన దీక్ష చేశారు. ఈ క్రమంలో నటరాజ్ కూడలిలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. తమ బాధలు గుర్తించి ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ముఖ్యమంత్రికి తెలియజెప్పాలని ఆశీర్వదించాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం తమకు ఉద్యోగభద్రత కల్పించాలని, వేతనాలు పెంచాలని, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు గ్రాట్యూటీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 'సీఎం డౌన్ సీఎం డౌన్' అంటూ నినాదాలు చేశారు. కార్యక్రమంలో ముంతాజ్‌బేగం, వై సుబ్బమ్మ, వెంకటలక్ష్మీ, వెంకటరత్నం, పద్మ, కుమారి, రాణి, తదితరులు పాల్గొన్నారు.

కంభం : తమ కోర్కెల సాధనకై అంగన్‌వాడి కార్యకర్తలు పట్టువదలకుండా చేస్తున్న నిరసన దీక్షలు గురువారం నాటికి 39వ రోజుకు చేరింది. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి గురువారం విజయవాడలో అంబేడ్కర్ విగ్రహాన్ని ప్రారంభించిన సందర్భంగా కందులాపురం కూడలిలో నిరసన దీక్ష చేస్తున్న కంభం, బేస్తవారపేట, అర్ధవీడు మండలాల అంగన్‌వాడీలు అక్కడే ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ముఖ్యమంత్రి జగన్‌కు మంచిబుద్ధిని ప్రసాదించి అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలన్నారు.



ఎర్రగొండపాలెంలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు


క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఉగ్ర

టీడీపీ ప్రజాపోరులో యువకులదే కీలకపాత్ర

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి

పామూరు, జనవరి 19 : రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ చేస్తున్న ప్రజా పోరాటంలో యువకులు కీలక పాత్ర పోషించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి , మాజీ ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి పిలుపునిచ్చారు. సంక్రాంతి పండుగ సంబరాల్లో భాగంగా టీడీపీ, జనసేన సౌజన్యంతో డాక్టర్ ఉగ్ర యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ముగిసింది. ఈ టోర్రమెంట్‌లో గెలిచిన క్రీడకారులకు శుక్రవారం సాయంత్రం ఉగ్ర బహుమతి ప్రదానం చేశారు. ఈ టోర్నమెంట్‌లో జేజే లెవన్ టీం ప్రథమ బహుమతి ని సాధించగా వారికి టీడీపీ నాయకులు జేఆర్‌కే పౌండేషన్ అధినేత కోటపాటి జనార్ధనరావు సమకూర్చిన రూ. 30,1116లను, ట్రోఫిని, ద్వితీయ బహుమతి పొందిన పేటా బాయిస్స్ టీంకు టీడీపీ నాయకులు యారవ శ్రీను సమకూర్చిన రూ.20,1116లను, తృతీయ బహుమతిని పొందిన చాంద్ లెవన్స్ టీంకు దారపనేని సుబ్బారావు సమకూర్చిన రూ.10,116లను షీల్డ్‌ను అందజేసారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతు క్రీడాకారులందరు ఐక్యమత్యంగా ఉండి సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు. పామూరులో ఆటస్థలం లేదని మీరు ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే ఆటస్థలం కేటాయించాలని క్రీడాకారులు ఉగ్ర దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ క్రీడాకారులందరు ఓటు హక్కు పొంది మంచి నాయకులను ఎన్నుకొని ఈ ప్రాంత అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, మాజీ ఎంపీపీ జి. దశరథరాములు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు, అడుసుమల్లి ప్రభాకర్‌చౌదరి, షేక్ షరీఫ్, షేక్ ఖాజారహంతుల్లా ఉప్పలపాటి హరిబాబు, ఇర్రి కోటిరెడ్డి, పందిటి హరీష్, షేక్ గౌస్‌బాషా, పాలపర్తి వెంకటేశ్వర్లు జి. శ్రీనివాసులు, ఎస్.సాంబ, డోలా శేషు, ముబిన మౌలాలి, దేవరపు మాల్యాద్రి, ఏ హరిప్రసాద్, కావేరి రసూల్, చిన హజరత్, గోళ్ల వీర బాబు, పత్తు మస్తాన్‌తో పాటు కోటపాటి రాజా, జనసేన జిల్లా కార్యదర్శి వైర హీముల్లా, షేక్ సందానిబాషతో పాటు టోర్నమెంట్ నిర్వాహకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన యువతతో ఉగ్ర

టీడీపీతోనే యువతకు న్యాయం

వెలిగండ్ల, జనవరి 19 : వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తుందని, అప్పుడే యువతకు తగిన గుర్తింపు, న్యాయం జరుగుతుందని మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ముక్కు ఉగ్ర నరసంహారెడ్డి అన్నారు. మండలంలోని గన్నవరం గ్రామానికి చెందిన 13 మంది యువకులు కనిగిరి టీడీపీ కార్యాలయంలో ఉగ్ర నరసింహారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు అన్నివిధాల తెలుగుదేశం పార్టీ అండగా నిలుస్తోందన్నారు. నిరుద్యోగ సమస్యకు చెక్ చెప్పి ఉద్యోగావకాశాలు పెరగాలంటే టీడీపీతోనే సాధ్యమన్నారు. యువతకు నిరుద్యోగ భృతి అందించిన ఒకే ఒక్క పార్టీ టీడీపీయేనని చెప్పారు. ఈ కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

అంబేడ్కర్ విగ్రహం ఎదుట అంగన్‌వాడీల ఆందోళన

దర్శి, జనవరి 19 : డిమాండ్ల సాధన కోసం చేస్తున్న ఆందోళనలో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద శుక్రవారం దీక్ష చేశారు. ప్రభుత్వ మొండి వైఖరిని నిరసిస్తూ అంబేడ్కర్‌కు వినతిపత్రం సమర్పించి పాలకుల తీరుపై నిరసన తెలిపారు. రాజ్యాంగ స్ఫూర్తిని నాశనం చేస్తున్న సీఎం వైఎస్ జగన్ ప్రజలను మోసం చేసేందుకే అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేసి ఆయన పేరును వాడుకునే ప్రయత్నం చేస్తున్నాడని సీఐటీయూ దర్శి నియోజకవర్గ కార్యదర్శి టి. రంగారావు ఆగ్రహం వ్యక్తం చేశారు.అంబేడ్కర్ రాజ్యాంగంలో కల్పించిన హక్కుల ప్రకారం డిమాండ్లు నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకురాళ్లు బాలమ్మ, తిరుపతమ్మ, నాగమణి, దేవీబాయి, సీఐటీయూ నాయకులు సందు వెంకటేశ్వరరావు, యు. నారాయణ, అంజిబాబు, ఈ. నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేయాలి

ముండ్లమూరు : తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని 26 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలపై ఎస్మా ప్రయోగించటం దుర్మార్గమని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల కమిటీ తీవ్రంగా ఖండించింది. శుక్రవారం ముండ్లమూరులోని అంబేడ్కర్ విగ్రహానికి అంగన్‌వాడీలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా సహాయ కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ అంగన్ వాడీలకు ముఖ్యమంత్రి ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బోడపాటి హనుమంతరావు, పంటా ఏడుకొండలు తదితరులు ఉన్నారు.


అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

బస్సులు లేక ప్రయాణికుల ఇక్కట్లు

తాళ్లూరు, జనవరి 19 : విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ శ్రేణులను తరలించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేయటంతో తాళ్లూరుకు బస్సులకొరత ఏర్పడింది. దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. తాళ్లూరుకు నిత్యం ఒంగోలు డిపోనుంచి 5 బస్సులకు గాను రెండు బస్సులను మాత్రమే నడిపారు. నిత్యం అద్దంకి నుంచి తిరిగే బస్సునుకూడా రద్దు చేశారు. దీంతో గమ్యాలకు చేరేందుకు ప్రయాణికులు ప్రయివేట్ వాహనాల కోసం పడిగాపులు కాశారు. ప్రభుత్వం వైసీపీ శ్రేణులను తరలించేందుకు నిత్యం తిరిగే ఆర్టీసీ బస్సులను రద్దు చేసి ప్రయాణికులను ఇబ్బందులు పెట్టడం ఎంతవరకు న్యాయమని వారు ప్రశ్నిస్తున్నారు.

వైసీపీ పదవులకు మూకుమ్మడి రాజీనామాలు

బుర్రాకు టిక్కెట్ నిరాకరించడంపై అసహనం
బాలినేనిపై పామూరు నేతల ఆగ్రహం


సమావేశంలో రాజీనామా నిర్ణయాన్ని ప్రకటిస్తున్న ఎంపీపీ లక్ష్మి

పామూరు, జనవరి 19 : కనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్‌యాదవ్‌కు వైసీపీ అధిష్ఠానం టిక్కెట్ నిరాకరించడంతో ఆపార్టీ పామూరు మండల నాయకులు, ప్రజాప్రతినిధులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ మూకుమ్మడిగా తమ పదవులకు, పార్టీ పదవులకు రాజీనామాలు చేశారు. వైసీపీ కార్యాలయంలో శుక్రవారం పలువురు నేతలు విలేక రుల సమావేశం నిర్వహించారు. వైసీపీ మండలఅధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి మాట్లాడుతూ అందరినీ కలుపుకొని వెళ్లే బుర్రాకు టిక్కెట్ నిరాకరించడం బాధాకరమని, సీఎం జగన్‌కు కొంతమంది స్వార్థపరులు చెప్పిన మాయ మాటలు విని టికెట్ లేకుండా చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బుర్రాను కాదని దద్దాల నారాయణకు ఉన్న అర్హత ఏమిటని ప్రశ్నించారు. 2014లో కాశిరెడ్డికి టిక్కెట్ లేకుండా చేసిన అదే టీం నేడు బాలినేని ద్వారా బుర్రాకు టిక్కెట్ లేకుండా చేశారని మండిపడ్డారు. బాలినేని చుట్టూ తిరుగుతున్న వ్యక్తులకు నాలుగు ఓట్లు కూడా సంపాదించే సత్తా లేదని విమర్శించారు. బుర్రాను కాదని దద్దాలకు ఇస్తే ఓడిపోయో స్థానాల్లో తొలి సీటు కనిగిరేనన్నారు. ఈనేపథ్యంలో బుర్రాకు మద్దతుగా వైసీపీ మండల కమిటీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఎంపీపీ గంగసాని లక్ష్మీ మాట్లాడుతూ తాను 2014 నుంచి వైసీపీ అభివృద్ధికి పని చేస్తున్నామన్నారు. ప్రతిసారి ఎన్నికల సమయంలో కొత్త అభ్యర్థిని ప్రకటించడం పార్టీకి నష్టమన్నారు. పార్టీ హైకమాండ్ ప్రలోభాలకు లొంగి బుర్రాకు టిక్కెట్ నిరాకరించడం బాధాకరమని అన్నారు. బుర్రాకు టిక్కెట్ నిరాకరించడంతో తాను ఎంపీపీ పదవికి రాజీనామా చేస్తున్నానని ప్రకటించారు.ఇంకా జడ్పీటీసీ సభ్యుడు చప్పిడి సుబ్బయ్య, వైస్‌ఎంపీపీలు షేక్ రషీద్, గంధం ఏసురత్నం, సింగిల్ విండో చైర్మన్ పువ్వాడి వెంకట సుజాతతోపాటు పలువురు ఎంపీటీసీలు, గ్రామ సర్పంచ్‌లు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కాగా పామూరు మాజీ సర్పంచ్ డీవీ మనోహర్ వాణిజ్య విభాగం పదవికి రాజీనామాలు చేస్తున్నట్టు వెల్లడించారు. కాగా కీలకమైన పామూరు పంచాయతీ మేజర్ సర్పంచ్ అల్లూరి రాగమ్మ, ఉప సర్పంచ్ వైవీ సాయి కిరణ్, వార్డు మెంబర్లు విలేకరుల సమావేశంలో కానరాలేదు. అదే విధంగా కనిగిరి ఏఎంసీ వైస్‌చైర్మన్ షేక్ చాంద్‌బాషా సమావేశంలో పాల్గొన్నా రాజీనామా ప్రకటించకపోవడం విశేషం, పామూరు 1, 5, ఎంపీటీసీ సభ్యులు సమావేశానికి డుమ్మాకొట్టారు. అనంతరం బుర్రాకు మద్దతుగా కనిగిరికి తరలివెళ్లారు.

పీసీపల్లిలో పలువురు వైసీపీ నేతలు..

పీసీపల్లి : కనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రా మదసూదన్‌యాదవ్‌ను కాదని నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జిగా దద్దాల నారాయణయాదవ్‌ను వైసీపీ అధిష్ఠానం ప్రకటించిన నేపథ్యంలో పీసీపల్లి మండలంలోని పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఆ పార్టీ పదవులకు రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. మండల సచివాలయ కన్వీనర్ శీలం సుదర్శన్, వైసీపీ బీసీ సెల్ అధ్యక్షులు డబ్బుగొట్టు మహేష్‌నాగ్, గుంటుపల్లి ఉపసర్పంచ్‌తో పాటు పలువురు వార్డుసభ్యులు, మరికొంతమంది సచివాలయాల కన్వీనర్‌లు ఉన్నారు. మరికొంతమంది ప్రజాప్రతినిధులుగా ఉన్న బుర్రా మద్దతుదారులు రాజీనామాలు చేసేందుకు మండలంలోని ముఖ్యనాయకులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది.


రాజీనామాలకు సిద్ధమని ప్రకటిస్తున్న కౌన్సిలర్లు

రాజీనామాలు చేస్తాం..!

కనిగిరి మున్సిపల్ కౌన్సిలర్లు,ఏఎంసీ చైర్మన్, డైరెక్టర్ల ప్రకటన

కనిగిరి, జనవరి 19: కనిగిరి వైసీపీ కోటరీలో రాజకీయం వేడెక్కింది. నూతనంగా వైసీపీ ఇన్‌చార్జిగా దద్దాల నారాయణను నియమించిన సీఎం వైఖరిపై ఆపార్టీ నేతలు మండిపడుతున్నారు. ఎమ్మెల్యే మధుసూదన్‌యాదవ్ ద్వారా లబ్ధి పొందిన నేతలు మాత్రం అయనకు మద్దతుగా మాట్లాడుతుండగా, ఎమ్మెల్యే వైఖరితో అవమానాలు పొందిన నేతలు ఇలా జరగాల్సిందేనని అంటున్నారు. కనిగిరి మున్సిపల్ వైస్ చైర్మన్ ఆర్. మాణిక్యరావు, కౌన్సిలర్‌లు తమ్మినేని సుజాత, దేవరాజ్, దేవకి సత్యవతి, వేల్పుల వెంకటేశ్వర్లు, జాస్మిన్, నక్కా రామకృష్ణ, రామనబోయిన ప్రశాంతి శ్రీను, కోఆప్షన్ సభ్యుడు గూడూరి లింకన్‌లు రాజీనామాలు చేస్తామని ప్రకటించారు. అదే విధంగా మున్సిపల్ మరో వైస్ చైర్మన్ పులి శాంతి, కౌన్సిలర్ దేవకి రాజీవ్‌లు మాత్రం పార్టీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని చెప్పన్నారు. అదేవిధంగా 13వవార్డు కౌన్సిలర్ సయ్యద్ రిజ్వానాభాను, 16వ వార్డు కౌన్సిలర్ పులి విజయలక్ష్మీ శ్రీరామసతీష్, పసుపులేటి దీప మరో 5గురు కౌన్సిలర్లు మాత్రం అందుబాటులో లేకుండా పోయారు. మరో పక్క మున్సిపల్ చైర్మన్ గఫార్ తన చాంబర్‌లో రాజీనామాలకు సిద్ధమైన వారితో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. అనంతరం వారు రాజీనామా ప్రకటనను వెలిబుచ్చే సమయానికి చైర్మన్ గఫార్ వారి నుంచి దూరంగా వెళ్లిపోయారు. అదేవిధంగా ఇటీవల నూతనంగా నియమితులైన ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజుతో పాటు డైరెక్టర్‌లు చమిడిశెట్టి శ్రీనివాసులునాయుడు, నలబాల రత్తమ్మ, కాష్టాల బాలయ్య, షేక్ జమీలా, సయ్యద్ షాబీరాలు రాజీనామాకు సిద్ధమయ్యారు. అయితే ఇన్‌చార్జిగా నియమితులైన దద్దాల నారాయణ యాదవ్‌పై వైసీపీ అధిష్ఠానం ఫోన్ సర్వేతోపాటు, ఐప్యాక్ టీం ద్వారా సర్వే చేపట్టడం ప్రస్తుతం కనిగిరిలో హాట్ టాపిక్‌గా మారింది.


రాజీనామా చేస్తున్నట్లు ప్రకటిస్తున్న ఏఎంసీ చైర్మన్ సాల్మన్‌రాజు, డైరెక్టర్‌లు

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు


మాట్లాడుతున్న టీడీపీ నేత రవికుమార్

తాళ్లూరు, జనవరి 19 : వైసీపీ అరాచకపాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడి పోయిందని, మళ్లీ రాష్ట్రం అభివృద్ధిలో అగ్రగామిగానిలవాలంటే అది చంద్రబాబుకే సాధ్యమని దర్శి మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు అన్నారు. మండలంలోని బొద్దికూరపాడు గ్రామంలో గురువారం రాత్రి ఎన్టీఆర్ 28 వర్ధంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో పాపారావు మాట్లాడుతూ గతఎన్నికల్లో వైసీపీ మాయమాటలు చెప్పి ప్రజల్ని మోసగించి అధికారం చేపట్టిందని, ఈ ఐదేళ్లలో రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని విమర్శించారు. అన్ని వర్గాల ప్రజలను ఇబ్బందులు పాలు చేశారన్నారు. స్వర్గీయ ఎన్టీఆర్ ఏర్పాటుచేసిన టీడీపీ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో ఉన్నారన్నారు. హర్షిణి విద్యాసంస్థల అధినేత, టీడీపీ దర్శి నియోజకవర్గ నాయకులు గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ వైసీపీ పాలనలో నిరుద్యోగ సమస్య పరిష్కారంకాక వారికి జీవన భృతి కష్టంగా మారిందని అన్నారు. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆకర్షించి నిరుద్యోగ సమస్య తీరాలంటే అనుభవజ్ఞుడు చంద్రబాబుకే సాధ్యమన్నారు.రానున్న ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు టీడీపీని ఆదరించాలన్నారు. ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసినివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలంరెడ్డి సూరారెడ్డి, శాగం కొండారెడ్డి, షేక్ కాలేషావలి, పి.నాగిరెడ్డి, టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

టీడీపీ కార్యకర్త కుటుంబానికి గోరంట్ల సాయం

రోడ్డు ప్రమాదంలో గాయపడి కాలుకోల్పోయిన సోమవరప్పాడు గ్రామ టీడీపీ కార్యకర్త పేరుపాక బాలఏసు కుటుంబానికి టీడీపీ అండగా నిలుస్తుందని శ్రీహర్షిణి విద్యాసంస్థల అధినేత, టీడీపీ దర్శి నియోజకవర్గనాయకులు గోరంట్ల రవికుమార్ భరోసా ఇచ్చారు. శుక్రవారం బాలఏసును పరామర్శించారు. ఆకుటుంబానికి తనవంతుగా రూ.40వేల రూపాయల నగదు అందజేశారు. బాలఏసు కుమార్తెకు మూడేళ్ల పాటు ఉచితవిద్య అందిస్తామని తెలిపారు. విద్యాభ్యాసం ముగిసిన తరువాత ఉద్యోకాశం కల్పించేందుకు తాను కృషి చేస్తానని గోరంట్ల ఆ కుటుంబానికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు వల్లభనేని సుబ్బయ్య, కనిశెట్టి రామలక్ష్మయ్య, సానె సురేష్, గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.


చర్చి సెంటరులో ధర్నా చేస్తున్న యూటీఎఫ్ ఉపాధ్యాయులు


ఎస్‌టీవోకు వినతి పత్రం ఇస్తున్న ఏపీటీఎఫ్ నాయకులు

జీతాలు,బకాయిలు సక్రమంగా చెల్లించాలి..!

● యూటీఎఫ్, ఏపీటీఎఫ్ నేతల నిరసన ర్యాలీ,ధర్నా

కనిగిరి, జనవరి 19: జీతాలను, బకాయిలను చెల్లించాలని కోరుతూ శుక్రవారం యూటీఎఫ్, ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఇరు సంఘాల నాయకులు వేర్వేరుగా కనిగిరిలో నిరసన, ధర్నా కార్యక్రమాలు నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం స్థానిక చర్చి సెంటరులో జరిగిన ధర్నాలో యూటీఎఫ్ నాయకులు మీగడ వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రతి నెలా జీతాలు చెల్లింపులో జాప్యం వహించటం బాధాకరమన్నారు. అదేవిధంగా పీఆర్‌సీ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వీ. మాలకొండారెడ్డి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఎస్ ఖాజారహంతుల్లా, టీ. రమణారెడ్డి, ఎం. బ్రహ్మయ్య, నాగార్జునరెడ్డి, బీ మల్లిఖార్జునరెడ్డి, వీ నరసింహం, మాల్యాద్రి, టీ సుబ్బారెడ్డి, ఎస్‌కే ఖాజాహుస్సేన్‌లతో పాటు వివిధ మండలాల ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో..

ప్రభుత్వం ఉపాధ్యాయులకు సకాలంలో జీతాలు చెల్లింపునకు సహకరించాలని ఏపీటీఎఫ్ నాయకులు వీ రాజ్‌కుమార్ ఎస్టీవోను కోరారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టారు. అనంతరం సమస్యలపై ఎస్‌టీవోకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు హజరత్‌రెడ్డి, పాలక శ్రీను, షేక్ హుస్సేన్, తోట శ్రీనివాసులు, కేవీ సుబ్బయ్య కే రామ్మోహన్, ఒంగోలు వెంకటేశ్వర్లు, బత్తుల రవీంద్ర, చంద్రశేఖర్, రవీ, రాములు, అహ్మద్, ఎలికా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కబడ్డీ పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ


విజేతలకు బహుమతులు అందిస్తున్న మండల టీడీపీ అధ్యక్షుడు శివకోటేశ్వరరావు

దొనకొండ, జనవరి 19 :మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా స్థానిక ఒబ్బాపురం యూత్‌రాజేష్, భాను, లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో నిర్వహించిన మండలస్థాయి ఎన్టీఆర్ కబడ్డీ పోటీల్లో విజేతలకు టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వరరావు బహుమతులు అందజేశారు. పంచాయతీ వార్డు మెంబర్ బొందల రాజు అందించిన రూ.5116 నగదును ప్రథమస్థానం సాధించిన గుట్టమీదపల్లికి చెందిన శివా టీమ్‌కు, టీడీపీ నాయకులు చెన్నుబోయిన సుబ్బారావు అందించిన రూ.4116 నగదును ద్వితీయస్థానం సాధించిన ఒబ్బాపురం యూత్‌టీమ్‌కు, కుందుర్తి లక్ష్మణ్, కోటపాటి వెంకటేశ్వర్లు అందించిన రూ.3116 నగదును తృతీయస్థానం సాధించిన మల్లంపేట టీమ్‌కు అందజేశారు. ఎన్టీఆర్ వర్ధంతి సందర్భంగా క్రీడాకారులను ప్రోత్సహించేలా కబడ్డీ పోటీలను నిర్వహించిన ఒబ్బాపురం యూత్‌ను శివకోటేశ్వరరావు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు మోడి వెంకటేశ్వర్లు, కొమ్మతోటి సుబ్బారావు, బొందల రాజు, షేక్ తౌహీద్, కుందుర్తి లక్ష్మణ్, అంకాల మల్లిఖార్జున (మల్లి) క్రీడాకారులు, యువకులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఉగ్ర

కోడికత్తి కేసులో బాధితుడి న్యాయ పోరాటానికి మద్దతు

పామూరు, జనవరి 19 : కోడికత్తి కేసులో అకారణంగా శిక్షను అనుభవిస్తున్న శ్రీనుకు న్యాయం జరగాలని, అతని తల్లి, సోదరుడు చేస్తున్న న్యాయపోరాటానికి టీడీపీ తరుపున మద్దతు ఇస్తున్నామని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి తెలిపారు. పామూరులోని అంబేడ్కర్ విగ్రహానికి టీడీపీ శ్రేణులతో కలిసి శుక్రవారం నివాళులర్పించారు. దళితులపై దమనకాండ చేసిన వైసీపీ ప్రభుత్వం గద్దె దిగాలని డిమాండ్ చేశారు. విగ్రహాలు పెట్టినంత మాత్రాన దళితులను మభ్యపెట్టలేమని, వైసీపీ హయాంలో దళితులపై 5వేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది హత్యకు గురయ్యారని అన్నారు. రానున్న ఎన్నికల్లో దళితులు వైసీపీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో పువ్వాడి వెంకటేశ్వర్లు, జి. దశరథరాములు, షేక్ ఖాజారహంతుల్లా పాలపర్తి వెంకటేశ్వరు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారి ఆలయానికి రూ. 2 లక్షలు విరాళం

ముండ్లమూరు, జనవరి 19 : మండలంలోని మారెళ్ళ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న గ్రామ దేవతలు శ్రీ పోలేరమ్మ, గంగమ్మ ఆలయాలకు టీడీపీ జిల్లా నాయకులు, దర్శి నియోజక వర్గ మాజీ ఇన్‌చార్జ్ పమిడి రమేష్ రూ. 2 లక్షలు విరాళాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులకు శుక్రవారం అందజేశారు. రమేష్ ప్రతినిధి నవులూరి విద్యా సాగర్ రూ. 2 లక్షల నగదును మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావుతో కలిసి మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, సుంకర రాఘవరెడ్డి ద్వారా కమిటీ సభ్యులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కోనంకి నరేంద్ర, చిరుమామిళ్ళ చిన అంజయ్య, పేరయ్య, లక్ష్మీరెడ్డి, వెంకటరావు, సుబ్బారావు, సీహెచ్ మల్లిఖార్జున తదితరులు ఉన్నారు. రూ 2 లక్షలు అందజేసిన పమిడి రమేష్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు.



బాపట్ల :ప్యాడిసన్‌పేట జగనన్నకాలనీ గృహాల మధ్య, నిల్చిన నీరు, చిత్తడిగా మారిన రోడ్డు



నాలుగేళ్లుగా..
నత్తనడకన

పండుగలు పోతున్నాయి..

జగనన్న కాలనీల్లో గృహ ప్రవేశాలకు ముహూర్తాలు మారిపోతున్నాయే కానీ పేదల కల నెరవేరడంలేదు. ఉగాది, దసరా, దీపావళి ఇలా ప్రతి పండక్కి జగనన్న కాలనీల నిర్మాణం విషయంలో ఘనంగా లక్ష్యాలు పెట్టుకోవడం ఆ తర్వాత వాటిని విస్మరించడం ప్రభుత్వానికి రివాజుగా మారింది. ఆరు నెలల క్రితం వరకు జగనన్న ఇళ్ల నిర్మాణం పురోగతి మీద వారాంతపు సమీక్షలతో ప్రభుత్వం హడావిడి చేసేది. ఒక దశలో యంత్రాంగానికి సైతం లక్ష్యాలు విధించి ఒత్తిడికి గురిచేసేది. అలాంటిది ప్రస్తుతం కాలనీల నిర్మాణం పురోగతిని ప్రభుత్వం పూర్తిగా విస్మరించింది.

అసంపూర్తిగా జగనన్న కాలనీలు

- ఇళ్ల లక్ష్యాలు ఘనం.. పురోగతి శూన్యం
- ఎండమావిగానే మౌలిక వసతుల కల్పన
- ఎక్కడవేసిన గొంగడి అక్కడే అన్నట్లుగా పనులు
- పేదల ఇంటికి చిల్లిగవ్వ విదిల్చని రాష్ట్ర ప్రభుత్వం
- సమస్యలు పట్టించుకోని అధికారులు.. లబ్ధిదారుల అవస్థలు

రోడ్లు లేవు.. డ్రెయిన్లు లేవు.. తాగునీరు, కరెంటు లేదు.. అయినా కనాకష్టంగా ఇల్లు కట్టుకుంటే రవాణా, ఇతర సౌకర్యాలు లేవు. ఇదీ జిల్లాలోని జగనన్న కాలనీల దుస్థితి. పేరుగొప్ప, ఊరుదిబ్బ అను చందంగా జగనన్నకాలనీలు ఉన్నాయి. ఆర్భాటంగా స్థలాలిచ్చి అధికారులకు లక్ష్యాలు పెట్టి లబ్ధిదారులపై ఒత్తిళ్లు తెచ్చినా కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. పండుగలు వస్తున్నాయి.. పోతున్నాయే కానీ గృహ ప్రవేశాలు ప్రభుత్వం అనుకున్నట్లుగా కావడంలేదు. ఇల్లు కట్టుకోకుంటే స్థలం పోతుం దని.. లేదంటే మరొకరికి ఇచ్చేస్తామని లబ్ధిదారులను బెదిరించి మరీ ఇళ్లను నిర్మించుకునేలా అధికారులు చేసినా పెద్దగా నిర్మా ణాలు సాగలేదు. కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలకు.. ఇల్లు కట్టుకున్న తర్వాత నివాసం ఉండేందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించటంలో అధికారులు విఫలమయ్యారు. దీంతో అత్యధిక కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు అరకొరగానే జరిగాయి. ఎన్నికలు సమీ పిస్తున్న నేపథ్యం లో వీలైనన్ని ఎక్కువ ఇళ్లు ఈ నెలాఖరు కల్లా పూర్తి చేయించి ఫిబ్ర వరిలో సామూహిక గృహ ప్రవేశాలు చేయించాలని ప్రభుత్వం నిర్ణయించినా ఆ పరిస్థితి ఎక్కడా కానరావడంలేదు.



పాతచీరాల జగనన్న కాలనీల్లో రోడ్ల దుస్థితి



రేపల్లె : జగనన్న కాలనీలో రహదారిపై నిలిచిన నీరు, పెరిగిన పిచ్చిచెట్లు

(ఆంధ్రజ్యోతి - బాపట్ల బృందం)

కాలనీలు కాదు.. ఊళ్లను నిర్మిస్తున్నామని ప్రభుత్వం జగనన్న కాలనీల ప్రారంభోత్సవంలో ప్రకటించింది. పదుల ఎకరాల్లో లేఅవుట్లు వేసి వందల మందికి స్థలాలు ఇచ్చింది. అయితే నాలుగేళ్లు అవుతున్నా కాలనీలు ఊళ్లుగా మారలేదు కాని చిట్టడవులు, బురదగుంతలను తలపించేలా మారాయి. 'నవరత్నాలు- పేదలందరికీ ఇళ్లు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం చేసిన హడావుడి ప్రకటనలకే పరిమితమైందని జగనన్నకాలనీల్లోని క్షేత్రస్థాయి పరిస్థితులు చూస్తే అర్థమవుతోంది. పేదలందరికీ స్థలాలు ఇచ్చి, వారికి ఇళ్లు నిర్మించి ఇస్తానని ముఖ్యమంత్రి చెప్పిన మాట ఆచరణలో నీటి మూటగానే మిగిలిపోయింది. ఇళ్లు నిర్మించి ఇచ్చే విషయంలో ప్రభుత్వం పిల్లిమొగ్గలు వేసి మెలిక పెట్టడంతో లబ్ధిదారులు నిర్మాణాలపై వెనుకంజ వేశారు. పేదల ఇళ్లకు రాష్ట్ర ప్రభుత్వం చిల్లి గవ్వ కూడా విదల్చలేదు.

అరకొర వసతులు.. అప్పులు పాలు

పీఎంఏవై కింద కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రూ.లక్షా 80 వేలను తానిస్తున్నట్లు ప్రచారం చేసుకుంటోంది. లబ్ధిదారుల పేరుతో డ్వాక్రా రుణం రూ.35 వేలు తీసుకుంది. ఈ మొత్తం రూ.2.15 లక్షలతో ఇల్లు కట్టుకోలేక లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. ఫలితంగా జిల్లాలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైంది. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికి రూ.1.80 లక్షల సాయం చేస్తానని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో లబ్ధిదారులకు ఇది పూర్తిగా అందిన దాఖలాలు లేవు. పైగా మొదట వారు ఖర్చు పెడితే తిరిగి చెల్లిస్తామని ప్రభుత్వం చెప్పిన మాటలు అమలుకు నోచుకోలేదు. కొందరైతే వచ్చిన స్థలం పోతుందేమోనని తమ వద్ద ఉన్నదంతా ఖర్చు చేసి, అప్పులు తెచ్చి నానా అగచాట్లు పడి నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వ నిర్వాకం, అధికారుల ఒత్తిడి కారణంగా పేదలకు సొంతింటి కల నెరవేరకపోగా, అప్పులపాలై ఆర్థికంగా చితికి పోతున్నారు. అష్టకష్టాలు పడి ఇళ్లు నిర్మించుకున్న వారు కాలనీల్లో మౌలిక వసతుల లేక అల్లాడిపోతున్నారు. కాల్వలు నిర్మించకపోవడంతో చిన్న పాటి వర్షాలకే కాలనీలు తటాకాలను తలపిస్తున్నాయి. అధ్వాన పారిశుధ్యంతో దోమలు, దుర్వాసనలతో ప్రజలు రోగాల బారిన పడుతున్నా అధికారులకు పట్టడంలేదు. కాలనీల్లో మౌలిక వసతులు లేకపోవడంతో లబ్ధిదారుల ఇక్కట్లకు అంతేలేదు. తాగునీటి సౌకర్యం లేక లబ్ధిదారులు ఇబ్బంది పడుతున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు నిర్మించకపోవటంతో చిత్తడిగా మారిన రోడ్లపై వెళ్ళలేక పడుతున్న కష్టాలు వర్ణాతీతం. రాత్రివేళల్లో పాములు, విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందని, పట్టణ ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యం కూడా సరిగా లేదని కాలనీవాసులు వాపోతున్నారు. దీంతో ఇళ్లల్లో చేరిన వారు సైతం వాటిని ఖాళీ చేసి వెళ్లిపోతున్న దుస్థితి నెలకొంది.



రేపల్లె జగనన్న కాలనీలో డ్రైయినేజీలు లేకపోవడంతో ఇళ్ళ మధ్యనే మురుగునీరు

లబ్ధిదారుల లబోదిబో

వైసీపీ ప్రభుత్వం ఎంతో ఘనంగా చెప్పుకుంటోన్న జగనన్న కాలనీల లేఅవుట్‌లు ఒక్క వర్షానికే నీటి తటాకాలుగా మారిపోతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో లేఅవుట్లు ఉండటంతో వర్షపు నీరు పోయే మార్గం లేదు. ఎప్పటికైనా భూమిలోకి ఇంకి పోవాల్సిందే తప్ప బయటకు పోయే పరిస్థితి లేదు. లే అవుట్లలో అంతర్గత రోడ్లు, కాలువలు, విద్యుత్, బోర్ల సౌకర్యాల పేరుతో రూ.కోట్లు వెచ్చించినట్లుగా అధికార వర్గాలు చెబుతున్నా.. ఆ పరి స్థితి ఎక్కడా లేదు. ఓ మోస్తరు వర్షానికి లేఅవుట్ల లో లోపాలు బహిర్గత మౌతున్నాయి. వందల లారీలు మట్టిపోసి స్థలాన్ని ఎత్తు పెంచుకుని ఇళ్లు నిర్మించుకున్నా వర్షపు నీరు చుట్టుముట్టేస్తుందని బాధితులు వాపోతున్నారు.

కాలనీల్లో.. సమస్యల వెల్లువ

బాపట్ల జిల్లాలో మొత్తం 252 లే అవుట్లలో 32,000 ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రభుత్వం తొలుత ప్రకటించింది. అయితే ఇప్పటి వరకు పూర్తయింది కేవలం 12,000 ఇళ్లే. 2023లో ఉగాది నాటికే ఇళ్లను 12,000 వరకు పూర్తి చేయాలని లక్ష్యంగా ప్రభుత్వం పెట్టుకుంది. ఆ లక్ష్యం గతేడాది చివరి నాటికి కానీ నెరవేరలేదు. గతేడాది ఉగాదికి ముందు కూడా సంక్రాంతికి ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ దానిని చేరుకోలేదు. ఈ రీతిన ఇళ్ల నిర్మాణం కొనసాగితే మరో రెండేళ్ల గడిచినా ఆ 32,000 ఇళ్ల నిర్మాణం సాధ్యపడదనే అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది. బాపట్ల పరిధిలోని ప్యాడిసన్ పేట, మూలపాలెం, బేతనీయ కాలనీ లే అవుట్లలో రహదారులు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టలేదు. అద్దంకి, వేమూరు, రేపల్లె జగనన్నకాలనీలు వర్షాలకు ముంపుబారిన పడుతున్నాయి. బాపట్ల, కర్లపాలెం, పిట్టలవానిపాలెం మండలాల్లో స్థలాలు ఇచ్చారు కాని గృహాలు మంజూరు చేయలేదు. దీంతో ఆయా ప్రాంతాలు ముళ్ల చెట్లు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. కొల్లూరు కాలనీలోని ప్లాట్ల వద్దకు వెళ్లేందుకు రోడ్డే లేవు. నిర్మాణాలపై అధికారులు ఒత్తిడితో కొంతమంది సొంత ఖర్చుతో రోడ్డు వేసుకుని ఇళ్ల పనులు పూర్తి చేసుకున్నారు. ప్లాట్ల వద్దకు ఇంటి నిర్మాణ సామగ్రి తీసుకెళ్లే మార్గం లేకపోవడంతో చేసేదిలేక వదిలేసుకున్నారు. పనులు చేపట్టిన సుమారు 400లకు పైగా లబ్ధిదారులకు నోటీసులు ఇచ్చి వారి పట్టాలను హోల్డ్‌లో ఉంచారు. మండల పరిధిలోని తోకలవానిపాలెంలో ఒక్క ఇంటి నిర్మాణం జరగకపోగా లేఅవుట్ మొత్తం చిట్టడవిని తలపిస్తుంది. రేపల్లె 18వవార్డులో 60 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీ లే అవుట్‌లో రోడ్లు, డ్రెయినేజీ తదితర వసతులు లేవు. చిన్నపాటి వర్షానికి వర్షపు నీరు రోడ్లపైనే నిలిచి ఉంటోంది. ఇక ఇళ్ల చుట్టూ పిచ్చిమొక్కలు, దోమలతో ప్రజలు అల్లాడుతున్నారు. పూర్తిస్థాయిలో తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయలేదు. చీరాల నియోజకవర్గ పరిధిలో సుమారు 3వేల పైచిలుకు జగనన్న గృహాల్లో పూర్తి అయినవి కొన్ని కాగా అసంపూర్తిగా, అసలు ప్రారంభంకాని నిర్మాణాలు రెండింతలు ఉన్నాయి. చీరాల మండలం పాతచీరాల పరిధిలో చేపట్టిన జగనన్న కాలనీ ప్రాంతంలో ఇటీవల కురిసిన వర్షాలతో చేరిన నీరు నేటికీ అలాగే ఉంది.



చీరాల: జగనన్న కాలనీలో అసంపూర్తిగా నిర్మాణాలు



కొల్లూరు : జగనన్న కాలనీలో రహదారిని మూసివేసిన రెల్లి గడ్డి

ఓటర్ల నిష్పత్తి వ్యత్యాసంపై దృష్టి సారించాలి

ఎలక్టోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశాలు

బాపట్ల, జనవరి 19: జనాభా సంఖ్యకు, ఓటర్ల నిష్పత్తికి వ్యత్యాసం ఉన్న మండలాలపై ప్రత్యేక దృష్టితో అధికారులు విచారణ చేయాలని ఎలక్టోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ అధికారులను ఆదేశించారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితాపై ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో శుక్రవారం కలెక్టరేట్‌లో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫాం 8 కింద వచ్చిన దరఖాస్తుల్లో పొరుగు నియోజకవర్గాలు, ఇతర జిల్లాలు, పొరుగు రాష్ట్రాల వారిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల వారీగా క్షేత్ర స్థాయి విచారణ అవసరమన్నారు. శాశ్వత వలసలు గుర్తించాలని, నివాసం ఉండేవారిని నిర్ధారించాలని చెప్పారు. లాగిన్స్, డిజిటల్ కీ వినియోగంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటర్ల జాబితాపై ఫిర్యాదులు అందిన వెంటనే తగిన ఆధారాలు చూపాలని ఫిర్యాదు చేసిన వారికి నోటీసులు ఇవ్వాలని తెలిపారు. బీఎల్‌వోల నివేదికలను అధికారులు సమగ్రంగా పరిశీలించాలన్నారు. ప్రత్యేక సంక్షిప్త సవరణ ఓటర్ల జాబితా పరిశీలన ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్‌బాషా తెలిపారు. సమావేశంలో జేసీ శ్రీధర్, డీఆర్‌వో పి.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఆర్‌వోలతో సమావేశమైన ఎలక్టోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్, కలెక్టర్ పి.రంజిత్‌బాషా

15 మంది ఎస్‌ఐల బదిలీలు

బాపట్ల, జనవరి 19: జిల్లాలో 15 మంది ఎస్‌ఐల బదిలీకు ఎస్పీ వకుల్ జిందాల్ ఉత్తర్వులు జారీ చేశారు. బదిలీ అయిన వారి వివరాలను ఆయన శుక్రవారం ప్రకటించారు.

పేరు	మండలం	బదిలీ
పి.సురేష్	అమర్తలూరు	సంతమాగులూరు
ఎం.వి.శివకుమార్	సంతమాగులూరు	వీఆర్
పి.నాగశివరెడ్డి	మేదరమెట్ల	బల్లికురవ
వి.వేమన	బల్లికురవ	వీఆర్
జివి.చౌదరి	కొరిశపాడు	వీఆర్
ఎ.చంద్రశేఖర్	భట్టిప్రోలు	మేదరమెట్ల
జె.నాగరాజు	వేమూరు	అద్దంకి
ఎస్.రాజశేఖర్	చందోలు	వేమూరు
టి.అనీల్‌కుమార్	వీఆర్	చందోలు
జి.నవీన్‌కుమార్	వీఆర్	వెదుళ్లపల్లి
ఎం.అనిత	వెదుళ్లపల్లి	వీఆర్
పి.జనార్ధన్	ఈపూరుపాలెం	కర్లపాలెం
ఎం.శివయ్య	కర్లపాలెం	వీఆర్
ఎస్‌కె.అబ్దుల్‌రజాక్	వీఆర్	బాపట్ల టౌన్
డి.రత్నకుమారి	వీఆర్	అద్దంకి



కమిషనర్ రామచంద్రారెడ్డి, మేరిబాబు మధ్య వాగ్వాదం

కమిషనర్ వర్సెస్ వైసీపీ నేత

- ఆక్రమణలపై నోటీసులతో మేరిబాబు ఆగ్రహం
- మున్సిపల్ కార్యాలయంలో వాగ్వాదం.. ఆందోళన
- సీఎంవోకు ఫోన్‌తో చర్యలు ఉండవని సర్దిచెప్పిన కమిషనర్

చీరాల, జనవరి 19: మున్సిపల్ కమిషనర్ రామచంద్రారెడ్డిపై శుక్రవారం వైసీపీ యువజన నేత యాతం మేరీబాబు తీవ్రస్థాయిలో ధ్వజమెత్తి కార్యాలయంలోనే ఆందోళన చేపట్టారు. స్థానిక 7వ వార్డులో ఆక్రమణలు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి చేపట్టిన చర్యలు అటు కమిషనర్, ఇటు ఆ వార్డు అధికారపార్టీ ప్రతినిధి మధ్య తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం అందుకు వేదికగా నిలిచింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. వార్డులో ఆక్రమణల తొలగింపునకు సంబంధించి స్పందనకు అర్జీ వచ్చింది. ఈ నేపథ్యంలో కమిషనర్ రామచంద్రారెడ్డి చర్యలు చేపట్టి ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చారు. ఆ చర్యలను ఆపాలని కొద్ది రోజులుగా మేరీబాబు డిమాండ్ చేస్తూ వస్తున్నారు. ఈక్రమంలో శుక్రవారం నోటీసులు అందుకున్న మహిళతో పాటు మరికొందరు అనుచరులతో కమిషనర్ వద్దకు ఆయన వచ్చి ఆక్రమణల తొలగింపు, రోడ్డు నిర్మాణానికి సంబంధించి సమాచారం ఇవ్వకుండా ఎలా చేస్తారని ప్రశ్నించారు. ఇలాగే అన్ని వార్డుల్లో చేస్తున్నారా, కౌన్సిల్ ఆమోదం లేకుండా ఎలా చేస్తారని మేరీబాబు ప్రశ్నించారు. తమకు వచ్చిన అర్జీల నేపథ్యంలో అభివృద్ధి పనులపై నిర్ణయం తీసుకునే అధికారాన్ని, స్పందన అర్జీల పరిష్కారంపై కమిషనర్ వివరించారు. దీంతో మేరీబాబు సీఎంవోకు ఫోన్ చేసి కమిషనర్ తమ మాట వినడం లేదని ఎమ్మెల్యే బలరాం, వైసీపీ ఇన్‌చార్జ్ కరణం వెంకటేష్‌కు నష్టం చేకూర్చేలా వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు. గతంలో తమ బిల్డింగ్ పడగొట్టారని, ప్రస్తుతం తన వార్డులో కక్షపూరితంగా ఎవరో చెప్తే నోటీసులు ఇచ్చారని తెలిపారు. వార్డులో కోటి పైచిలుకు నిధులు మంజూరైతే ఒక్క రూపాయి పని కూడా జరగలేదన్నారు. అనంతరం కార్యాలయం కారిడార్‌లో ఆందోళనకు దిగారు. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ టీపీఎం లక్ష్మి ద్వారా నోటీసులపై చర్యలుండవని చెప్పించినా వారు ఆందోళన విరమించలేదు. తర్వాత కమిషనర్ వచ్చి నోటీసులపై చర్యలు ఉండవని సర్దిచెప్పటంతో ఆందోళన విరమించారు. ఈవిధంగా బెదిరిస్తే ఇక ఉద్యోగాలు ఎలా చేయగలమని పలువురు ఆవేదన చెందారు.

కమిషనర్ బదిలీ అయ్యే అవకాశం

ఎన్నికల కమిషన్ నిబంధనల నేపథ్యంలో అధికారులను సొంత జిల్లా నుంచి బదిలీ చేయడం అనివార్యం. ఆక్రమంలో కమిషనర్ రామచంద్రారెడ్డిది బేస్తవారిపేట. దీంతో ఆయన ఉమ్మడి ప్రకాశంలో సొంత జిల్లాకు చెందిన అధికారి. దీంతో ఆయన ఈ నెల 22 తర్వాత ఎప్పుడైనా బదిలీ కావచ్చు. ఈక్రమంలో ఆయన ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు జనాల్లోను చర్చ జరుగుతోంది.



బస్సులు లేకపోవటంతో నిర్మానుషంగా రేపల్లె బస్టాండ్

బస్సులు లేక.. ఇక్కట్లు

- బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు
- అరకొర సర్వీసులతో ప్రయాణానికి పాట్లు
- సీఎం సభకు జిల్లా నుంచి ఆర్టీసీ బస్సులు

బాపట్ల, రేపల్లె, జనవరి 19: విజయవాడలో శుక్రవారం సీఎం జగన్‌మోహనరెడ్డి సభ ఆర్టీసీ ప్రయాణికులకు చుక్కలు చూపించింది. జన సమీకరణకు ఎక్కడికక్కడ డిపోల నుంచి బస్సులను కేటాయించారు. దీంతో రోజువారీ, పండుగ సెలవుల అనంతరం సొంతూళ్లకు వెళ్లే వారు బస్సుల కొరతతో ఇక్కట్లు పడ్డారు. డిపోలు, బస్టాండ్లలో బస్సుల కోసం గంటల కొద్దీ పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉన్న అరకొర బస్సులు పెద్దసంఖ్యలో ప్రయాణికులతో కిటకిటలాడాయి. బస్సు ఎక్కేందుకు తోపులాటకు దిగాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. సంక్రాంతి సెలవుల అనంతరం ప్రయాణికుల రద్దీ ఉంటుందని తెలిసి అత్యధికంగా బస్సులను సీఎం సభకు కేటాయించిన ఆర్టీసీ తీరుపై ప్రయాణికులు మండిపడ్డారు. చంటి పిల్లలతో తల్లులు, వృద్ధులు పడిన అవస్థలు చెప్పనలవికావు. బస్సులను సీఎం సభకు ఏర్పాటు చేసి తమను ఇబ్బందులకు గురిచేయడం దారుణమని ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బాపట్ల డిపో నుంచి 38 బస్సులను తరలించడంతో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రయాణికులు నానా పాట్లు పడ్డారు. సమయానికి బస్సులు లేక ప్ర యాణికులు ఆటోలను, కార్లను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే అవకా శంగా ప్రైవేట్ వాహనదారులు అధిక చార్జీలు వసూలు చేశారు. రేపల్లె డిపో పరిధిలోని అన్ని బస్సులతో పాటు కాకినాడ నుంచి కూడా తెప్పించిన బస్సులను విజయవాడ సీఎం సభకు పంపారు. విషయం తెలియక బస్టాండ్‌కు వచ్చిన ప్రయాణికులు గంటల తరబడి నిరీక్షించాల్సి వచ్చింది.



రేపల్లె బస్టాండ్లలో ప్రయాణికుల పడిగాపులు



బాపట్లలో బస్సుల కోసం వేచి చూస్తూ..



నగరంలో కులగణన సర్వేను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్వరరావు

జిల్లాలో ప్రారంభమైన కులగణన

● సర్వేకు అటంకంగా మారిన సర్వర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 19: జిల్లావ్యాప్తంగా శుక్రవారం నుంచి కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరుగుతూ సర్వే చేపట్టారు. జిల్లాలోని 719 గ్రామ, వార్డు సచివాలయాల్లో ఈ సర్వే ప్రారంభం కాగా ఆదిలోనే సర్వర్ అడ్డంకిగా మారింది. పూర్తిస్థాయిలో సెల్‌ఫోన్ ద్వారా నమోదు చేయాల్సి ఉండటంతో సర్వర్ పనిచేయక వలంటీర్లు, సచివాలయ సిబ్బంది గంటల తరబడి ఒక్కో ఇంటి వద్దనే ఉండాల్సిన వచ్చింది. ఆ కుటుంబంలోని అన్ని వివరాలు నమోదు చేసేందుకు అధిక సమయం పడుతోంది. ఈ పరిస్థితి పశ్చిమప్రాంతంలో అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. కాగా ఒంగోలు నగరంలో జరుగుతున్న సర్వేను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు పరిశీలించారు. సిబ్బంది, వలంటీర్లు చేస్తున్న సర్వే వివరాలను అడిగి తెలుసుకున్నారు.

50 ఎయిడెడ్ పాఠశాలలు మూసివేత

ఒంగోలు(విద్య), జనవరి 19 : జిల్లాలో 50 ఎయిడెడ్ పాఠశాలలు మూసివేతకు రంగం సిద్ధమైంది. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు అధికారులు చర్యలు చేపడుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో విద్యార్థుల నమోదు జీరో ఉన్న ఎయిడెడ్ పాఠశాలలను మూసివేయాలని ప్రభుత్వం మొదట ఉత్తర్వులు జారీచేసింది. దాని ప్రకారం జిల్లాలో 20 పాఠశాలలు మూతపడనున్నాయి. తాజాగా ప్రస్తుతం పదిమందిలోపు విద్యార్థులు ఉన్న పాఠశాలలపై కూడా చర్యలు తీసుకోవాలని పాఠశాల విద్యా డైరెక్టర్ పి.పార్వతి గురువారం ఉత్తర్వులు జారీచేశారు. అలాంటివి 30 ఉన్నట్లు అధికారులు తేల్చారు. దీంతో జిల్లాలో తాజాగా 50 ఎయిడెడ్ పాఠశాలలను శాశ్వతంగా తాళాలు పడే పరిస్థితి నెలకొంది. తాజా సమాచారం ప్రకారం.. కొమరోలు మండలంలోని ఐదు, గిద్దలూరు మండలంలో ఆరు, మార్కాపురంలో మూడు, వైపాలెం, పుల్లలచెరువు, అర్ధవీడు, దొనకొండ, మార్టూరు, ఇంకొల్లు, పర్చూరు, కొరిశపాడు, కారంచేడులో ఒక్కొక్కటి, ఎన్‌జీపాడు నాలుగు, చీరాలలో మూడు, కనిగిరి, కంభంలో రెండు చొప్పున పాఠశాలలు మూతపడనున్నాయి. జిల్లాలో ఎనిమిది హైస్కూళ్లు, 42 ప్రాథమిక పాఠశాలలు మూతపడే ప్రమాదం ఉంది. ఈ పాఠశాలల్లో ప్రస్తుతం 180మంది టీచర్లు పనిచేస్తున్నారు. ఈ పాఠశాలలన్నింటిపై ఈనెల 22లోపు చర్యలు తీసుకొని నివేదిక సమర్పించాలని డైరెక్టర్ పార్వతి ఆదేశించారు. వారిని ప్రభుత్వ పాఠశాలల్లో విలీనం చేయాలని ఏపీ టీచర్స్ గిల్డ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వెంకట్రావు, ప్రభాకర్‌రెడ్డిలు కోరారు.



సమావేశంలో మాట్లాడుతున్న పోలా భాస్కర్

22న గుర్తింపు పొందిన పార్టీలకు ఓటర్ల జాబితాలు ఇవ్వాలి

● జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్

ఒంగోలు(కలెక్టరేట్), జనవరి 19 : గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈనెల 22వ తేదీన తుది ఓటర్ల జాబితాలను అందించాలని జిల్లా ఎలక్ట్రోరల్ అబ్జర్వర్ పోలా భాస్కర్ ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్‌లోని సమావేశపు హాలులో శుక్రవారం తుది ఓటర్ల జాబితా ప్రచురణపై తీసుకుంటున్న చర్యలపై సమీక్షించారు. ఓటర్ల జాబితాలో నిర్లక్ష్యపూరితమైన తప్పులకు ఆస్కారం లేకుండా చూసుకోవాలన్నారు. బీఎల్‌వో స్థాయిలో పకడ్బందీగా మాన్యువల్ రికార్డులను తయారు చేయించి తమ వద్ద భద్రపర్చుకోవాలని ఈఆర్వోలకు సూచించారు. తమ లాగిన్ ఐడీలను కూడా జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. అసాధారణ స్థాయిలో కొత్త ఓటర్లుగా నమోదుకు, తొలగింపులకు వచ్చిన దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిర్దేశం చేశారు. అర్హులైన ఓటర్లందరికీ త్వరగా ఫొటో గుర్తింపుకార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో కలెక్టర్ దినేష్‌కుమార్, జేసీ శ్రీనివాసులు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిబ్బందిని త్వరగా గుర్తించాలి : కలెక్టర్

వచ్చే ఎన్నికల్లో విధుల నిర్వహణ కోసం అవసరమైన సిబ్బందిని త్వరగా గుర్తించాలని కలెక్టర్ దినేష్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై ఈఆర్వోలు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎన్నికల ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా శుక్రవారం జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈనెల 22న అన్ని రాజకీయ పార్టీలకు తుది ఓటర్ల జాబితాలను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో ఇప్పటి వరకు అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలను రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించి తుది జాబితాలను అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో జేసీ శ్రీనివాసులు, డీఆర్వో శ్రీలత, ఆర్డీవో విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జలాశయంలో ఉన్న నీరు

రామతీర్థం ప్రాజెక్టుకు తగ్గిన ఇన్‌ఫ్లో

● నీటి మట్టం 80మీటర్లలోపే..

చీమకుర్తి, జనవరి19 : రామతీర్థం జలాశయంకు సాగర్‌జలాల సరఫరా రోజురోజుకు తగ్గుముఖం పట్టింది. నిన్నా మొన్నటి వరకు 1000 క్యూసెక్‌ల వరకూ వచ్చిన జలాలు శుక్రవారం 400క్యూసెక్‌లకు లోపు వస్తున్నాయి. కాగా రామతీర్థం జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 85.34మీటర్లు కాగా ప్రస్తుతం 80మీటర్ల లోపు మాత్రమే ఉంది. అయితే జలాశయం పూర్తిస్థాయిలో నిండకపోతే రాబోయే వేసవికి తాగునీటికి గడ్డు పరిస్థితులు ఏర్పడే అవకాశం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య

ఒంగోలు క్రైం, జనవరి 19: యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ఒంగోలు నగరం సుజాతనగర్ 1వ లైన్‌లో శుక్రవారం జరిగింది. పంగులూరు మండలం రామకూరుకు చెందిన కొల్లూరి రామకోటేశ్వరరావు ఒంగోలులో నివాసం ఉంటున్నారు. స్థానికంగా మార్నింగ్‌స్టార్ ట్రావెల్స్‌లో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఆయన నాలుగు నెలల క్రితం వివాహం చేసుకున్నాడు. అయితే దంపతుల మధ్య సఖ్యత లేకపోవడంతో ఇంట్లో ఎవరూ లేని సమయంలో సీలింగ్‌ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని మృతి చెందాడు. వారం క్రితం సంక్రాంతి పండుగ సందర్భంగా భార్య ఊరెళ్లింది. ఇంట్లో ఒక్కడే ఉంటున్న రామకోటేశ్వరరావు బలవర్మణానికి పాల్పడ్డాడు. తాలూకా ఎస్సై పున్నారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

అంతా ఖాళీ

వాహనలైతే వెళ్లాయి.. జనమే లేరు

సామాజిక సమతా సభకు స్పందన కరువు

200 బస్సులు పెట్టినా అవసరమైన ఏర్పాట్లు లేక మహిళలు విముఖత

స్థానికంగా పట్టించుకోని వైసీపీ శ్రేణులు

పలు నియోజకవర్గాల్లో ఇదే పరిస్థితి

విజయవాడలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జిల్లా నుంచి పెద్దగా జనం వెళ్ళిన పరిస్థితి లేదు. జిల్లావ్యాప్తంగా పొదుపు మహిళల తరలింపు కోసం 200 బస్సులను అధికారులు ఏర్పాటు చేశారు. తద్వారా 10 నుంచి 12 వేలమందిని తరలించాలని నిర్ణయించినట్లు సమాచారం. ప్రధానంగా ఒంగోలు, ఎస్ఎన్‌పాడు, దర్శి, కొండపి నియోజకవర్గాల నుంచి ఎక్కువ సమీకరణ చేయాలని, అలాగే ఇతర మండలాల నుంచి కూడా ఒక మోస్తరుగా చేయాలని భావించారు. ఇక అధికారపార్టీ నేతల ద్వారా దళిత, గిరిజన, మైనార్టీల వారిని, వైసీపీ కార్యకర్తలను నియోజకవర్గానికి ఐదారు వందల మందికి తగ్గకుండా పంపాలన్న ఆదేశాలున్నాయి. అయితే క్షేత్రస్థాయిలో అధికార పార్టీ నేతల నుంచి దీనిపై స్పందన కరువైంది. చివరకు అధికారులకు కూడా స్థానిక నేతల నుంచి సహకారం లభించలేదు, మహిళల కోసం బస్సులు ఏర్పాటుచేసినా వారికి భోజనం, ఇతర అవసరాలకు ఎవరు బాధ్యత తీసుకోలేదు. దీంతో చాలాప్రాంతాల్లో విజయవాడ వెళ్లేందుకు మహిళలు విముఖత చూపారు.

ఒంగోలు, జనవరి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం శుక్రవారం విజయవాడలో ఏర్పాటు చేసిన సామాజిక సమతా సభకు జిల్లావాసుల నుంచి స్పందన కొరవడింది. ఒకవైపు ప్రభుత్వ యంత్రాంగం, మరోవైపు వైసీపీ రాష్ట్ర నాయకత్వం జిల్లా నుంచి భారీగా మహిళలు, ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలను ఆ సభకు తరలించాలని వారంకిత్రమే ఆదేశించారు. ఆ మేరకు భారీగా ఏర్పాట్లు చేయాలన్నారు. అయితే జిల్లాలో ఆశించినస్థాయిలో స్పందన కనిపించలేదు. రాజధాని అమరావతిని ధ్వంసం చేసిన ముఖ్యమంత్రి జగన్ గత టీడీపీ ప్రభుత్వం రాజధాని ప్రాంతంలో నిర్మించతలపెట్టిన అంబేడ్కర్ స్మృతివనాన్ని పట్టించుకోలేదు. మరోవైపు రాష్ట్రంలో దళిత, గిరిజన వర్గాలపై దాడులు, దౌర్జన్యాలు పెరిగాయి. ఈ నేపథ్యంలో జనం మదిలోంచి వాటన్నింటినీ పక్కన పెట్టేలా విజయవాడలోని స్వరాజ్య మైదానంలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఆగమేఘాల మీద ఏర్పాటు చేశారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సామాజిక అంబేడ్కర్ విగ్రహ ప్రతిష్ఠాపన పేరుతో శుక్రవారం ఆ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని, దానికి ముందుగా అక్కడ మునిసిపల్ స్టేడియంలో సామాజిక సమతా సభ పేరుతో ప్రభుత్వం తరఫున భారీ సదస్సును ఏర్పాటు చేశారు. సమీప జిల్లాల నుంచి భారీగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల ప్రజలు, మహిళలను పెద్దఎత్తున తరలించేలా అధికారులకు ఆదేశాలిచ్చారు. అలాగే వైసీపీ తరఫున జన సమీకరణకు పార్టీ ముఖ్యనేతల నుంచి కిందిస్థాయికి ఆదేశాలు వచ్చాయి. వారంరోజులుగా అధికార యంత్రాంగం ఇందుకు సంబంధించి విస్తృత కసరత్తు చేసింది. కలెక్టర్, జేసీ వంటి ఉన్నత స్థాయి అధికారులు పలు సమావేశాలు పెట్టి తదనుగుణంగా బాధ్యతలు సంబంధిత అధికారులకు అప్పగించగా జిల్లా మంత్రి, ఇన్‌చార్జీ మంత్రి ఇతర అధికార పార్టీ ప్రజాప్రతినిధులు భాగస్వామ్యులయ్యారు. అయితే శుక్రవారం ఉదయం నుంచి ఆయా నియోజకవర్గాలకు బస్సులు పంపినా జనం నుంచి స్పందన కరువైంది. ఎక్కేవారు లేక కొన్ని బస్సులు వెనక్కివచ్చిన పరిస్థితి.

ఇన్‌చార్జిల గందరగోళంతో స్పందన కరువు

ఇక వైసీపీలో ప్రస్తుతం నియోజకవర్గ ఇన్‌చార్జీల మార్పుల నేపథ్యంలో ఏర్పడిన గందరగోళంతో స్థానికంగా ఎక్కడా ముఖ్యనేతలు తగు స్థాయిలో పట్టించుకోలేదు. ఫలితంగా జిల్లా నుంచి విజయవాడ సభకు హాజరు పలుచనైంది. అధికారులు 200 బస్సులు ఏర్పాటు చేసినా మహిళలు రాక చివరకు 150 బస్సులు మాత్రమే పంపించారు. వాటిలోనూ సగం మంది మించి ఎక్కిన దాఖలాలు లేవు. ఆయా ప్రాంతాల నుంచి అందిన సమాచారం ప్రకారం ఒంగోలు నగరానికి 15 బస్సులు కేటాయించగా భోజనాలు, ఇతర ఖర్చుల విషయంలో స్పష్టత లేక మహిళలు ఎవరు వేళ్లలేదు. కొండపి నియోజకవర్గానికి 12 బస్సులు కేటాయించగా కొండపి వచ్చిన బస్సులో ఎవరు ఎక్కక ఖాళీగా వెనుతిరిగింది. ఇతర బస్సుల్లోనూ నామమాత్రంగానే వెళ్లారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆరువేల



కొండపికి కేటాయించిన బస్సులో ఎవరూ ఎక్కక ఖాళీగా ఉన్న బస్సు

మెజార్టీ వైసీపీకి లభించిన అనంతరం స్థానిక ఎన్నికల్లో ఏకపక్ష విజయాలు పొందిన చీమకుర్తి మండలానికి ఐదు బస్సులు పంపితే వాటిలో జనాన్ని ఎక్కించేందుకు అధికారులు, అధికారపార్టీ నేతలు అవస్థలు పడ్డారు. చీమకుర్తి పట్టణానికి ఒక్క బస్సు ఇస్తే దాని నిండా జనం వెళ్లలేదని సమాచారం.

చొరవ చూపేవారు లేకనే..

కనిగిరి నియోజకవర్గం నుంచి 18 బస్సులు ఇచ్చినా తాజా పరిణామాల నేపథ్యంలో నాల్గవ వంతు మంది కూడా ఎక్కలేదు ఇతర ప్రాంతాల్లోనూ ఇలాంటి పరిస్థితే ఉండగా దర్శి నియోజకవర్గం నుంచి పెట్టిన 20 బస్సులలో అక్కడి వైసీపీ తాజా ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి చొరవతో కాస్తంత మెరుగ్గా జనం వెళ్లినట్లు సమాచారం. ఇక వైసీపీ శ్రేణులు, నాయకుల చొరవతో ఇతరవర్గాల ప్రజలను తరలించాలని అధిష్ఠానం ఆదేశించినా చాలా ప్రాంతాల్లో పార్టీ స్థానిక నాయకులు, కార్యకర్తలు స్పందించకపోవడంతో జిల్లా నుంచి విజయవాడ సభకు నామమాత్రంగానే హాజరు కనిపించింది. ఇదిలాఉండగా జిల్లా నుంచి పెద్దగా జనం వెళ్లక పోయినప్పటికి 150కిపైగా బస్సులు వినియోగించడంతో రోజువారీ సాధారణ ప్రయాణికులు బస్సులు లేక అవస్థలు పడ్డారు. సంక్రాంతి అనంతరం గ్రామాల నుంచి తిరిగి తాము నివాసం ఉండే ప్రాంతాలకు వెళ్లేవారు మరింత ఇక్కట్లు పడాల్సి వచ్చింది. మరోవైపు జాతీయ రహదారిపై చెన్నై-కోల్‌కత్తా మార్గంలో వెళ్లే వాహనాలను ఒంగోలు పరిధిలోని త్రోవగుంట నుంచి చీరాల వైపు మళ్లించడంతో భారీ వాహనాలు, దూర ప్రాంతాలకు వెళ్లే వాహనాల వారు అవస్థలు పడాల్సి వచ్చింది.



ఒంగోలు డిపోలో బస్సుల కోసం ప్లాట్‌ఫాం వద్ద వేచి ఉన్న దూర ప్రాంత ప్రయాణికులు

పల్లెవెలుగుల కోసం పడిగాపులు..!

ఒంగోలు(కార్పొరేషన్), జనవరి 19: ప్రభుత్వం విజయవాడలో ఏర్పాటుచేసిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతివనం ప్రారంభోత్సవం ప్రయాణికులకు కష్టాలను తెచ్చిపెట్టాయి. విజయవాడ సభకు ప్రజలను తరలించేందుకు జిల్లా నుంచి 160 బస్సులను ఇవ్వాలని ప్రభుత్వ ఆదేశాలు జారీచేయగా, అందుకనుగుణంగా ఇక్కడి ఆర్టీసీ అధికారులు కేటాయించారు. తొలుత 200 బస్సులు కేటాయించగా, ప్రజల నుంచి స్పందన కరువైంది. దీంతో బస్సులు లేక ప్రయాణికులు బస్టాండ్లలో ఇబ్బందులుపడ్డారు. కొన్నిచోట్ల బస్టాండ్‌లు వెలవెలబోయాయి. నియోజకవర్గాలకు బస్సులైతే ఏర్పాటుచేశారు గాని, అవసరమైన భోజన, ఇతర ఖర్చులకు ఒక్కపైసా కూడా ప్రభుత్వం ఇవ్వకపోవడంతో మహిళలు బస్సెక్కేందుకు ససేమిరా అన్నారు. అయితే ప్రభుత్వ ఆదేశాలతో ఆర్టీసీ బస్సులు గురువారం రాత్రికే బస్సులను ఆయా ప్రాంతాలకు పంపగా వాటిలో ఎక్కేందుకు జనం ఆసక్తిచూపలేదు. దీంతో కొన్ని బస్సులు పల్లెల్లోనే నిలిచిపోయాయి. మరోవైపు ఒంగోలులోని పట్టణ పొదుపు మహిళలకు ఇక్కడ నుంచి 15 బస్సులు కేటాయించగా, ఎలాంటి నిధులు కేటాయించకపోవడంతో ఒక్కరు కూడా వెళ్లేది లేదని మహిళలు అడ్డంతిరిగారు. దీంతో బస్సులు ఇతర ప్రాంతాలకు తరలించారు. అయితే ప్రయాణికుల గోడు మాత్రం ప్రభుత్వానికి పట్టలేదు. ఇతర పట్టణాలకు వెళ్లేవారు, గ్రామీణ ప్రాంత ప్రజలు బస్సుల కోసం పడిగాపులు కాశారు. గంటల తరబడి ఎదురుచూసినా బస్సులు రాకపోవడంతో ఇబ్బందులు పడ్డారు.

ఇటు సమ్మె.. అటు ఖాళీల భర్తీ

39వరోజుకు చేరిన అంగన్‌వాడీల సమ్మె

జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల్లో ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ జారీచేసిన అధికారులు

సమ్మెను విచ్ఛిన్నం చేసేందుకే అంటూ ఆందోళన

ఒంగోలు నగరం, జనవరి 19: అంగన్వాడీల సమ్మె శుక్రవారానికి 39వ రోజుకు చేరింది. కలెక్టరేట్ వద్ద అంగన్‌వాడీలు 24గంటల నిరవధిక దీక్షను కొన సాగిస్తూనే ఉన్నారు. శుక్రవారం దీక్షను ఆర్టీసీ రిటైర్డు ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు నరసింహారావు, వ్యవసాయ కార్మికసంఘం జిల్లా కార్యదర్శి కంకణాల ఆంజనేయులు ప్రారంభించారు. ఒకవైపు జిల్లావ్యాప్తంగా అంగన్‌వాడీలు ఆందోళన కొనసాగిస్తుండగా ప్రభుత్వం జిల్లాలో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, ఆయాల పోస్టుల భర్తీకి శుక్రవారం నోటిఫికేషన్‌ను జారీచేసింది. జిల్లాలోని 13 ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో ఖాళీగా ఉన్న 44 కార్యకర్తలు, 43 ఆయాల పోస్టులకు సీడీపీఓలు నోటిఫికేషన్లు జారీచేశారు. గతంలో ఖాళీగా ఉన్న పోస్టులను ఏళ్లతరబడి భర్తీచేయని ప్రభుత్వం ప్రస్తుతం సమ్మె నేపథ్యంలో హడావుడిగా నోటిఫికేషన్‌ను జారీచేశారు. ఈనెల 27వతేదీ వరకు దరఖాస్తులు పంపేందుకు చివరి తేదీగా నిర్ణయించారు. ఎనిమిది రోజులు గడువు మాత్రమే అభ్యర్థులకు ఇచ్చి దరఖాస్తులను ఆహ్వానించారు. ఒకవైపు సమ్మె చేస్తున్న వారిపై ఎస్మాను ప్రయోగిస్తామని బెదిరింపులకు పాల్పడుతునే మరోవైపు ఈ నోటిఫికేషన్‌లు జారీచేయటం చర్చనీయాంశంగా మారింది. కాగా వారు ఉద్యమాన్ని ఉధృతం చేసే దిశగా అడుగులు వేస్తుండగా ప్రభుత్వం అంగన్‌వాడీలపై నిర్బంధం కొనసాగిస్తూనే ఉంది. అంగన్‌వాడీ వర్కర్సు అండ్ హెల్పర్సు యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్ళవద్దంటూ గురువారం రాత్రి పలువురు యూనియన్ నాయకులకు పోలీసులు నోటీసులు అందజేశారు. అయినా జిల్లా నుంచి విజయవాడకు ఎక్కువసంఖ్యలో కార్యకర్తలు, ఆయాలు గురువారం రాత్రి తరలివెళ్లారు.



మద్దిపాడులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



బుర్రాకు టిక్కెట్ ఇవ్వనందుకు నిరసనగా తమ పదవులకు రాజీనామా చేస్తున్న పామూరు ఎంపీపీ లక్ష్మి, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు

గిద్దలూరుపై కుస్తీ .. కనిగిరిలో రభస

స్థానికుడా ? స్థానికేతరుడా?

ఆర్థిక స్థోమతే ప్రామాణికం

రేపు బాలినేని వద్ద సమావేశం

కనిగిరిలో ఇరువర్గాలు పోటాపోటీ

రాజీనామాల ప్రకటన పత్రాలు ఇవ్వని వైనం

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

గిద్దలూరు వైసీపీ ఇన్‌చార్జిపై ఆ పార్టీ అధిష్ఠానం ఇంకా కుస్తీ పడుతూనే ఉంది. మరోవైపు కనిగిరి అభ్యర్థి మార్పుతో ఆ నియోజకవర్గంలోని వైసీపీలోని ఇరువర్గాలు పోటాపోటీగా బజారుకెక్కాయి. శుక్రవారం బాలినేని సీఎంతో భేటీ అయినా గిద్దలూరు ఇన్‌చార్జిపై స్పష్టత రాలేదు. దీంతో సీటు ఆశిస్తున్న వారితో మాట్లాడాలని సీఎం ఆదేశించారు. వివరాల్లోకి వెళితే.. ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని పార్టీ ఇన్‌చార్జిల ఎంపికపై మరోసారి గురువారం సీఎం జగన్‌రెడ్డి ఎమ్మెల్యే బాలినేనితో భేటీఅయ్యారు. మార్కాపురం నుంచి ఎమ్మెల్యే నాగార్జునరెడ్డి, కందుకూరు నుంచి మహీధర్‌రెడ్డిలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. మార్కాపురం, కందుకూరుతోపాటు ఒంగోలు స్థానాలపై ఇప్పటికిప్పుడు ప్రకటన ఇవ్వనప్పటికీ నాగార్జునరెడ్డి, మహీధర్‌రెడ్డి, బాలినేనిలకు సీఎం గ్రీన్‌సిగ్నల్ చెప్పినట్లుగా సమాచారం.

గిద్దలూరుపై హైడ్రామా

కాగా గిద్దలూరు అభ్యర్థి ఎంపికపై హైడ్రామా కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. అక్కడ రెడ్డి సామాజికవర్గం వారికి అవకాశం ఇవ్వాలనే నిర్ణయం జరిగినప్పటికీ ఎవ్వరిని ఎంపిక చేయాలనే విషయంపై స్పష్టత రాలేదు. టికెట్ ఆశిస్తున్న వారిలో ఆర్థిక స్థోమత ఉన్న వారు ఎవరా? అన్న విషయంపై ప్రధానంగా దృష్టిసారించినట్లు తెలిసింది. ఒకరిద్దరు నాయకుల నుంచి రూ.20కోట్లను వెంటనే చూపించగలరా అని అధిష్ఠానం ఆరా తీసినట్లు తెలిసింది. ఆ మేరకు టికెట్ ఆశిస్తున్న నాయకుల్లో స్థానికులు, స్థానికేతరులతో కూడా చర్చించి ఒక అభిప్రాయానికి రావాలని బాలినేనికి సీఎం జగన్ సూచించినట్లుగా సమాచారం. తదనుగుణంగా బాలినేని ఆదివారం హైదరాబాద్ వచ్చి తనను కలవాలని టికెట్ ఆశిస్తున్న నాయకులకు సమాచారం పంపినట్లు తెలిసింది. స్థానికేతరుడైన రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డి పేరును పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. నియోజకవర్గంకు సంబంధించి టికెట్ ఆశిస్తున్న వారిలో రమణారెడ్డి, వెంకటేశ్వరరెడ్డిలతోపాటు ఒక డాక్టర్ మరో ఇద్దరు నాయకుల పేర్లు పరిశీలిస్తున్నట్లు సమాచారం. వారిలో గతంలో టికెట్ ఆశించి చాన్స్ దక్కని ఎస్ఆర్ఐ ఐవీరెడ్డి కూడా ఉన్నారు.

కొత్త ట్విస్టుకు అవకాశం

ఇదే సమయంలో అధిష్ఠానం మదిలో మరి కొన్ని పేర్లు కూడా ఉన్నాయి. గిద్దలూరు అసెంబ్లీ, ఒంగోలు పార్లమెంట్ టికెట్‌ను దృష్టిలో ఉంచుకొని వైవీ సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్‌రెడ్డి, బాలినేని కుమారుడు ప్రణీత్‌రెడ్డిల పేర్లు కూడా పరిశీలిస్తున్నట్లు సమాచారం. అయితే ఇద్దరి పేర్ల విషయంలో ఎలాంటి లీకులు లేకుండా జాగ్రత్త పడుతున్నారు. మొత్తంగా ఒంగోలు పార్లమెంట్, గిద్దలూరులపై అధికార వైసీపీలో ఎలాంటి పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయనే విషయం ఆసక్తిదాయకంగా మారింది.

కనిగిరిలో గందరగోళం

సిటింగ్ ఎమ్మెల్యే బుర్రాను తప్పించి జడ్పీటీసీ దద్దాల నారాయణయాదవ్ పేరును ప్రకటించిన కనిగిరి నియోజకవర్గం వైసీపీలో రభస మొదలైంది. విజయవాడలో శుక్రవారం జరిగిన అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి వెళ్లేందుకు బుర్రా అనుచరగణం విముఖత చూపింది. నారాయణ ఇంకా బాధ్యతలు చేపట్టకపోవటంతో ఆయన రంగంలోకి రాలేదు. బుర్రా వ్యతిరేకవర్గం విజయవాడ కార్యక్రమంకు వెళ్లినప్పటికీ కనిగిరి వాహనాలు ఖాళీగానే విజయవాడ వెళ్లటం కనిపించింది.

ఇక బుర్రాకు అనుకూలంగా పార్టీకి, స్థానిక సంస్థల పదవులకు ఆయన అనుచరులు రాజీనామాలు చేయటం ప్రారంభించారు. పామూరులో ఎంపీపీ మరికొందరు నేతలు రాజీనామా పత్రాలు చూపించి ప్రకటన చేయగా మిగిలిన చోట రాజీనామాలు చేసిన వారు మాటలకే పరిమితమయ్యారు. కనిగిరిలో 20 మంది వరకు ఆ పార్టీ కౌన్సిలర్లు ఉండగా బుర్రాకు మద్దతుగా ఏడుగురు మాత్రమే రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. కనిగిరి ఏఎంసీ చైర్మన్ కూడా రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. మిగిలిన మండలాల్లో రాజీనామాల పరంపర స్వల్పంగానే జరిగింది.

ఇంకో వైపు బుర్రా వ్యతిరేకవర్గం ఆ రాజీనామాల పరంపరకు అడ్డు వేసేందుకు విశ్వప్రయత్నం చేసి కొంతమేరకు సఫలీకృతులయ్యారు. మొత్తమ్మీద ఎమ్మెల్యే బుర్రా తీవ్ర అసంతృప్తితోనే ఉన్నారు. ఆయన విజయవాడలో ఉండి ప్రయత్నాలు కొనసాగిస్తున్నప్పటికీ అధిష్ఠానం నిర్ణయంపై తాడోపేడో తేల్చుకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఆయన వియ్యంకుడు అయిన కృష్ణా జిల్లా, పెనమలూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పార్థసారథి ఇప్పటికే టీడీపీలో చేరేందుకు రంగం సిద్ధమైంది. దీంతో ఎమ్మెల్యే బుర్రా తన రాజకీయ భవితవ్యంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనే అంశం చర్చనీయాంశంగా మారింది.

అద్దంకి ప్రజలకు తాగునీటి కష్టాలు

- మరమ్మతులకు గురైన మోటార్
- మూడు రోజులుగా సరఫరా బంద్

అద్దంకి, జనవరి 19: అద్దంకి పట్టణంలో మంచినీటి సరఫరాలో తీవ్ర నిర్లక్ష్యం కొనసాగుతోంది. దీంతో పట్టణ ప్రజలకు నీటి కష్టాలు తప్పటం లేదు. పట్టణంలోని మార్కెట్‌యార్డులో ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ పరిధిలో ఉన్న కాలనీలకు మూడు రోజులుగా మంచినీటి సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. గుండ్లకమ్మ నదిలోని ఊటబావుల వద్ద నుంచి రామ్‌నగర్ ట్యాంక్‌కు నీటిని పంపింగ్ చేసే మోటార్ మరమ్మతులకు గురికావటంతో సరఫరా నిలిచిపోయింది. గతంలో మరమ్మతులకు గురైన స్టాండ్‌బై మోటార్ ద్వారా నీటిని పంపింగ్ చేసేవారు. ప్రస్తుత పాలకవర్గం మంచినీటి సరఫరాపై పెద్దగా దృష్టి పెట్టకపోవటంతో తరచూ ఇబ్బందులు తప్పటంలేదు. స్టాండ్‌బై మోటార్ లేకపోవటం, మోటార్‌కు మరమ్మతులు చేయటం ఆలస్యం కావటంతో మూడు రోజులైనా ఇంకా మంచీనీటి సరఫరా పునరుద్ధరణ జరగలేదు. శనివారం అయినా నీటి సరఫరా జరుగుతుందో, లేదోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు, పాలకవర్గం వెంటనే స్పందించి నీటి సరఫరాకు చర్యలు చేపట్టడంతో పాటు స్టాండ్‌బై మోటార్ ఏర్పాటుకు చర్యలు చేపట్టాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

- తల్లిని పరామర్శించేందుకు వెళుతుండగా ఘటన

నూతలపాడు(పర్చూరు), జనవరి 19: ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న తల్లిని చూసేందుకు వెళుతూ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి దుర్మరణం చెందాడు. ఈప్రమాదం శుక్రవారం పత్తిపాడు సమీపంలో చోటుచేసుకుంది. పర్చూరు మండలం నూతలపాడుకు చెందిన వెల్లటూరి వేణుబాబు(36) హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. ప్రస్తుతం వర్క్ ఫ్రం హోంలో భాగంగా ఇంటివద్దే ఉంటూ విధులు నిర్వహిస్తున్నాడు. తల్లి అనారోగ్యం బారిన పడటంతో గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలలో చికిత్స చేయిస్తున్నారు.

ఈనేపథ్యంలో శుక్రవారం వైద్యశాలలో ఉన్న తల్లిని పరామర్శించేందుకు అదేగ్రామానికి చెందిన ఎర్రం గణేష్‌రెడ్డితో కలసి ద్విచక్రవాహనంపై గుంటూరు వెళుతున్నాడు. ఈక్రమంలో పత్తిపాడు సమీపంలో ఆర్‌టీసీ బస్సును ఓవర్‌టేక్ చేస్తున్న తరుణంలో ఎదురుగా వస్తున్న ఓప్రయివేట్ స్కూల్ బస్సును ఢీ కొట్టడంతో వేణుబాబు అక్కడికక్కడే మృతి చెందాడు. గణేష్‌రెడ్డికి తీవ్రగాయాలయ్యాయి. క్షతగ్రాతుడిని గుంటూరులోని ఓప్రయివేట్ వైద్యశాలకు తరలించారు. మృతుడికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడునెలల బాబు, భార్య ఉన్నారు.

మృతుడు సాఫ్ట్‌వేర్ ఉద్యోగంతో పాటు, గ్రామంలోని కోటయ్య దేవస్థానంలో అర్చకుడిగా పనిచేస్తూ అందరితో కలవిగా ఉండేవారు. దేవునికి నైవేద్యం సమర్పించి తల్లిని పరామర్శించేందుకు వెళుతూ మృత్యువాత పడటంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి.

మెరుగైన వైద్యసేవలకు కేరాఫ్ శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్



శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాచర్ల టీడీపీ ఇన్‌చార్జ్ జూలకంటి బ్రహ్మరెడ్డి, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు

వినుకొండ, జనవరి 19: పట్టణంలోని ఏనుగుపాలెం రోడ్డులో గల డైమండ్ టవర్స్ సమీపంలో నూతనంగా ఏర్పాటుచేసిన శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ 4వ బ్రాంచి హాస్పటల్‌ను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు, పల్నాడు జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులుతో పాటు మాచర్ల నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి, అడిషనల్ ఎస్పీ రాఘవేంద్ర చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైద్యులు గార్లపాటి కృష్ణకాంత్ మాట్లాడుతూ శ్రీదత్త సూపర్‌స్పెషాలిటీ హాస్పటల్‌లో పల్నాడు, ప్రకాశం జిల్లా వాసులకు అతి తక్కువ ఖర్చుతో అన్నిరకాల వైద్యసేవలు అత్యాధునిక వైద్యపరికరాల ద్వారా అందించడం జరుగుతుందన్నారు. అన్నివేళల్లో అత్యవసర సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. జర్నలిస్టులకు కూడా హెల్త్ కార్డుపై చికిత్స అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రముఖ వ్యాపార వేత్తలు కపిలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, వివిధ వైద్యశాలలకు చెందిన వైద్యులు, పట్టణ పురప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల లైఫ్ సర్టిఫికెట్ల నమోదు

చినగంజాం, జనవరి 19: స్థానిక భూ సమేత భావనారాయణస్వామి కళ్యాణ మండపంలో మండల పరిధిలోని రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు జీవన ప్రమాణ పత్రాల(లైఫ్‌సర్టిఫికెట్) నమోదు కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. రిటైర్డ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏడుగుండ్ల నాగేశ్వరరావు, గంటా వెంకటస్వామిల ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షన్‌దారులు, ఫ్యామిలీ పెన్షన్‌దారులకు రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా నాయకులు రిటైర్డ్ పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ టి.వెంకటేశ్వర్లు, రిటైర్డ్ ఇరిగేషన్ శాఖ ఉద్యోగి బి.వెంకటేశ్వర్లు ఆన్‌లైన్‌లో జీవన ప్రమాణ పత్రాలను నమోదు చేశారు. 2024వ సంవత్సరానికి సంబంధించిన జీవన్ ప్రమాణ పత్రాలను పెన్షన్‌దారులు తమ వేలిముద్రలు, ఐరిస్‌ల ద్వారా ఆన్‌లైన్లలో ప్రభుత్వానికి సమర్పించారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం సభ్యులు అక్కల రామకృష్ణారెడ్డి, పల్లపోలు ప్రభాకర్ విఠల్‌రావు, సైకం వెంకటేశ్వర్లు, సాంబశివరావు, ఎన్.సాయిబాబు, పెన్షన్‌దారులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలివెళ్లిన నాయకులు

మార్టూరు, జనవరి 19: విజయవాడలో శుక్రవారం జరిగిన భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు మండలం నుంచి తరలివెళ్లారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలతో పాటు ఇతర సామాజిక వర్గాలకు చెందిన ప్రజానీకం, నేతలు తరలి వెళ్లారు. మండలంలో ప్రజానీకం తరలివెళ్లడానికి ఆరు ఆర్‌టీసీ బస్సులను కేటాయించారు. వీటిల్లో స్థానిక నేతలు గర్నెపూడి రవి చందు, బాణావతు బాబూ నాయక్, అట్టారి సుకుందరావు, మైలా నాగేశ్వరరావు, గొట్టిపాటి ఆనంద్, ఉలాస గాంధీ, రాజా నాయక్, గడ్డం మస్తానవలి, పఠాన్ కాలేషావలి, తదితరులు వెళ్లారు.

అదేవిధంగా యద్దనపూడి మండలం నుంచి ఆరు ఆర్‌టీసీ బస్సులలో నాయకులు, ప్రజలు విజయవాడకు తరలి వెళ్లారు.

'నాగులపాడు' చుట్టూ వైసీపీ రాజకీయం

- రెండు వర్గాలుగా విడిపోయిన అద్దంకి పట్టణ నేతలు
- కృష్ణచైతన్య వర్గానికి చెక్ పెట్టే దిశగా పావులు కదుపుతున్న హనిమిరెడ్డి
- ఐదారు సొసైటీలకు పాత కమిటీలను మార్పుచేసి కొత్త పేర్లతో ప్రతిపాదనలు

అద్దంకి, జనవరి 19: వైసీపీ అద్దంకి పట్టణ రాజకీయం నాగులపాడు సొసైటీ చుట్టూ తిరుగుతోంది. ప్రస్తుత పాలకవర్గాన్ని కొనసాగించాలని ఒక వర్గం, కొత్త పేర్లతో ప్రతిపాదనలు పంపాలని మరో వర్గం పట్టుబట్టింది. దీంతో అద్దంకి పట్టణ వైసీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. ఒక వర్గానికి వైసీపీ పట్టణ అధ్యక్షుడు కాకాని రాధాకృష్ణమూర్తి, వర్గానికి ప్రస్తుత నాగులపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ చైర్‌పర్సన్ సందిరెడ్డి భారతి భర్త, పీడీసీసీ బ్యాంక్ మాజీ డైరెక్టర్ సందిరెడ్డి రమేష్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సందిరెడ్డి రమేష్‌తో పాటు కొంతమంది అద్దంకి పట్టణ వైసీపీ నేతలు ఇంకా కృష్ణచైతన్య అనుచరులు గానే కొనసాగుతూ హనిమిరెడ్డికి సంఘీభావం తెలపలేదు.

ఈనేపథ్యంలో నాగులపాడు సొసైటీ త్రిమెన్ కమిటీ పాలకవర్గం జనవరి 31వ తేదితో ముగియనుండగా, ఫిబ్రవరి 1వ తేది నుంచి మరలా నియామకం చేయాల్సి ఉంది. దీంతో సందిరెడ్డి రమేష్ వద్దకు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పాణెం హనిమిరెడ్డి పలుమార్లు కాకాని రాధాకృష్ణమూర్తి ద్వారా రాయబారం పంపినట్లు తెలుస్తుంది. దీనిపై స్పందించలేదన్న ఉద్దేశంతో నాగులపాడు సొసైటీకి కొత్తగా మానికొండ నాగరాజు, జార్లపాలెం రాఘవరెడ్డి, తిమ్మాయపాలెం వెంకటేశ్వర్లు (సిద్దయ్య)లతో త్రిమెన్ కమిటీకి ప్రతిపాదనలు పంపినట్లు సమాచారం. విషయం తెలుసుకున్న సందిరెడ్డి రమేష్ గురువారం రాత్రి అద్దంకి పట్టణంలో తనకు సంఘీభావంగా పలువురు కౌన్సిలర్‌లు, వైసీపీ నేతలను కూడకట్టుకొని బొల్లాపల్లి టోల్‌గేట్ వద్ద ఓ హోటల్‌లో హనిమిరెడ్డిని కలిశారు. పాత కమిటీలో ఉన్న సందిరెడ్డి భారతి, మలిపెద్ది రాంబాబు, యరమోతు సింగయ్య లను కొనసాగించాలని కోరినట్లు తెలుస్తుంది. దీంతో పాత పాలకవర్గాన్ని కొనసాగించాలని ఒక వర్గం, కొత్త పేర్లతో కమిటీ వేయాలని మరో వర్గం పట్టుబడుతుంది. పట్టణంలోని వైసీపీ నేతలు రెండు వర్గాలుగా విడిపోయి పావులు కదుపుతున్నారు. వీరిలో ఎవరికి ఇచ్చినా రెండో వర్గం కినుక వహించి వైసీపీకి దూరమయ్యే పరిస్థితులు ఉంటాయన్న అభిప్రాయం పలువురు వ్యక్తం చేస్తున్నారు.

ఇదేక్రమంలో అద్దంకి నియోజకవర్గంలో ఇంకా చైతన్య వర్గంగా కొనసాగుతున్న రావినూతల, గోవాడ, జె.పంగులూరు, చందలూరుతో పాటు మరికొన్ని సొసైటీలకు కొత్త పేర్లతో వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనిమిరెడ్డి ప్రతిపాదనలు పంపినట్లు తెలుస్తుంది. కృష్ణచైతన్య వర్గానికి చెక్ పెట్టే దిశగా హనిమిరెడ్డి పావులు కదుపుతున్నట్లు సమాచారం. ఈనేపథ్యంలో ఆయా సొసైటీల పరిధిలోని గ్రామాలలో పెద్ద ఎత్తున రాజకీయ సమీకరణలు జరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. ఏమిజరిగినా ఆయా గ్రామాలలో ఒక వర్గం వైసీపీకి దూరమయ్యే అవకాశం ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

దళితులపై దమనకాండ ఆపాలి

- అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ నిరసన



సీఎంకు బుద్ధి ప్రసాదించమని అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు

పర్చూరు, జనవరి 19: దళితులపై సీఎం జగన్మోహన్‌రెడ్డి దమనకాండ ఆపాలని, కోడికత్తి శ్రీనుకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం పర్చూరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద టీడీపీ ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా బాపట్ల పార్లమెంట్ ఎస్సీసెల్ అధ్యక్షుడు బేతపూడి సురష్, నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి తమ్ములూరి అశోక్, టీడీపీ సీనియర్ నాయకుడు నూతలపాటి ఇజ్రాయిల్ మాట్లాడుతూ నాలుగున్నరేళ్ళలో దళితులపై ఆరువేలకు పైగా దాడులు జరిగాయని, 188 మంది దళితుల్ని హత్యచేశారన్నారు. దళితులకు రాజ్యాంగబద్ధంగా అమలుకావాల్సిన 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి ఏ మొహం పెట్టుకుని విగ్రహావిష్కరణ చేస్తారని ప్రశ్నించారు. నాలుగు లక్షల మందికి టీడీపీ హయాంలో ఉపాధి కల్పించిన ఎస్సీ కార్పోరేషన్‌ను నిర్వీర్యం చేశారని అన్నారు. దళిత బిడ్డలు విదేశాల్లో విద్యనభ్యసించేందుకు తీసుకొచ్చిన అంబేడ్కర్ విదేశ విద్యాపథకాన్ని నాలుగేళ్ల పాటు అటకెక్కించారన్నారు. అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ రెడ్డి విదేశ విద్యగా మార్చి అంబేడ్కర్‌ను అవమానపరిచారని మండిపడ్డారు. కార్యక్రమంలో కట్టెంపూడి డేవిడ్, పల్లపాటి స్టేటస్, కందా వంశీ, సాంబయ్య, శ్రీహరి, చిట్టినేని రామకృష్ణ, కొండ్రగుంటి శివనాగేశ్వరరావు, కొల్లా చంద్రం, షేక్ గౌస్, షేక్.మాబ్ బాషా తదితరులు పాల్గొన్నారు.



పర్చూరులో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

శ్రీనుకు న్యాయం జరగాలి

చీరాల, జనవరి 19: కోడి కత్తి కేసులో నిందితుడు శ్రీనుకు న్యాయం జరగాలని టీడీపీ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం స్థానిక కారంచేడు గేటు సెంటర్‌లోని డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి విజ్ఞాపన పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నిందితుడు శ్రీనుకు సుమారు ఐదు సంవత్సరాల నుంచి కనీసం బెయిల్ కూడా లేకుండా జైలులో మగ్గటం వెనుక సీఎం జగన్ కుట్ర ఉందని ఆరోపించారు. శ్రీను కుటుంబసభ్యులు ప్రస్తుతం తమ బిడ్డ కోసం దీక్షకు దిగారని, అందుకు ప్రతిఒక్కరూ సంఘీభావం తెలపాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దులూరి గౌరీఅమర్‌నాద్, గుద్దంటి చంద్రమౌళి, నాశిక వీరభద్రయ్య, గజవల్లి శ్రీనివాసరావు, గంజి పురుషోత్తమ్, కౌతవరపు జనార్ధనరావు, నరాల తిరుపతిరాయుడు, దుడ్డు శామ్యూల్, తదితరులు పాల్గొన్నారు. కోడికత్తి కేసులో శ్రీనుకు న్యాయం జరిగేందుకు సీఎం జగన్ ఎన్ఐఏ కోర్టు విచారణకు హాజరై వాస్తవాలను వివరించి సాక్ష్యం చెప్పాలని బీఎస్పీ నియోజకవర్గ అ ధ్యక్షుడు గొర్రెపాటి రవికుమార్ శుక్రవారం డిమాండ్ చేశారు. శ్రీనుకు బెయిల్ రాకుండా రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటుందని ఆరోపించారు.

చెరువులకు చేరుతున్న సాగర్ జలాలు

- మార్టూరుకు నామమాత్రమే!



బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద సాగర్ కాలువలో తక్కువగా వస్తున్న నీరు

మార్టూరు, జనవరి 19: వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా గ్రామాలలోని మంచినీటి చెరువులను నింపడానికి విడుదల చేసిన సాగర్ జలాల ప్రవాహం అంతంత మాత్రంగానే ఉంది. నీటి ప్రవాహం చాలా తక్కువగా ఉండటంతో చెరువులకు అరకొరగా సాగర్ జలాలు చేరుతున్నాయి. శుక్రవారం బొల్లాపల్లి జీఎన్‌టీ వద్ద 220 క్యూసెక్కులు నీళ్ల వస్తున్నాయి. మండలంలోనే మేజరు పంచాయతీ మార్టూరు మంచినీటి చెరువుకు చాలా తక్కువ మోతాదులో నీళ్ల చేరుతున్నాయి. ప్రస్తుతం చెరువులో 30 శాతం మాత్రమే నీరు ఉంది. రాబోయే వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా విడుదలయిన సాగర్ జలాలుతో చెరువులను నింపాలని పంచాయతీ అధికారులు భావించారు. నాలుగు రోజుల క్రితం మన ప్రాంతానికి సాగర్ జలాలు వచ్చినప్పటికీ గురువారం మాత్రమే మార్టూరు చెరువుకు నీళ్ల చేరాయి. సాగర్ ప్రధాన కాలువ నుంచి రాజుపాలెం మేజరుకు 15 క్యూసెక్కులు మాత్రమే నీళ్ల వస్తున్నాయి. ఈమేజరులో 50 క్యూసెక్కులు వస్తేనే దిగువకు చేరతాయి.

రాజుపాలెం మేజరు కాలువ పక్కనే ఉన్న ద్వారకపాడు, ఇసుకదర్శి, నాగరాజుపల్లి, వలపర్ల గ్రామాల పరిధిలోని రైతుల పొలాలు నుంచి తప్పించుకొని మార్టూరు చెరువుకు నీళ్ల చేరడం కష్టతరంగా మారింది. ప్రస్తుతం ఈ కాలువ ప్రక్కనే రైతులు వేసిన మొక్క జొన్న పంట బెట్ట దశలో ఉంది. ఈనేపథ్యంలో మార్టూరు చెరువుకు నీళ్ల చేర్చడం అధికారులకు తలనొప్పిగా మారింది. దీనికితోడు ఈ నెల 22 వతేదీ నాటికి సాగర్ నీళ్ల రావడం నిలిచిపోతుందని అధికారులు చెబుతున్నారు. కనీసం పది రోజులు సమృద్ధి మార్టూరు చెరువుకు నీళ్ల చేరితేనే 70 శాతం నిండుతుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితులలో ఈ మోతాదులో చెరువుకు నీళ్ల చేరే పరిస్థితి కనిపించడం లేదు.

వేసవిలో తాగునీటికి ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని పంచాయతీ ఈవో శ్రీనివాసరావు అంటున్నారు. మంచినీటి చెరువు వద్ద అదనంగా రెండు బోర్లును ఏర్పాటుచేస్తామని చెప్పారు. మండలంలోని వలపర్ల, ద్రోణాదుల, బొల్లాపల్లి, బొబ్బేపల్లి, తాటివారిపాలెం, తదితర గ్రామాలలోని చెరువులకు సాగర్ జలాలు చేరుతున్నాయి.

అంగన్‌వాడీలపై ప్రభుత్వం చిన్నచూపు

- కార్యకర్తల ధ్వజం
- 39వ రోజుకు చేరిన సమ్మె



అద్దంకిలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు

అద్దంకిటౌన్, జనవరి 19: తమ సమస్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేస్తున్నా ప్రభుత్వం చిన్నచూపు చూస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు తంగిరాల వెంకటేశ్వర్లు ధ్వజమెత్తారు. అంగన్‌వాడీలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారం నాటికి 39వ రోజుకు చేరుకుంది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బంగ్లారోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వరకు చేరుకుని సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా తమ సమస్యలు పరిష్కార మయ్యేవరకు సమ్మెను విరమించబోమని అంగన్‌వాడీ కార్యకర్తలు చెప్పారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి పి.తిరుతిరెడ్డి, బీఎస్పీ నాయకుడు మందా జోసఫ్ సంఘీభావం తెలిపారు.

మార్టూరు: అంగన్‌వాడీ కార్యకర్తలు శుక్రవారం మండల కాంప్లెక్స్ వద్ద దీక్షా శిబిరాన్ని కొనసాగించారు. రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమస్యలను పరిష్కరింతేవరకు సమ్మెను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీలు శ్యామల, రాణి, రాజేశ్వరి, అంజలి, రాజ్యం, లలిత, సుహాసిని, విజయ, తదితరులు పాల్గొన్నారు.

బల్లికురవ: ప్రభుత్వం తమకు ఇచ్చిన హమీలను అమలుచేయాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన నిరవధిక సమ్మె శుక్రవారానికి 38వ రోజుకు చేరింది. స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన కార్యకర్తలు, హెల్పర్లు సమ్మెలో పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కార్యక్రమంలో సంఘ నేతలు నాగమణి, నిర్మల, సరస్వతి, అనురాధ, సత్యవతి, శ్రీదేవి పాల్గొ న్నారు.

చినగంజాం: చావో, రేవో తెల్చుకుంటామే తప్ప సమ్మెను విరమించేదిలేదని అంగన్‌వాడీ కార్యక ర్తలు హెచ్చరించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న నిరవధిక సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ఉద్యమాన్ని ఉధృతం చేస్తామే తప్ప తగ్గేదే లేదని అన్నారు. కార్యక్రమంలో ఇంకొల్లు ప్రాజెక్టు అంగన్‌వాడీల సంఘం నాయకురాలు ఎ.హైమావతి, తదితరులు పాల్గొన్నారు.

చీరాల: సీఎం జగన్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని అంగన్‌వాడీ కార్యకర్తలు ధ్వజమెత్తారు. శుక్రవారం పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలను విజయవాడ సభకు వెళ్లకుండా చీరాల వన్‌టౌన్, ఈపురుపాలెం పోలీస్‌స్టేషన్లకు తరలించి అనంతరం విడిచిపెట్టారు. ఈక్రమంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద 38వ రోజు సమ్మెలో భాగంగా దీక్ష కొనసాగించారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎం.వసంతరావు, ఎన్.బాబూరావు, సుజీవన, సులోచన, సుప్రభ, అనిత, కృష్ణవేణి, తదితరులు పాల్గొన్నారు.

హోరాహోరీగా ఎడ్ల బలప్రదర్శన పోటీలు

అన్నంబొట్లవారిపాలెం(పర్చూరు), జనవరి 19: పర్చూరు మండలం అన్నబొట్లవారిపాలెంలో జరుగుతున్న ఎడ్ల బలప్రదర్శనలో శుక్రవారం ఫైనల్ పోటీలు జరిగాయి. పెద్దసైజు ఎడ్ల ఫైనల్ పోటీలో తొలుత గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం కుంచనపల్లికి చెందిన త్రినజ్ఞ రెడ్డి ఎడ్ల జత నిర్ణీత సమయం ముగిసేసరికి 3901.1 దూరం లాగాయి. తదుపరి బరిలోకి దిగిన హైదరాబాద్ కూకట్‌పల్లికి చెందిన ఎస్ఎస్ బుల్స్ ఎడ్ల జత 3900 అడుగులు, గుంటూరు జిల్లా చుండూరు మండలం, వేటపాలెంకు చెందిన ఆర్కేబుల్స్ ఎడ్ల జత 3405 అడుగులు, గుంటూరు జిల్లా, పొన్నూరుకు చెందిన ఎడ్లు 2486 అడుగుల దూరం లాగాయి. ప్రస్తుత పోటీలో కృష్ణాజిల్లా ఒంగోలు జాతి ఎడ్లు ముందంజలో ఉన్నాయి. గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేయనున్నట్టు నిర్వాహకులు గోరంట్ల భాస్కర్‌రావు తెలిపారు.



పోటీలో తలపడుతున్న ఎడ్లు

కొరిశపాడు, మేదరమెట్ల ఎస్ఐలు బదిలీ

మేదరమెట్ల, జనవరి 19: సాధారణ ఎన్నికలు సమీపిస్తుండడంతో ఎస్ఐల బదిలీలు ప్రారంభం అయ్యాయి. శుక్రవారం మేదరమెట్ల, కొరిశపాడు ఎస్ఐలు నాగశివారెడ్డి, జీవీ చౌదరిలు సంవత్సరం కాంకుండానే బదిలీ అయ్యారు. మేదరమెట్ల స్టేషన్‌కు ఏ.చంద్రశేఖర్‌ను నియమిస్తూ ఉత్తర్వులు వచ్చాయి. మేదరమెట్ల ఎస్ఐ నాగశివారెడ్డిని బల్లికురవ పోలీస్‌స్టేషన్‌కు బదిలీ చేశారు. కొరిశపాడు ఎస్ఐ జీవీ చౌదరిని వీఆర్‌కు పిలిచారు. కొరిశపాడు ఎస్ఐగా ఎవ్వరిని నియమించలేదు. కొత్తగా ఎస్ఐలు వచ్చేవరకు వీరే విధులలో కొనసాగుతారని తెలిసింది.

సంతమాగులూరు ఎస్ఐగా సురేష్

సంతమాగులూరు, జనవరి 19: సంతమాగులూరు ఎస్ఐగా పి.సురేష్ నియమితు లయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఎంవీ శివకుమార్ బాపట్ల జిల్లా పోలీసు కార్యాలయానికి (వీఆర్)కు వెళ్ళారు. అమర్తలూరు పోలీసుస్టేషన్‌లో ఎస్ఐగా పనిచేస్తున్న సురేష్ సంత మాగులూరుకు బదిలీ అయ్యారు. త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బాపట్ల జిల్లాలో 15 మంది ఎస్ఐలకు స్థాన చలనం కలిగింది.

నేడు 1వ వార్డులో పర్యటించనున్న ఎమ్మెల్యే రవికుమార్

అద్దంకి, జనవరి 19: బాబు ష్యూరిటీ... భవిష్యత్‌కు గ్యారెంటీ కార్యక్రమం అద్దంకి పట్టణంలోని 1వ వార్డులో శనివారం సాయంత్రం 5 గంటలకు జరగనుంది. ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ ఈకార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారు.

న్యాయాధికారికి సన్మానం

అద్దంకి, జనవరి 19: అద్దంకి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జూనియర్ అసిస్టెంట్ కేటగిరిలో టైపిస్టుగా పనిచేస్తూ ఇటీవల జ్యుడిషియల్ మేజిస్ట్రేట్‌గా ఎంపికై ప్రొద్దుటూరు మేజిస్ట్రేట్‌గా నియమితులైన సురేంద్రరెడ్డిని శుక్రవారం స్థానిక కోర్టులో సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ న్యాయాధికారి బుజ్జప్ప, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షను సద్వియోగం చేసుకోవాలి

చినగంజాం, జనవరి 19: ప్రభుత్వం అమలుచేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఎంపీడీవో ఎన్.వేణుగోపాలకృష్ణమూర్తి అన్నారు. మండలంలోని కడవకుదురు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. సంతరావూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారులు కోట్ల కీర్తిసరోజ్, బి.నాగేంద్ర, గైనకాలజిస్ట్ డాక్టర్ షణ్ముఖశ్రీ, జనరల్ ఫిజిషియన్ డాక్టర్ జి.పృథ్వి 353 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురికి కళ్లజోళ్ళు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జి.శివకుమారి, గ్రామ కార్యదర్శి ఎన్.సూర్యనారాయణ, పొదలి రాఘవ, తదితరులు పాల్గొన్నారు.

12వ పీఆర్సీని వెంటనే అమలుపరచాలి

ఇంకొల్లు, జనవరి 19: ప్రభుత్వ ఉద్యోగులకు 12వ పీఆర్సీని జూలై 1,2023 నుంచి ప్రభుత్వ ఉద్యోగులందరికీ అమలుచేసేలా చర్యలు తీసుకోవాలని ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా ప్రధానకార్యదర్శి పిడపర్తి పేరిరెడ్డి అన్నారు. వేతన సవరణ అమలులో జాప్యం జరిగితే కనీసం వెంటనే 30 శాతం ఐఆర్ ప్రకటించాలని, ఇప్పటివరకు పెండింగులో ఉన్న డీఏలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇంకొల్లు, జనవరి 19: ఇంకొల్లు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 9 నుంచి ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ జాగర్లమూడి రామకృష్ణ తెలిపారు. ఇంకొల్లు, గంగవరం, కొణికి, పావులూరు, గొల్లపాలెం, హనుమోజిపాలెం, ఇంకొల్లు సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నార. వినియోగదారులు విద్యుత్ అంతరాయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను బదిలీ చేయాలి

అద్దంకిటౌన్, జనవరి 19: ఆర్టీసీ కార్మికులను వివిధరకాలుగా ఇబ్బందులు గురిచేస్తున్న ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్‌ను బదిలీ చేసేవరకు నిరసనలు కొనసాగిస్తామని ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా ప్రెసిడెంట్ చిరంజీవి డిమాండ్ చేశారు. శుక్రవారం అద్దంకి ఆర్టీసీ డిపో ఎదుట ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో కార్మికులతో గేట్ మీటింగ్ నిర్వహించారు. ఈసందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ అద్దంకి డిపో అసిస్టెంట్ మేనేజర్‌పై కార్మికులు తీవ్ర వ్యతిరేకతతో ఉన్నారన్నారు. సర్వీస్‌లకు వెళ్ళిన డ్రైవర్, కండెక్టర్లు తక్కువ కలెక్షన్‌లు తెస్తే నోటి కొచ్చినట్లు తిడుతున్నారన్నారు. ఆమెను బదిలి చేయకుంటే ఆదివారం నుంచి రిలే దీక్షలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో డిపో ప్రెసిడెంట్ అబ్దుల్ వహీద్, సుబ్బరామయ్య, శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు, గ్యారేజి సెక్రటరీ వివేక్, తదితరులు పాల్గొన్నారు.

కుల గణన సర్వే ప్రారంభం

బల్లికురవ, జనవరి 19: మండలంలోని అన్ని గ్రామాలలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైందని ఈవోపీఆర్డీ సుమతి తెలిపారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికి తిరిగి కులాల వారీగా ప్రజల వివరాలను సేకరిస్తున్నారు. సచివాలయ సిబ్బంది ప్రత్యేక యాప్‌లో కులగణన వివరాలను నమోదు చేయాలని ఈవోపీఆర్డీ ఆదేశించారు.

నీటి కుంట ఏర్పాటుకు స్థల పరిశీలన

బల్లికురవ, జనవరి 19: మండలంలోని ముక్తేశ్వరంలో అమృత్ సరోవర్‌లో నీటి కుంట ఏర్పాటుకు శుక్రవారం డ్వామా పీడీ అర్జునరావు, డీఎఫ్‌వో భీమయ్య స్థలపరిశీలన చేశారు. ముక్తేశ్వరం పరిధిలోని అటవీ భూమి సర్వే నెంబరు 153లో నీటి కుంట ఏర్పాటు చేసేందుకు అటవీ శాఖాధికారులు భూమిని కేటాయించారు. ఈ భూమిలో ఉపాధి హామీ పథకం ద్వారా నీటి కుంట ఏర్పాటుచేసేందుకు అధికారులు స్థలాన్ని పరిశీలించారు. ఈ పరిశీలనలో ఏపీడీ సువార్త, ఎంపీడీవో బ్రహ్మయ్య, మండల ప్రత్యేకాధికారి బాలసుబ్రమణ్యం, ఏపీవో బాలకృష్ణనాయక్, ఫారెస్టు బీట్ ఆఫీసర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నేర నియంత్రణకు సహకరించాలి


చీరాలటౌన్, జనవరి 19: చీరాల పరిధిలో నేర నియంత్రణకు లాడ్జి, రిసార్ట్స్ నిర్వాహకులు సహకరించాలని డీఎస్పీ ప్రసాదరావు సూచించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శుక్రవారం డీఎస్పీ కార్యాలయంలో రిసార్ట్స్, లాడ్జి నిర్వాహకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రికార్డులు పక్కాగా ఉండాలన్నారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ సూర్యనారాయణ, సీఐలు నిమ్మగడ్డ సత్యనారాయణ, శేషగిరిరావు, ఎస్ఐలు జనార్ధన్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు

మేదరమెట్ల, జనవరి 19: జాతీయ రహదారిలో విజయవాడవైపు వాహనాలు వెళ్లకుండా నిలుపుదల చేయడంతో వాహనదారులు ఇబ్బందులుపడ్డారు. శుక్రవారం విజయవాడలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ సభ జరిగింది. శుక్రవారం ఉదయం 10 గంటల తరువాత వాహనాలను విజయవాడ వెళ్లకుండా నిలిపివేశారు. మేదరమెట్ల, కొరిశపాడు ఎస్ఐలు చెన్నై వైపు నుంచి వచ్చే వాహనాలను మేదరమెట్ల ఫ్లైఓవర్ వద్ద ఆపివేశారు. విశాఖపట్టణం, ఒడిస్సా, కోల్‌కత్తా వైపు వెళ్ళే వాహనాలు రోడ్డుపైనే నిలిపివేశారు. రాత్రి 8 గంటలకు వరకు కిలోమీటర్లు కొద్దీ వాహనాలు నిలిచిపోయాయి. 8 గంటల తరువాత వాహనాలను విజయవాడ వైపు అనుమతించారు. కూరగాయలు, పాలు వంటి అత్యవసర వాహనాలు వెళ్లడానికి వీలులేక నిలిచిపోయాయి. మేదరమెట్ల కొరిశపాడు ఎస్ఐలు జీవీ చౌదరి, నాగశివారెడ్డి ఫ్లైఓవర్ వద్ద ఉండి వాహనాలను నియంత్రించి విడతలవారీగా పంపించి వేశారు.

కళాకారులను ఆదుకోవాలి

అద్దంకిటౌన్, జనవరి 19: కళాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి కల్పించాల్సిన సౌకర్యాలు అందేలా కృషి చేయాలని ఎంపీ రఘురామకృష్ణమరాజును అద్దంకి కళాకారులు, బాపట్ల జిల్లా సాంస్కృతిక అధ్యక్షుడు గోవాడ శ్రీకాంత్ కోరారు. శుక్రవారం హైదరబాద్‌లోని ఎంపీ నివాసంలో ఆయనను కళాకారులు కలిశారు. వృద్ధ కళాకారులకు కేంద్రం ద్వారా వచ్చే పెన్షన్లు, ప్రతి నియోజకవర్గంలోని కళాకారుడికి గృహ వసతి, బస్సు చార్జీలలో రాయితీ, రంగస్థల నాట్య కళాకారుల గుర్తింపు కార్డులు, వివిధ సౌకర్యాలు అందించేలా చూడాలని ఎంపీని కోరారు. ఈసందర్భంగా ఎంపీ రఘురామ కృష్ణమరాజు మాట్లాడుతూ కళాకారులకు కావల్సిన సౌకర్యాలపై రానున్న పార్లమెంట్‌లో సమావేశాల్లో మాట్లాడ తానని తెలిపారు. అయన్ను కలిసిన వారిలో టీడీపీ సాంస్కృతిక విభాగం జిల్లా అధికార ప్రతినిధి చెబ్రోలు వెంకటసుబ్బయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షుడు జయబాబు తదితరులు ఉన్నారు.



ఏసీబీ వలలో వీఆర్వో!

- రైతు వద్ద రూ.20వేలు లంచం తీసుకుంటూ దొరికిపోయాడు!

ఏఎస్‌పేట, జనవరి 19 : పొలం విషయమై పేరు మార్పు కోసం ఓ రైతు వద్ద లంచం తీసుకుంటూ ఓ వీఆర్వో అవినీతి నిరోధక శాఖ (ఏసబీ) అధికారులకు పట్టుబడ్డాడు. మండల కేంద్రమైన ఏఎస్‌పేట తహసీల్దారు కార్యాలయంలో శుక్రవారం ఏసీబీ దాడుల ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే.. పెద్దహబీపురం గ్రామనికి చెందిన పొలిశెట్టి రామ్మూర్తి, సుబ్బమ్మలకు ఉన్న నాలుగెకరాల పొలాన్ని తమ ఇద్దరు కుమారులు చంద్రభూ షణ్, కోటేశ్వర రావులకు చెరో రెండెకరాల చొప్పున రాసి ఇచ్చారు. కానీ కోటేశ్వరరావుకు చెందిన రెండెకరాలను చంద్రభూషణ్ కొనుగోలు చేశారు. అయితే, కోటేశ్వరరావు వీఆర్వో హజరతయ్య సహకారంతో భూమి మొత్తం తన పేరిట అడంగ ళ్ ఎక్కించుకున్నారు. ఈ విషయం తెలిసి చంద్రభూషణ్ పొలం తాను కొనుగోలు చేశానంటూ పత్రాలు చూపాడు. దీంతో ఎకరాకు రూ.15 వేలు చొప్పున నాలుగెకరాలకు రూ.60 వేలు ఇస్తే పేరు మీదకు మారుస్తానని డిమాండ్ చేశారు. చివరికి 40 వేలకు ఒప్పందం కుదిరింది. ముందుగా రూ.20వేలు ఇవ్వాలని సూచించారు. అయితే, అంత నగదు ఇచ్చుకోలేని చంద్రభూషణ్ ఏసీబీ డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్‌ను ఆశ్రయించాడు. ఆయన సూచనల మేరకు శుక్రవారం మధ్యాహ్నం తహసీల్దారు కార్యాలయంలో చంద్రభూషణ్ వీఆర్వోకు రూ.20వేలు నగదు ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. నగదును స్వాధీనం చేసుకుని, వీఆర్వో హజరత్తయ్యను అదుపులోకి తీసుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ మోహన్ తెలిపారు. ఈ దాడిలో ఏసీబీ సీఐలు ఆంజనేయరెడ్డి, విజయకుమార్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



ఏసీబీకి పట్టుబడ్డ వీఆర్వో హజరత్తయ్య, స్వాధీనం చేసుకున్న నగదు

22 నుంచి విధులకు న్యాయవాదులు

- నెల్లూరు బార్ అసోసియేషన్

నెల్లూరు (లీగల్) : ఈ నెల 22వ తేదీ నుంచి న్యాయవాదులు కోర్టు విధులకు హాజరు కావాలని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పీ ఉమా మహేశ్వర్ రెడ్డి, మద్దిబోయిన సుందరయ్య యాదవ్ తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం 12.30 గంటలకు నెల్లూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదుల సర్వసభ్య సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశపెట్టిన ల్యాండ్ టైటలింగ్ యాక్ట్ -2023కి వ్యతిరేకంగా న్యాయవాదులు డిసెంబరు 7వ తేదీ నుంచి కోర్టు విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్నారన్నారు. అయితే కక్షిదారుల అవసరాల దృష్ట్యా న్యాయవాదులు విధులకు హాజరవుతూ సదరు చట్టంపై ప్రజలకు వివిధ రూపాలలో అవగాహన కల్పించాలని ప్రత్యేక కమిటీ చేసిన సూచన మేరకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.


వెంకటగిరిలో జనసునామీ

- టీడీపీ బహిరంగసభకు పోటెత్తిన ప్రజానీకం
- చంద్రబాబుపై శ్రేణుల్లో ఇనుమడించిన అభిమానం
- సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయిన పార్టీ జిల్లా నేతలు

వెంకటగిరి, జనవరి 19 (ఆంధ్రజ్యోతి): వెంకటగిరిలో శుక్రవారం చంద్రబాబు పాల్గొన్న 'రా కదలిరా' బహిరంగసభకు జనం పోటెత్తారు. అధినేత పట్ల శ్రేణుల్లోనూ, ప్రజల్లోనూ అభిమానం, ఆదరణ మరింతగా ఇనుమడించిన వైనం సభలో కళ్ళకు కట్టింది. వెంకటగిరి సెగ్మెంట్ నుంచీ భారీఎత్తున శ్రేణులు తరలి రాగా శ్రీకాళహస్తి, గూడూరు నియోజకవర్గాల నుంచీ కూడా పెద్ద సంఖ్యలో కార్యకర్తలు, ప్రజలు సభకు హాజరయ్యారు. ఇక తిరుపతి పార్లమెంటు నియోజకవర్గ పరిధిలోని మిగిలిన సెగ్మెంట్ల నుంచీ కూడా ఇంచార్జులు ప్రతిష్టాత్మకంగా తీసుకుని పార్టీ శ్రేణుల్ని సమీకరించడంతో వెంకటగిరి హెలిపాడ్ వద్ద, పట్టణ ప్రధాన రహదారులతో పాటు బహిరంగసభాస్థలి, పరిసర ప్రాంతాలు కూడా జనంతో నిండిపోయాయి. చంద్రబాబు మధ్యాహ్నం 11.47 గంటలకు హెలికాప్టర్‌లో వెంకటగిరి చేరుకున్నారు. అక్కడ నుంచీ 12.20 గంటలకు సభా వేదికపైకి చేరుకున్నారు. 12.52 గంటలకు ప్రసంగం ప్రారంభించిన ఆయన 1.42 దాకా మాట్లాడారు. ఎండ చురుగ్గా వుండడంతో పాటు ఆకలి వేస్తున్నా పార్టీ శ్రేణులు గానీ, ప్రజలు గానీ బహిరంగసభా ప్రాంగణం నుంచీ కదలలేదు. చంద్రబాబు వేదికపైకి వచ్చినపుడు జనం నుంచీ వచ్చిన స్పందన చూశాక ఆయన పట్ల శ్రేణుల్లో అభిమానం మరింత పెరిగినట్టు అనిపించింది. పలు అంశాలపై నేరుగా శ్రేణులనే ప్రశ్నించినపుడు కూడా కార్యకర్తలతో పాటు జనం ఉత్సాహంగా స్పందించి సమాధానాలిచ్చారు. చంద్రబాబు సభాస్థలి నుంచీ వెనుదిరిగాకే జనం వెలుపలికి వచ్చారు. వెంకటగిరి పట్టణ చరిత్రలో ఓ రాజకీయ సభకు ఈ స్థాయిలో జనం హాజరు కావడం విశేషమని స్థానికులు మాట్లాడుకోవడం వినిపించింది. అంచనాలకు మించి జనం హాజరు కావడంతో తిరుపతి జిల్లా టీడీపీ నేతలు సంతోషంతో ఉబ్బితబ్బిబ్బయ్యారు.



జిల్లా మారినా జనం రాత మారిందా?



వైసీపీ ప్రభుత్వానికి కౌంట్ డౌన్ మొదలైంది. రానున్న ఎన్నికల్లో తిరుపతి పార్లమెంటు నియోజకవర్గంలోని ఏడు అసెంబ్లీ స్థానాలూ గెలుస్తున్నాం.

వెంకటగిరిలో బ్రహ్మాండమైన బహిరంగసభలో వేలాదిగా హాజరైన పార్టీ శ్రేణులను, ప్రజలనుద్దేశించి మాట్లాడిన చంద్రబాబు జిల్లా ప్రధాన అంశాలను ప్రస్తావిస్తూ, ప్రజలకు ప్రశ్నలు సంధిస్తూ, వారి నుంచి సమాధానాలు రాబడుతూ ఉత్సాహంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. ఆయన ప్రసంగంలోని కొన్ని ముఖ్యాంశాలు ఇవీ...

అప్పుడు.. ఇవి చేశాను

"గతంలో నేను నెల్లూరు, తిరుపతి, చెన్నైలను అనుసంధానించి ఉమ్మడి నెల్లూరు జిల్లాను పారిశ్రామిక హబ్‌గా చేయాలనుకున్నాను. నెల్లూరు జిల్లా దగదర్తిలో విమానాశ్రయం, కృష్ణపట్నం పోర్టు ఏర్పాటు చేయడం ద్వారా జిల్లాను పారిశ్రామికంగా ఉన్నత స్థాయికి చేర్చాలని ప్రయత్నించాను. తిరుపతిలో ఎలక్ట్రానిక్ మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లు ఏర్పాటు చేశాను. దానివల్ల అక్కడ టీసీఎల్, జోహో, సెల్‌కాన్, కార్బన్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ కంపెనీలు అనేకం వచ్చాయి. తిరుపతి సహా తూర్పు ప్రాంతాన్ని ఆటోమొబైల్ హబ్ చేయడానికి చర్యలు తీసుకున్నా. ఫలితంగా అపోలో టైర్స్ వంటి ఆటోమొబైల్ సంబంధ పరిశ్రమలు చాలా ఏర్పాటయ్యాయి. ఏర్పేడు, వెంకటగిరి మధ్య ఐఐటీ, ఐసర్ వంటి అత్యున్నత జాతీయ విద్యా సంస్థలు ఏర్పాటు జరిగింది."

ఇప్పుడు ఇలా దోచేశారు

"ఈ ప్రాంత అభివృద్ధికి చేపట్టిన అనేక పనులు జగన్ ప్రభుత్వంలో ఆగిపోయాయి. అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి రూ. 399 కోట్లతో నేను పనులు మంజూరు చేస్తే కేవలం రూ. 19 కోట్లు ఖర్చు చేశాక పనులు ఆపేశారు. కండలేరు ప్రాజెక్టు పనులు ప్రస్తుత ప్రభుత్వం పూర్తి చేయకపోవడంతో దానిపై ఆధారపడిన తెలుగుగంగ ప్రాజెక్టు కూడా పూర్తి కాకుండా ఆగిపోయింది. గూడూరులో రూ. 4500 కోట్ల విలువైన సిలికా ఇసుకను ఇష్టానుసారంగా అమ్మేస్తున్నారు. ప్రభుత్వం నుంచీ లైసెన్సు పొందిన అసలైన లీజు హోల్డర్లను తరిమేశారు. క్వార్ట్జ్, బెరైటీస్, లేటరైట్, లైమ్ స్టోన్ వంటి మైన్లన్నీ అక్రమ మైనింగ్‌తో కొల్లగొట్టేశారు."



వైసీపీ నేతలపై బాబు పంచ్‌లు

ఈ ప్రాంత అభివృద్ధి కోసం, ప్రజల సమస్యల కోసం గళం విప్పిన ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డిని సీఎం జగన్ దూరంగా పెట్టారని ఆరోపించారు. ఈ సందర్భంగా ఉమ్మడి నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో అధికార పార్టీ ఎమ్మెల్యేల దోపిడీపై ధ్వజమెత్తారు.

1 సర్వేపల్లిలో మంత్రి కాకాణి కోర్టు దొంగ. గ్రావెల్ దోపిడీకి పాల్పడిన కాకాణికి ఇపుడు నెల్లూరు జిల్లాను కొనే శక్తి వచ్చేసింది.

1 సత్యవేడు ఎమ్మెల్యే ఒట్టి రబ్బర్ స్టాంపు. అతడి నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి పెత్తనం సాగుతోంది.

1 పెద్దిరెడ్డి మామూలు పుడింగి కాదు. రాష్ట్రంలోని మైన్లన్నింటినీ మింగేసి అరిగించుకోగల శక్తి ఆయనకు ఉంది.

1 గూడూరు ఎమ్మెల్యే వరప్రసాద్ మైన్లను ప్రసాదం తరహాలో మింగేశాడు. మామూళ్ళ వసూలు కోసం కొడుకును పెట్టాడు. ఆ రూ.4500 కోట్ల సిలికా దోపిడీలో ఎమ్మెల్యే వాటా ఎంతో చెప్పాలి.

1 వెంకటగిరికి కొత్త బిచ్చగాడు వచ్చాడు. ఆయన పెన్నా నదిలో ఇసుక దోపిడీకి పాల్పడుతున్నాడు. 150 ఎకరాల్లో సిలికా దోపిడీ చేశాడు. నియోజకవర్గంలో విపరీతంగా భూ కబ్జాలకు పాల్పడుతున్నాడు. పార్టీ ఇంచార్జిగానే ఇలా బరితెగించే ఆయన ఒకవేళ ఎమ్మెల్యే అయితే ఇంకేం చేస్తాడో ఊహించుకోండి.

1 సూళ్ళూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఇసుక, లిక్కర్, గంజాయి, క్రికెట్ బెట్టింగులు వంటి అక్రమ దందాలకు పాల్పడుతున్నారడు. సీఎం జగన్ విశాఖలో రిషికొండను బోడి చేసిన స్ఫూర్తితో శిరసనంబేడు కొండకు ఈయన గుండు కొట్టాడు.

1 శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు రెడ్డి అవినీతి చూస్తుంటే కళ్లు తిరుగుతున్నాయి. అక్కడ రూ. 2 వేల కోట్ల అవినీతి జరిగింది. రేణిగుంటను కూతురికి, ఏర్పేడును తమ్ముడికి రాసిచ్చేసి, శ్రీకాళహస్తిని తన సొంతానికి పెట్టుకున్నాడు. 1 తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి నాస్తికుడు. ఇపుడు దేవుడికే నామాలు పెడుతున్నాడు.



పైరవీల ధర్మారెడ్డి

తిరుమల ఈవో ధర్మారెడ్డిపై కూడా చంద్రబాబు పరోక్ష విమర్శలు చేశారు. శ్రీవారిని అడ్డం పెట్టుకుని పైరవీలతో కేసులు లేకుండా చేసే బాధ్యతను జగన్ ఆ అధికారికి అప్పగించారని ఆరోపించారు. సర్వీసులో ఒక్కసారైనా టీటీడీ ఈవో కావాలని కలలు కనే సీనియర్ ఐఏఎస్‌లకు కూడా ఇవ్వకుండా జగన్ తన కేసుల కోసమే ఆ అధికారిని ఈవోగా నియమించారన్నారు.

గూడూరు, వెంకటగిరికి వరాలు

అధికారంలోకి వచ్చాక గూడూరును తిరిగి నెల్లూరు జిల్లాలో విలీనం చేస్తా. ప్రతి చేనేత కుటుంబానికీ ఇపుడు వైసీపీ ప్రభుత్వం ఇస్తున్న దానికంటే ఎక్కువ సాయం అందిస్తా. ఆక్వా రైతులకు యూనిట్ ఒకటిన్నర రూపాయి చొప్పున సబ్సిడీ విద్యుత్ అందిస్తా. డక్కిలి మండలంలో ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణాన్ని, అలాగే కండలేరు రిజర్వాయరు పెండింగ్ పనులను, తెలుగు గంగ ప్రాజెక్టు పెండింగు పనులను పూర్తి చేస్తాం. వెంకటగిరిలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్‌లూమ్ టెక్నాలజీకి అనుబంధంగా స్కిల్ డెవలప్‌మెంట్ కాలేజీ ఏర్పాటు చేస్తా. స్వర్ణముఖి నదిపై చెక్‌డ్యాములు, వెంకటగిరి-నాయుడుపేట మార్గంలో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మిస్తా.

సభలో ప్రముఖులు : చంద్రబాబు సభలో కేంద్ర మాజీ మంత్రి పనబాక లక్ష్మి, రాష్ట్ర మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి, తిరుపతి పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు నరసింహ యాదవ్, బీసీ నాయకుడు మస్తాన్ యాదవ్,వెంకటగిరి ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి, నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు రాంగోపాల్ రెడ్డి, కంచర్ల శ్రీకాంత్, మాజీ ఎమ్మెల్యేలు కురుగొండ్ల రామకృష్ణ, సునీల్ కుమార్, నెలవల సుబ్రమణ్యం, సుగుణమ్మ, కంభం విజయరామిరెడ్డి, టీడీపీ ఇంచార్జులు గాలి భానుప్రకాష్, బొజ్జల సుధీర్‌రెడ్డి, జనసేన నెల్లూరు, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు మధుక్రాంత రెడ్డి, పసుపులేటి హరిప్రసాద్, వెంకటగిరి జనసేన నాయకులు తోట కృష్ణయ్య, గూడూరు వెంకటేశ్వర్లు, టీడీపీ మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, వూకా విజయకుమార్, వెంపటి మాధవుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

నకిలీల మాటేమిటి!?

- ఓట్ల తొలగింపునకు అధికార పార్టీ నేతల కుట్ర
- బతికి ఉన్నా లేనట్టుగా ఫారం-7 దరఖాస్తులు
- ఏఎస్‌పేట, చేజర్లలో వైసీపీ బీఎల్‌ఏలపై కేసుల నమోదు
- తిరస్కరణ దరఖాస్తులు ఎవరు ఇచ్చినట్లు?
- కఠినంగా వ్యవహరించడంలో యంత్రాంగం విఫలం

ఓట్ల తొలగింపు, దొంగ ఓట్ల చేరిక రాష్ట్రవ్యాప్తంగా కలకలం రేపుతోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణం లో కేంద్ర ఎన్నికల సంఘం రంగంలోకి దిగింది. ఇప్పటివరకు అనేక ఆరోపణలు వచ్చినా, ఆధారాలు బయటపడినా అధికారులు పెద్దగా పట్టించుకోలేదు. గతేడాది ఎమ్మెల్సీ ఎన్నికల సమయంలో దొంగ ఓట్ల కలకలం రేపినా స్పందించలేదు. కానీ ఇటీవల కేంద్ర ఎన్నికల సంఘం సదరు అధికారులపైనే చర్యలకు ఉపక్రమించడంతో పరిస్థితి వేడెక్కింది. జిల్లాలోనూ ప్రతిపక్ష పార్టీల సానుభూతి పరుల ఓట్లను తొలగించేందుకు భారీ కుట్రలే జరిగినట్లు జరుగుతున్న పరిణామాలనుబట్టి అర్థమవుతోంది. చేజర్ల, ఏఎస్‌పేట మండలాల్లో నమోదైన కేసులే ఇందుకు నిదర్శనం. అయితే అధికార పార్టీ నేతలకు భయపడి చర్యలు తీసుకునేందుకు వెనుకాడుతున్న అధికారులు, ఎన్నికల సంఘం దెబ్బకు తూతూమంత్రంగా ఈ రెండు చోట్ల కేసులు పెట్టారని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. గతేడాది ఏప్రిల్ నుంచి రెండు లక్షలకుపైగా ఫారం-7 దరఖాస్తులు అందాయి. వాటిని పరిశీలించి 1.68 లక్షల ఓట్లను తొలగించారు. అదే సమయం లో 32 వేలకుపైగా దరఖాస్తులను తిరస్కరించారు. అంటే వీరంతా బతికి ఉండటమో లేదా గ్రామంలోనే నివాసం ఉండడమో జరిగింది. అటువంటప్పుడు ఇన్ని వేల దరఖాస్తులను చేసిందెవరన్న ప్రశ్న ఇప్పుడు ఉత్పన్నమవుతోంది. ఇలా దరఖాస్తు చేసిన వారిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రతిపక్షాలు ప్రశ్నిస్తున్నాయి. అదే సమయంలో ఆమోదించిన ఫారం-7 దరఖాస్తులపైనా ప్రతిపక్షాలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. 2022, జనవరి నుంచి 2023, ఏప్రిల్ 14 వరకు భారీగా ఓట్లను జిల్లాలో తొలగించారు. ఆ తర్వాతి నుంచి ఇప్పటి వరకు కూడా అదే రీతిలో ఓట్లను తొలగించడంతో అనుమానాలకు బలం చేకూరుస్తోంది. ఇంటింటి సర్వేలో భారీగా ఫారం-7 దరఖాస్తులు వచ్చాయి. వాటిని పరిష్కరించకుండానే ఎస్ఎస్ఆర్- 2023ను ప్రారంభించారు. దీంతో నాడు వచ్చిన దరఖాస్తులను సరిచూసుకునే అవకాశం ప్రతిపక్షాలకు లేకుండా పోయిం ది. ఈ నెల 5వ తేదీన తుది ఓటర్ల ముసా యిదాను ప్రచురించి ఉంటే ఈ పాటికి దానిని పరిశీలించుకునే సమయం ప్రతిప క్షాలకు లభించి ఉండేది. కానీ ముసాయి దాను ఈ నెల 22న ప్రచురించనున్నారు. ఆ తర్వాత గ్రామాలు, వార్డుల వారీగా ఓటర్ల జాబితాను పరిశీలిస్తే ఎన్ని చిత్ర విచిత్రాలు బయటపడ తాయో తెలుస్తుంది. - నెల్లూరు (ఆంధ్రజ్యోతి)

- చేజర్ల మండలం ఉలవపల్లిలో 75 ఓట్లు తొలగించాలని షేక్ కాలేషా అనే ప్రభుత్వ అధ్యాపకుడి ఐడీతో ఎన్నికల సంఘానికి గతేడాది డిసెంబరు 26వ తేదీన ఫారం-7 దరఖాస్తులు అందాయి. దీనిపై ఆత్మకూరు ఆర్డీవో ఆ గ్రామంలో విచారించగా ఆ దరఖాస్తులన్నీ నకిలీవని నిర్ధారించారు. ఉద్దేశపూర్వకంగా ఓట్ల తొలగింపునకు దరఖాస్తు చేశారని షేక్ కాలేషాను విచారించారు. అయితే వైసీపీ బూత్ లెవల్ ఏజెంట్ పట్టెం శ్రీనివాసులు తన పేరు మీద ఫారం-7 దరఖాస్తులు చేశారని కాలేషా తెలియజేశారు. దీంతో అతడిపై తహసీల్దార్ కృష్ణ ఈ నెల 8వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.
- అనుసముద్రంపేట మండలం శ్రీకొలను గ్రామంలో వైసీపీకి చెందిన బూత్ లెవల్ ఏజెంట్ కాకి ప్రసాద్‌రెడ్డి 101 ఫారం-7 దరఖాస్తులను ఈ నెల 8వ తేదీన ఎన్నికల సంఘం పోర్టల్‌లో అందజేశారు. 35 మంది ఇతర ప్రాంతాలకు వెళ్లిపోయారని, మరో 66 మంది చనిపోయారని ఆ దరఖాస్తుల్లో పేర్కొన్నారు. దీనిపై అదే రోజు తహసీల్దార్ విచారణ జరపగా ఆ దరఖాస్తులు ఫేక్ అని, ఉద్దేశ పూర్వకంగా పెట్టారని నిర్ధారించారు. దీంతో ఈ నెల 8వ తేదీన ప్రసాద్‌రెడ్డిపై తహసీల్దార్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

ఫారం-7 దరఖాస్తుల వివరాలు.. వచ్చిన దరఖాస్తులు : 2,01,732 తొలగించిన ఓట్లు : 1,68,859 తొలగించని ఓట్లు : 32,197 పెండింగ్‌లో ఉన్నవి : 676

జిల్లాలో పలువురు ఎస్‌ఐల బదిలీ

నెల్లూరు (క్రైం), జనవరి 19 : జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పేరు	ప్రస్తుతం	బదిలీ
కె ప్రతాప్‌రెడ్డి	గుడ్లూరు	ఏఎస్‌పేట
పి నరేష్	ఏఎస్‌పేట	కందుకూరు రూరల్
కె తిరుపతయ్య	కందుకూరు రూరల్	వరికుంటపాడు
కె సుమన్	వరికుంటపాడు	వీఆర్ నెల్లూరు
బి లక్ష్మణరావు	నెల్లూరు రూరల్	గుడ్లూరు
కె కిషోర్‌బాబు	వీఆర్ నెల్లూరు	కండలేరు
ఎమ్ సూర్యప్రకాష్‌రెడ్డి	వీఆర్ నెల్లూరు	అనంతసాగరం
పి విజయ శ్రీనివాస్	వీఆర్ నెల్లూరు	బాలాజీనగర్ (నెల్లూరు)
ఎ శ్రీనివాసులరెడ్డి	వీఆర్ నెల్లూరు	ముత్తుకూరు
ఎ శివకృష్ణారెడ్డి	ముత్తుకూరు	డిఎస్‌బి
ఎస్ సుమన్	కావలి రూరల్	నవాబుపేట (నెల్లూరు)
కె మరిడినాయుడు	వీఆర్ నెల్లూరు	దగదర్తి
డిఎస్ విజయకుమార్	దగదర్తి	వీఆర్ నెల్లూరు

అంబేడ్కర్ పేరుతో ముఖ్యమంత్రి జగన్ మోసం

అంగన్వాడీల ఆగ్రహం



కావలిటౌన్ : అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు



ఆత్మకూరు: అంబేడ్కర్ చిత్రపటం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీలు

కావలిటౌన్, జనవరి 19: అంబేడ్కర్ ఆశయసాధనంటూ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అబద్దాలాడుతున్నారని అంగన్వాడీలు ధ్వజమెత్తారు. సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేస్తున్న సమ్మె శుక్రవారం 39వ రోజుకు చేరింది. ట్రంకురోడ్డులోని బ్రిడ్జి కూడలిలో అంబేడ్కర్ విగ్రహానికి అంగన్వాడీలు పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం నిరసన తెలిపారు. యూనియన్ నేతలు రఘురావమ్మ, రమాదేవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి అంగన్వాడీలకు ఇచ్చిన హామీలు అమలు చేయమని 5ఏళ్లు అడిగామని, పెడ చెవిన పెట్టడం వల్లే రోడ్డెక్కాల్సి వచ్చిందన్నారు. హామీలు అమలు చేయమని సమ్మె చేయడం నేరమైనట్లు ఎస్మా ప్రయోగించి బెదిరించడం ఎంతవరకు సమంజసమన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు పసుపులేటి పెంచలయ్య, కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరు: సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. శుక్రవారం వారు విధులను బహిష్కరించి ఆత్మకూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో బైఠాయించి సమ్మెను కొనసాగించారు. ప్రభుత్వ మొండి వైఖరిని అంబేద్కర్ చిత్రపటం వద్ద నివేదిస్తూ నిరసన తెలిపారు. మీరికి మద్దతుగా సీఐటీయు నాయకులు శిబిరానికి విచ్చేసి సంఘీభావం ప్రకటించారు. తమ సమస్యలను పరిష్కరించే వరకు సమ్మెను కొనసాగిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కమిటీ ప్రధాన కార్యదర్శి పి రాధ, పలువురు సెక్టార్ లీడర్లు కె రమణమ్మ, కామేశ్వరి, జమీల, విజయలక్ష్మీ, రూతమ్మ, విజయలక్ష్మీ, శ్రీదేవి, ఏ మస్తానమ్మ, పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేత మృతికి సంతాపం



కుటుంబ సభ్యులకు నగదు అందజేస్తున్న మన్నేటి వెంకటరెడ్డి

ఉదయగిరి రూరల్, జనవరి 19: మండలంలోని జీ.చెరువుపల్లి గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు అనంతరాజు శ్రీనివాసరాజు శుక్రవారం అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మాజీ ఏఎంసీ చైర్మన్, మన ఫౌండేషన్ అధినేత మన్నేటి వెంకటరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న, టీడీపీ నాయకులు శ్రీనివాసరాజు మృతదేహాన్ని సందర్శించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకటరామారావు రూ.10 వేలు, మన్నేటి వెంకటరెడ్డి రూ.15 వేలు మట్టి ఖర్చుల కింద కుటుంబ సభ్యులకు నగదు అందజేశారు. పరామర్శించిన వారిలో మాజీ సర్పంచ్ కప్పా శ్రీనివాసులు, టీడీపీ నాయకులు రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, మాబాషా తదితరులున్నారు.

బైపాస్ మీదుగా బస్సు సర్వీసులు

ఉదయగిరి రూరల్, జనవరి 19: ఉదయగిరి ఆర్టీసీ డిపో నుంచి నెల్లూరు సెక్టార్‌లో తిరిగే పలు బస్సు సర్వీసులను సంగం ఊర్లోకి వెళ్లకుండా బైపాస్ మీదుగా నడుపుతున్నట్లు డిపో మేనేజర్ శ్రీనివాసరావు శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల జరిగిన డయల్ యువర్ డీఎం కార్యక్రమంలో ప్రయాణికుల విజ్ఞప్తి మేరకు ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. ఈనెల 22వ తేదీ నుంచి ఉదయగిరి నుంచి నెల్లూరు వెళ్లే బస్సులు, నెల్లూరు నుంచి ఉదయగిరికి వచ్చే బస్సులు సంగం బైపాస్ మీదుగా వస్తాయని, ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణకు తరలిన అధికారులు



విజయవాడకు వెళ్తున్న అధికారులు, నాయకులు

వరికుంటపాడు, జనవరి 19: విజయవాడలో భారత రాజ్యాంగ నిర్మాత డా. బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ నేపథ్యంలో శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణం నుంచి ప్రత్యేక బస్సును ఎంపీడీవో శ్రీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాటాడుతూ ప్రభుత్వం ప్రత్యేకంగా కేటాయించిన బస్సులో రాజకీయ నాయకులు, బడుగు, బలహీన వర్గాల ప్రజలు స్వచ్ఛందంగా విజయవాడకు తరలి వెళ్లడం అభినందనీయని అన్నారు. కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ మందలపు తిరుపతినాయుడు, దాసరి యర్రఓబయ్య, మాగుంటి సిద్ధయ్య పాల్గొన్నారు.

పోస్టల్ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న బీపీఎం శ్రీలత

వరికుంటపాడు, జనవరి 19: తపాలా శాఖ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి బీపీఎం శ్రీలత అన్నారు. శుక్రవారం సర్పంచ్ దిలీప్‌కుమార్ ఆధ్వర్యంలో ఆమె కనియంపాడులోని ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రధానంగా బాలికల కోసం అమలులో ఉన్న సుకన్య సమృద్ధి యోజన పథకం పేద వర్గాలకు ఓ వరంగా ఉంటుందన్నారు. అలాగే అధికశాతం వడ్డీలు చెల్లించే పథకాలు సైతం అమలులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఏబీపీఎం మనీషా తదితరులు పాల్గొన్నారు.

కులగణన సర్వేకు ప్రజలు సహకరించాలి



వరికుంటపాడు: సర్వేను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి

ఆత్మకూరు, జనవరి 19: రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలో కులగణన సర్వే శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా వలంటీర్లు, సచివాలయ సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి కుటుంబ వివరాలు సేకరించారు. సర్వే నిమిత్తం వచ్చేవారికి ప్రజలు సహకరించాలని కమిషనర్ బి నాగేశ్వరరావు కోరారు. మండలంలోని 11 గ్రామ సచివాలయాల పరిధిలోని 171 క్లస్టర్‌లలో కులగణన ప్రారంభమైనట్లు ఎంపీడీవో పి ఐజాక్‌ప్రవీణ్ తెలిపారు.

ఉదయగిరి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం కులగణన సర్వే ప్రారంభమైంది. సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ తిరిగి కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారు. కాగా, మండలంలోని నేలటూరు, గన్నేపల్లి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను ఈవోపీఆర్డీ మల్లికార్జున తనిఖీ చేసి సిబ్బందికి సూచనలు ఇచ్చారు.

వరికుంటపాడు: కులగణన సర్వే సమగ్రంగా చేపట్టి వేగవంతంగా పూర్తిచేయాలని మండల ప్రత్యేకాధికారి తిరుపాల్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండలంలోని వరికుంటపాడు, జడదేవి గ్రామాల్లో జరుగుతున్న సర్వేను పరిశీలించారు. 28వ తేదీలోపు ప్రతి నివాసానికి వెళ్లి సేకరించిన నివేదికలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రజలు ఎలాంటి అపోహలకు గురికాకుండా సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీదేవి, ఈవోపీఆర్డీ సికిందర్ తదితరులు పాల్గొన్నారు.

వింజమూరు: వింజమూరు పట్టణంలోని 1, 2 సచివాలయాల్లో కులగణన సర్వేను సర్పంచ్ నల్లగొండ్ల సృజన శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ వీఆర్‌వోలు శ్రీనివాసులరెడ్డి, నాగిరెడ్డి, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

సర్వేలో సిబ్బంది అవస్థలు

సీతారామపురం: వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఆధ్వర్యంలో మండల వ్యాప్తంగా శుక్రవారం ఉదయం నుండి కులగణన సర్వే ప్రారంభమైంది. కాగా, ప్రజల వివరాలను వారు సేకరిస్తుండగా సర్వర్ పనిచేయడం లేదని, ఒక్కో వ్యక్తి వద్ద వివరాల నమోదుకు అరగంటకు పైగా సమయం పడుతోందని వాలంటీర్లు వాపోతున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కూడా మండలంలోని చాలామంది వాలంటీర్లు కనీసం ఒక ఇంటిని కూడా సర్వే పూర్తిచేయలేకపోయారు. సర్వర్ పనిచేయకపోవడంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో పాటు ప్రజలు సైతం అసహనానికి గురయ్యారు.

చేజర్ల: కులగణన సర్వేలో సర్వర్ మొరాయిస్తుండడంతో సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు కేవలం రెండు మూడు మాత్రమే సర్వే అవుతుండడంతో తీవ్ర అసహనానికి గురవుతున్నారు.

అందరి సంక్షేమం కేంద్ర ప్రభుత్వం లక్ష్యం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న అధికారులు, బిజేపీ నేతలు

ఆత్మకూరు, జనవరి 19 : ప్రజలందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు అందించడమే లక్ష్యమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కర్నాటి ఆంజనేయరెడ్డి తెలిపారు. శుక్రవారం ఆత్మకూరు పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఉజ్వల గ్యాస్ సిలిండర్లు, ఆయుష్మాన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ కుడుముల సుధాకర్‌రెడ్డి, పట్టణ అధ్యక్షుడు కరటంపాటి సుధాకర్‌రెడ్డి, నియోజకవర్గ కన్వీనర్ కంది మల్లికార్జునరెడ్డి, స్పార్క్ గ్యాస్ ఏజన్సీ నిర్వాహకుడు నజీర్‌బాష, పలు శాఖల అధికారులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ఏఎస్ పేట దర్గా హుండీల లెక్కింపు



హుండీల లెక్కింపును పరిశీలిస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు

ఏఎస్ పేట, జనవరి 19: స్థానిక హజరత్ సయ్యద్ ఖాజా రహమ తుల్లా నాయబ్ రసూల్ దర్గాను వక్ఫ్ బోర్డు అధికారులు స్వాధీనం చేసుకొని సుమారు 11 నెలల తరువాత శుక్రవారం ఉదయం వక్ఫ్ బోర్డు, రెవిన్యూ అధికారుల సమక్షంలో దర్గా ఈవో హుసేన్ ఆధ్వర్యంలో హుండీల లెక్కింపు ప్రారంభించారు. దర్గాలో మొత్తం 17 హుండీలు ఉండగా సాయంత్రం వరకు సుమారు 12లక్షల 22వేల రూపాయలు వచ్చాయని దర్గా ఈవో హుసేన్ తెలిపారు. రెండు, మూడు రోజుల పాటు హుండీల లెక్కింపు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు. హుండీలు మొత్తం లెక్కించిన తరువాత పంచనామా నిర్వహించి నగదును దర్గా ఖాతాలో జమ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో దర్గా సెకండ్ ఈవో షరీఫ్, స్టేట్ సూపరింటెండెంట్‌లు షేక్ ఇబ్రహీం, షేక్ గౌస్ మహిముద్దీన్, వక్ఫ్ బోర్డు ఇన్‌స్పెక్టర్లు ఖుదావన్, అహ్మద్ బాషా, తహశీల్దారు లక్ష్మీనరసింహ, ఆర్ఐ రవితేజ పాల్గొన్నారు.

మారంరెడ్డిపల్లిలో జగనన్న సురక్ష

సీతారామపురం, జనవరి 19: మండలంలోని మారంరెడ్డిపల్లి సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష రెండో విడత కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్వో సుధాకర్‌రావు, ఇన్‌చార్జి ఎంపీడీవో భార్గవి, డాక్టర్ స్వప్న, ఏఎన్ఎంలు, ఆశవర్కర్లు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల సంక్షేమానికి టీడీపీ పెద్దపీట



ఇంటింటికి తిరిగి సమస్యలు తెలుసుకుంటున్న బొల్లినేని

వింజమూరు, జనవరి 19: టీడీపీ అధికారంలోకి వస్తే ముస్లింల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని మాజీ ఎమ్మెల్యే టీడీపీ ఇన్‌చార్జి బొల్లినేని వెంకటరామారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని గంగమిట్టలో బాబు షూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ ప్రజాదీవెన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బొల్లినేని మాట్లా డుతూ ముస్లింల ఆప్యాయత మరువలేనని, వారితో నాకున్న అనుబంధం ఎనలేనిదన్నారు. ఇంటింటికీ తిరిగి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే అన్ని సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి జగన్మో హన్‌రెడ్డి అన్ని వర్గాల వారిని మోసం చేశాడన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలు అమలు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్య క్షుడు గొంగటి రఘునాథ రెడ్డి, మాజీ వీఎంసీ చైర్మన్ గంతులూరు వెంకటేశ్వరరావు, చల్లా వెంకటేశ్వర్లు, గురజాల వెంకటరమణయ్య, కొండ పల్లి వెంకటేశ్వర్లు, మహబూబ్ బాషా, ఎమ్మెస్ నాయుడు, చావా మహేష్, వేములపాటి మాల్యాద్రి, చల్లా శ్రీను, గణపవరం సుదర్శన్‌రెడ్డి, గూడా నర్సారెడ్డి, తిరుపతి ఆచారి పాల్గొన్నారు.

ఏడీఏ కార్యాలయం మార్పు

కందుకూరు: కందుకూరు సబ్ డివిజన్ వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని ప్రస్తుతం ఉన్న భవనం నుంచి ఇటీవలి వరకు అర్బన్ హెల్త్ సెంటర్ నిర్వహించిన భవనంలోకి మార్చినట్లు ఏడీఏ వి.అనసూయ ఓ ప్రకటనలో తెలిపారు. సబ్ డివిజన్ పరిధిలోని రైతులు ఈ మార్పును గమనించాలని కోరారు.

తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం

● ఇంటూరి ● ఏలూరుపాడులో పలువురు టీడీపీలో చేరిక



గుడ్లూరు : ఏలూరుపాడులో టీడీపీలో చేరిన వారితో ఇంటూరి

గుడ్లూరు, జనవరి 19 : తెలుగుదేశం పార్టీతోనే అభివృద్ధి సాధ్యం అని ఆపార్టీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం మండలంలోని ఏలూరుపాడులో వైసీపీకి చెందిన 27 కుటుంబాల వారు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వారిని నాగేశ్వరరావు సాదరంగా ఆహ్వానించి పసుపుకండువాలు వేశారు. పార్టీలో చేరిన పొనుగోటి బ్రహ్మయ్య, శివకుమార్, ధన్యాసి మురళి, స్వర్ణ బ్రహ్మయ్య, బొజ్జా ఏసురత్నం, పోనుగోటి చెన్నమ్మ, గంటా రమణయ్య, బొల్లేపల్లి శ్రీవాణి, చౌటూరి అగ్గియ్య, యద్దల మాలకొండయ్య, స్వర్ణ మాల్యాద్రి, యద్దల వెంకటరమణయ్య, బొజ్జా మస్తాన్, తదితరులు మాట్లాడారు. వైసీపీ సాగిస్తున్న అరాచక పాలనను చూస్తూ ఉండలేక అనేక మంది పార్టీని వీడుతున్నట్లు చెప్పారు. రాష్ట్రం అభివృద్ధి చంద్రబాబుతోని సాధ్యమని గ్రహించి టీడీపీలో చేరుతున్నామన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ విజయానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు జనిగర్ల నాగరాజు, నిమ్మకాయల రమణయ్య, గద్దగుంట శ్రీనివాసులు, పొట్టేళ్ల మురళి, పోలుగంగు కృష్ణ, ఎస్‌కే రఫి, ఎర్రంశెట్టి వెంకటేశ్వర్లు, ఆవుల శ్రీనివాసులు, పర్రే రామారావు, చిత్తారి మల్లికార్జున, గద్దగుంట మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలి

కందుకూరు : రానున్న ఎన్నికల్లో ప్రతి టీడీపీ కార్యకర్త అంకితభావంతో పని చేసి సోషల్ మీడియా ద్వారా ప్రభుత్వ వైఫల్యాలను విస్తృతంగా ప్రచారం చేయాలని టీడీపీ కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో సోషల్ మీడియాలో విస్తృత ప్రచారం చేసి టాస్కులు పూర్తి చేసిన 11 మందికి సైకిల్ నమూనా, 10 మంది కార్యకర్తలకు పార్టీ జెండా నమూనా జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీలో కష్టపడిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు ఉంటుందనేందుకు ప్రోత్సాహక బహుమతులు పొందినవారే ఉదాహరణ అన్నారు. కార్యక్రమంలో ఐటీడీపీ పట్టణ అధ్యక్షుడు వలేటి వెంకటేశ్వరరావు, నాయకులు ఉమ్మినేని సుబ్బారావు, మోతుకూరి పర్వతాలు, మచ్చా మనోహర్, పాలుబోయిన వెంకటశివకృష్ణ, నాదెండ్ల మధు, ముళ్లపాటి మహేష్, దివి హరిబాబు, భవనాసి వెంకటేశ్వర్లు, గోచిపాతల మోషే, తదితరులు పాల్గొన్నారు.

జగన్ జిమ్మిక్కులకు దళితులు మోసపోరు



మాట్లాడుతున్న టీడీపీ ఎస్సీ సెల్ నేతలు

కావలి, జనవరి 19 : ఎన్నికల సమయంలో దళిత, గిరిజనులను ఆకట్టుకునేందుకు సీఎం జగన్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా దళిత, గిరిజనులు మోసపోరని టీడీపీ ఎస్సీసెల్ నేతలు పేర్కొన్నారు. కావలి టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం పెట్టడం మంచిదే అన్నారు. అయితే దళిత, గిరిజనుల 27 సంక్షేమ పథకాలను రద్దు చేసి 125 అడుగుల కిందకు తొక్కడం న్యాయమా అని ప్రశ్నించారు. రూ.50 వేల కోట్ల ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించడం దారుణ మన్నారు. వైసీపీ ప్రభుత్వంలో ఎంతో మంది దళిత, గిరిజనులు హత్యగావించబడ్డారని, అక్రమ కేసులతో వేధించబడ్డారన్నారు. ఇంతగా దళిత, గిరిజనులను అణిచి వేసి అంబేడ్కర్ విగ్రహాన్ని అడ్డం పెట్టుకుని వారి ఓట్లను పొందడానికి జగన్ ప్రయత్నించడం దళిత,గిరిజనులను మోసగించటమేనన్నారు. ఎన్ని జిమ్మిక్కులు చేసినా వచ్చే ఎన్నికలలో వైసీపీకి తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ సెల్ నాయకులు జ్యోతి బాబూరావు, దావులూరి దేవకుమార్, అక్కిలిగుంట సూర్య ప్రకాష్, ఆత్మకూరు నాగరాజు, బాలఅంకయ్య, ఇనగంటి అనిల్ బాబు, మోడేగుంట శ్రీనివాసులు, పోట్లూరు శ్రీనివాసులు, సునీల్, వేణు తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహంతో దళితులకు చేసిన ద్రోహం చెరిగిపోదు

ఉలవపాడు : రాష్ట్రంలో దళితులపై దమనకాండ సాగించి దళితుల ఆరాధ్యుడు అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరించి ఆర్భాటం చేసినంత మాత్రానా దళితులు వైసీపీ ప్రభుత్వాన్ని, జగన్ చేసిన ద్రోహాన్ని ఎన్నటికి మర్చిపోరని టీడీపీ మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు రావినూతల రమేష్, తెలుగు యువత మండల అధ్యక్షుడు, దళిత నాయకుడు తొట్టెంపూడి మాల్యాద్రి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు వేల కోట్లు పక్కదారి పట్టించి దళితులను ఆర్థికంగా అనగదొక్కి, మానప్రాణాలను బలికొని తీరా ఎన్నికలు సమీపించే సరికి అంబేడ్కర్ విగ్రహం పేరుతో హడావుడి చేయడం దళితులను బుజ్జగించడమేనని పేర్కొన్నారు.

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ



బాధితురాలిని విచారిస్తున్న డీఎస్పీ రామచంద్ర

ఉలవపాడు, జనవరి 19 : దళిత మహిళపై అగ్రకులానికి చెందిన తల్లీకొడుకు కులం పేరుతో దూషించి దాడి చేశారని అందిన ఫిర్యాదుపై శుక్రవారం కందుకూరు డీఎస్పీ రామచంద్ర విచారణ చేపట్టారు. గతనెల 26వ తేదీన ఉలవపాడు హైస్కూల్ సంఘంకు చెందిన మైపాటి భారతి, పాలకీర్తి ఉషలు తప్పిపోయిన గేదె కోసం వెతుకుంటూ అదే గ్రామానికి చెందిన పెద్దినేని రాణిమ్మ పొలం వద్దకు వెళ్లారు. కట్టేసిన గేదెను చూసి అది తమదని చెప్పడంతో వారిమధ్య వాగ్వివాదం జరిగి చివరికి ఘర్షణకు దారితీసింది. అక్కడే ఉన్న రాణిమ్మ కుమారుడు వంశీకృష్ణ కర్రతో భారతి తలపై కొట్టడంతో గాయం అయింది. దీనిపై దాడి, కులదూషణపై కేసు నమోదు కావడంతో డీఎస్పీ, కందుకూరు సీఐ నఫీస్‌బాషా, ఎస్సై బాజీరెడ్డిలు బాధితురాలితోపాటు సాక్షులను విచారించి వివరాలు నమోదు చేసుకున్నారు.

చెడుగుడు పోటీల్లో విజేతలకు బహుమతుల పంపిణీ

బిట్రగుంట, జనవరి 19: బోగోలు పంచాయతీ కుమ్మరవీధిలో యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాల్లో భాగంగా నిర్వహించిన జిల్లాస్థాయి పురుషులు, మహిళల చెడుగుడు పోటీలు గురువారం అర్ధరాత్రి ముగిశాయి. ఈ పోటీల్లో అల్లూరుకు చెందిన మహిళా జట్టు విన్నర్స్‌గా నిలవగా రూ.5 వేల, రన్నరుగా నిలిచిన నెల్లూరు డీకేడబ్ల్యూ జట్టుకు రూ.4వేల బహుమతులను కావలి ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి అందజేశారు. పురుషుల విభాగంలో విన్నర్‌గా నిలిచిన విడవలూరు జట్టుకు రూ.20 వేలు, రన్నరుగా నిలిచిన అల్లూరు జట్టుకు రూ.15 వేల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆప్కాబ్ చైర్మన్ అనిల్‌బాబు, నాయకులు వీరరఘు, శ్రీనివాసులు, నిర్వాహకులు బీ.ప్రభాకర్, స్టాన్లీ, కిరణ్‌కుమార్, శ్యామ్ సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

బకాయిలు చెల్లించాలని యూటీఎఫ్ నిరసన



కావలిలో ప్రదర్శన నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కావలిటౌన్, జనవరి 19: ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలు వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు శుక్రవారం ట్రంకురోడ్డులో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి టీ మాధవరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యురాలు శ్రీదేవి మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయులకు వివిధ రూపాల్లో చెల్లించాల్సిన రూ.18వేల కోట్లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రతినెలా ఒకటవ తేదీ జీతాలు చెల్లించాలని, పీఆర్సీ, డీఏ, పీఎఫ్ లోన్లు, ఏపీజీఐ తదితర పెండింగ్ బకాయిలు చెల్లించాలని కోరారు. ఆర్డీవో కార్యాలయం నుంచి ఐదు లాంతర్ల సెంటర్ వరకు నిర్వహించిన ర్యాలీలో అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ జిల్లా కార్యదర్శి పీ మాధవ, ముజీబ్ అహ్మద్, వేణుగోపాల్, తోట వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, దుర్గాప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం శ్మశానంలో వాటర్ ట్యాంక్ నిర్మాణానికి ఏర్పాట్లు

ఉలవపాడు, జనవరి 19 : మండలంలోని కరేడులోని ముస్లిం శ్మశాన వాటికలో ఓవర్ హెడ్ వాటర్ ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టారు. అందులో భాగంగా అక్కడ చదును చేయించారు. దీనిపై ముస్లింలు మండల ముస్లిం మైనారిటీ కమిటీ అధ్యక్షుడితో కలసి శుక్రవారం ఎంపీడీవో ఎన్.విజయకు పంచాయతీ కార్యదర్శిపై ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ ఇప్పటికే కందుకూరు సబ్ కలెక్టర్, స్థానిక తహసీల్దారులకు వినతిపత్రాలు ఇచ్చామని, జిల్లా ముస్లి మైనారిటీ సంఘం నాయకులకు ఫిర్యాదు చేశామని చెప్పారు.

వినికిడి పరికరాల పంపిణీ



వినికిడి పరికరాలు పంపిణీ చేస్తున్న నళినీదేవి

వలేటివారిపాలెం, జనవరి 19 : వలేటివారిపాలెం పాత పంచాయతీ కార్యాలయంలో వినికిడి లోపం కలిగిన లబ్ధిదారులకు రామయ్య ఫౌండేషన్ ట్రస్ట్ అధ్యక్షురాలు ఉన్నం నళినీదేవి శుక్రవారం వినికిడి పరికరాలను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ వినికిడి లోపం ఉన్న ఎంతో మంది పేదలు వినికిడి పరికరాలు కొనుగోలు చేయలేక ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి పరికరాలు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని వినికిడి లోపం ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నేటి నుంచి మంచినీటి సరఫరా బంద్

కావలి, జనవరి 19: కావలి పట్టణం ఉదయగిరి రోడ్డులోని ఐడీఎస్ఎంటీ దగ్గర సమ్మర్‌స్టోరేజ్ ట్యాంకు నుంచి కావలికి మంచి నీరు సరఫరా అయ్యే ప్రధానపైపులైన్ మరమ్మతులకు గురైందని కావలి మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. దీని మరమ్మతుల కోసం ఈ నెల 21, 22, 23 తేదీలలో మూడు రోజుల పాటు పట్టణంలో నీటి సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టిన అనంతరం నీటి సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు. నీటి సరఫరాలో జరుగుతున్న అంతరాయానికి కావలి ప్రజలు సహకరించాలని ఆయన పేర్కొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు అందజేత



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

వలేటివారిపాలెం, జనవరి 19 : మండలంలోని పోలినేనిపాలెంలో సంక్రాంతి సంబరాలలో భాగంగా ఎండ్లూరి ఆంజనేయులు ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు శుక్రవారం ఎండ్లూరి హనుమంతరావు, గాజులపర్తి మాల్యాద్రిలు బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కూనిపాలెం క్రికెట్ జట్టుకు, రెండవ బహుమతి పోలినేనిపాలెం జట్టుకు దక్కింది. ఈ పోటీలలో 30 టీమ్‌లు పాల్గొన్నాయి.

కులవృత్తులను గౌరవించండి

కలిగిరి, జనవరి 19: తమ కులవృత్తితో జీవనం సాగిస్తుంటే ఇతర సామాజిక వర్గానికి చెందిన వారు తమకు పోటీగా పట్టణంలో సెలూన్ షాపులు నిర్వహించడం సమంజసం కాదని పట్టణంలోని నాయిబ్రాహ్మణులు పేర్కొన్నారు. తాము కలిగిరి పట్టణంలో గత 30 ఏళ్లకు పైగా చిన్న చిన్న దుకాణాలు పెట్టుకొని కులవృత్తిని నమ్ముకొని స్థానికులకు క్షవరం చేస్తున్నామన్నారు. వేరే రాష్ట్రం నుంచి వచ్చిన, ఇతర సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులకు తమ దుకాణాలను అద్దెకిచ్చి వారితో హెయిర్‌కటింగ్ షాపులను పెట్టించడంపై నిరసన వ్యక్తం చేసి శుక్రవారం తమ దుకాణాలను మూసివేశారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో కలిగిరి పట్టణ నాయిబ్రాహ్మణ సేవాసంఘ కమిటీ సభ్యులు, నాయిబ్రాహ్మణులు పాల్గొన్నారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి



అంబేడ్కర్‌కు నివాళులర్పిస్తున్న నేతలు

వలేటివారిపాలెం, జనవరి 19 : విజయవాడలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆవిష్కరించిన నేపథ్యంలో మండలంలోని పోకూరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వైసీపీ శ్రేణులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం విజయవాడకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రఫీక్‌అహ్మద్, వైసీపీ మండల అధ్యక్షుడు పరిటాల వీరాస్వామి, పోకూరు సర్పంచు పర్రె కనకరత్నం, జగదీష్, లింగాబత్తిన మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ - భవిష్యత్తుకు గ్యారెంటీ'

అల్లూరు, జనవరి 19 : టీడీపీ అధిష్ఠానం ప్రవేశపెట్టిన బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం మండలంలో శుక్రవారం కూడా కొనసాగింది. చంద్రబాబు ప్రవేశపెట్టి మినీ మేనిఫెస్టోలోని ఆరు గ్యారెంటీలపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేస్తున్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు బీద గిరిధర్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ క్రమంలో భాగంగా అల్లూరు గాంధీకాలనీలోని స్థానిక నాయకుడు నజీర్‌బాషా ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు.

సాగునీటి కోసం రైతుల వాగ్వాదం

బిట్రగుంట, జనవరి 19: బోగోలు మండలం అల్లిమడుగులో వరి నాట్లు పూర్తికాక ముందే రైతుల్లో సాగునీటి కోసం గొడవలు మొదలయ్యాయి. కడనూతల చెరువు ఆయకట్టు కింద 120 ఎకరాలు అధికారకంగా 50 ఎకరాలు అనధికారకంగా సాగు చేస్తుంటారు. తెల్లగుంట రైతులకు సాగునీరు సక్రమంగా అందక నాటిన లేతపైరు ఎండిపోతుంది. కడనూతలకు చెందిన పేద దళితులకు ప్రభుత్వం పంపిణీ చేసిన భూములో నాటిన పంటకు సాగునీరు వేసుకోవడంతో దిగువ ప్రాంత రైతులకు నీరు అందటం లేదని శుక్రవారం రైతులు వాగ్వివాదానికి దిగారు. కడనూతల చెరువు నుంచి తక్కువ మోతాదులో సాగునీరు విడుదల చేయడం వలనే సమస్య వచ్చిందని చిన్ననన్నకారు రైతులు అంటున్నారు. పెద్దల చొరవతో ఇరుగ్రామాల రైతులు సద్దుమణిగారు కానీ ఎండుతున్న పంటకు సరిపడే సాగునీరు విడుదల విషయమైన సమస్య తీరలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి తగు చర్యలు చేపట్టకపోతే పంట నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు అంటున్నారు.